ఒపిఎస్ సాధించి తీరుతాం

- పోరాటాలకు పుట్టినిల్లు యుటిఎఫ్ : ఎన్ వెంకటేశ్వర్లు
- ఘనంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు ప్రారంభం

3

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 188 | విజయవాడ, సోమవారం 12 ఫిబ్రవరి 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 12 February 2024 | Rs

7

కుర్రాళ్లదీ అదే వ్యథ

- టైటిల్ పోరులో ఆసీస్ చేతిలో ఓటమి
- 254 పరుగుల ఛేదనలో యువ భారత్ చతికిల
- నాల్గోసారి టైటిల్ దక్కించుకున్న ఆస్ట్రేలియా

రాజస్థాన్‌లో దారుణం

- 20 మంది మహిళలపై సామూహిక అత్యాచారం
- అంగన్‌వాడీ ఉద్యోగాల ఆశచూపి వంచన

మహేంద్ర మేవాడా

మహేంద్ర చౌదరి

జోధ్‌పూర్ : రాజస్థాన్‌లో దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పేదరికం, నిరుద్యోగ రక్కసి రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న నేపథ్యంలో 20 మంది పేద మహిళలకు ఉద్యోగాలు ఆశగా చూపి ఇద్దరు దుండగులు సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..రాజస్థాన్‌లోని సిరోహికి చెందిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ మహేంద్ర మేవాడా, మాజీ మున్సిపల్ కౌన్సిల్ కమిషనర్ మహేంద్ర చౌదరి ఈ అఘాయిత్యాలకు పాల్పడ్డారు. అంగన్‌వాడీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొందరు మహిళలకు ఆశ్రయమిచ్చి అన్ని వసతులు కల్పించారు. మత్తు మందు కలిపిన ఆహారం అందించి స్పృహలో లేని మహిళలపై సామూహిక అత్యాచారం చేశారు. అలా 20 మందిపై ఈ దుర్మార్గులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఈ దృశ్యాలను చిత్రీకరించి విషయం బయటకు చెప్పకూడదంటూ తమను బెదిరించే వారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. రూ.ఐదు లక్షల చొప్పున డబ్బులు కూడా ఇవ్వాలంటూ ఒత్తిడి చేసినట్లు వారు పేర్కొన్నారు. పాలి జిల్లాకు చెందిన ఓ బాధిత మహిళ దుండగుల ఆగడాలపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమెకు మరికొందరు మహిళలు తోడుగా నిలిచారు. నిందితులపై ఎఫ్ఆర్ఐ నమోదు చేయకుండా.. తాము చేస్తున్నవి ఆరోపణలు మాత్రమేనని పోలీసులు కొట్టిపారేసినట్లు బాధితులు తెలిపారు. తమకు న్యాయం చేయాలని ఎనిమిది మంది మహిళలు రాజస్థాన్ హైకోర్టును ఆశ్రయించారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేయాల్సిందిగా న్యాయస్థానం ఆదేశించింది. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు డిఎస్‌పి పరాస్ చౌదరి తెలిపారు.

పోలీసులపై ఇసి కొరడా!

- ఉప ఎన్నికల్లో అక్రమాలపై నలుగురు సస్పెన్షన్, ఒకరు విఆర్‌కి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : తిరుపతి లోక్‌సభ ఉపఎన్నికల్లో అక్రమాలపై ఎలక్షన్ కమిషన్ మరింత జోరుగా ముందుకు వెళుతోంది. అక్రమాలకు పోలీసులను కూడా బాధ్యులను చేస్తూ ఐదుగురిపై చర్యలు తీసుకుంది. వారిలో నలుగురిని సస్పెండ్ చేయగా, ఒకరిని విఆర్‌కి బదిలీ చేసింది. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల సందర్భంగా దొంగ ఓట్లు నమోదుకు, అక్రమాలకు పాల్పడ్డారంటూ తిరుపతి ఆర్‌ఒగా వ్యవహరించిన అప్పటి తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ గిరిషాను, ఎఆర్‌ఒగా వ్యవహరించిన చంద్రమౌళిరెడ్డిని సస్పెండ్ చేసింది. ఉప ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు అందినా సరైన సమయంలో కేసులు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ పోలీసులపై చర్యలకు ఉపక్రమించింది. ఎన్నికల కమిషన్ ఆదేశం మేరకు... అప్పట్లో ఈస్ట్ పోలీస్ స్టేషన్ సిఐగా విధుల్లో ఉన్న శివప్రసాద్ రెడ్డి, వెస్ట్ పోలీస్ స్టేషన్ సిఐగా విధుల్లో ఉన్న శివప్రసాద్, తిరుపతి ఈస్ట్ ఎస్ఐ జయస్వాములు, హెడ్ కానిస్టేబుల్ ద్వారకానాథ్ రెడ్డిని సస్పెండ్ చూస్తూ, ప్రస్తుత అలిపిరి సిఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న అబ్బన్నను విఆర్‌కు బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డిఐజి అమ్మిరెడ్డి ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. మరింతమందిపై చర్యలు ఉంటాయనే ప్రచారం అధికారుల్లో గుబులు రేపుతోంది.

'ఒకే దేశం - ఒకే ఎన్నిక'

సమాఖ్య వ్యవస్థకే ముప్పు

- ముదురుతున్న నిరంకుశ పోకడలు
- ప్రజాస్వామ్య సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'ఒకే దేశం ఒకే ఎన్నిక' దేశ సమాఖ్య వ్యవస్థకే ముప్పు అని ప్రజాస్వామ్య సదస్సులో వక్తలు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంపై జాతీయ సదస్సు శని, ఆదివారాల్లో ఇక్కడి 'ఇండియా హాబిటాట్ సెంటర్'లో జరిగింది. ఈ సదస్సులో రాజకీయ నేతలు, మేధావులు, విద్యావేత్తలు, పౌర సమాజ సమూహాల సభ్యులు, మానవ హక్కుల పరిరక్షకులు, మాజీ సివిల్ సర్వెంట్లు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రెండు రోజుల పాటు చర్చలు జరిగిన అనంతరం సదస్సు ఈ మేరకు ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది.. ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చేందుకు వీలుగా అన్ని ప్రతిపక్ష రాజకీయ పార్టీలకు ఈ తీర్మాన ప్రతులను అందజేశారు. ఈ సదస్సులో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి,కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షిద్, కిసాన్ సభ ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా, ఎండి యూసుఫ్, ప్రముఖ చరిత్రకారిణి ప్రొఫెసర్ రొమిల్లా థాపర్, ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్, ప్రొఫెసర్ జయతి ఘోష్, రాధా కుమార్, ప్రొఫెసర్ ఎమెరిటా, ప్రొఫెసర్ జోయా హసన్, ప్రొఫెసర్ హసన్, ప్రొఫెసర్ బల్వీర్ అరోరా, ప్రొఫెసర్ విధు వర్మ, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ మాజీ డైరెక్టర్ పులిన్ నాయక్, మాజీ ఐఎఎస్ అమితాభా పాండే, తదితరులు ఈ సదస్సులో మాట్లాడారు. దేశంలో నిరంకుశత్వ పోకడలు పెరిగిపోతుండడం పట్ల వారంతా ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగం, మహిళలపై దాడులు , ఫాసిస్టు హిందూత్వ మూకల ఆగడాలు, రాజ్యాంగ హక్కుల హరణం, చట్టబద్ధమైన సంస్థలను నిర్వీర్యం

సీతారాం ఏచూరి

రొమిల్లా థాపర్

గావించడం, సమాఖ్య వ్యవస్థకు తూటు పొడవడం, సామాజిక న్యాయం వంటి వాటిపై సదస్సులో కూలంకషంగా చర్చ జరిగింది. అనంతరం ఈ సదస్సు ఈ కింది సూచనలు చేసింది.

- 'భారతీయ న్యాయ సంహిత', 'భారతీయ నాగరిక్ సురక్షా సంహిత', 'భారతీయ సాక్ష్యం' పేర్లతో తీసుకొచ్చిన మూడు బిల్లులను సమీక్షించాలి. అనుమానం ఆధారంగా అరెస్టులు చేసేందుకు, శాంతియుత నిరసనలను ఉగ్రవాద నిర్వచనం పరిధిలో చేర్చేందుకు ఈ బిల్లులు వీలు కల్పిస్తున్నాయని, అందుకే వీటిని తిరగదోడాల్సిన అవసరముంది.
- 'యుఎపిఎ', 'జమ్మూ కాశ్మీర్ పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్' వంటి క్రూరమైన చట్టాలను రద్దు చేయాలి. ఆంతరంగిక ఘర్షణల పరిష్కారానికి సాయుధ బలగాలను వినియోగించడం ఆపాలి. పిడి యాక్ట్‌ను యుద్ధ పరిస్థితుల్లో తప్ప ప్రయోగించరాదని 1951లో కమిటీ చేసిన సిఫార్సులను అమలు చేయాలి.
- ఎంఎస్‌పికి చట్టబద్ధమైన గ్యారెంటీ ఇవ్వాలి. ఇందుకు సంబంధించి స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫారసులను తు.చ తప్పక పాటించాలి. పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించాలి. పిడిఎస్, ఎండిఎంఎస్, ఐసిడిఎస్ కోసం విభిన్న ఆహార పంటలను సేకరించి, వాటికి కూడా ఎంఎస్‌పిని వర్తింపజేయాలి.
- 1947కి ముందున్న ప్రార్థనా స్థలాల విషయంలో యదాతథ స్థితిని కొనసాగించాలని చెబుతున్న 1992 ప్రార్థనా స్థలాల చట్టానికి ప్రభుత్వాలు కచ్చితంగా కట్టుబడి ఉండాలి. జాతి, మతం, కులం, లింగం, వైకల్యం ప్రాతిపదికన విద్య, ఉపాధి కల్పన తదితర రంగాలలో పౌరుల పట్ల వివక్షకు తావు లేకుండా చూసేందుకు ఒక సమగ్ర చట్టాన్ని తీసుకురావాలి. బహుళత్వాన్ని పరిరక్షించేందుకు ఒక కమీషన్‌ను ఏర్పాటు చేయాలి. వివక్షాపూరిత సిఎఎని రద్దు చేయాలి.
- స్వతంత్ర నిజ నిర్ధారణ బృందాలకు మద్దతు ఇవ్వాలి. ఈ నిజనిర్ధారణ బృందాలకు, మీడియా సంస్థలకు మధ్య సహకారం పెంపొందాలి. పార్లమెంటు కవరేజి, ప్రభుత్వ మంత్రిత్వ శాఖల రిపోర్టింగ్ స్వేచ్ఛగా నిర్వహించేందుకు వీలుగా మీడియాపై యాక్సెస్‌పై ఆంక్షలు తొలగించాలి.
- ఎన్నికల సంఘం, సిబిఐ, ఇడి స్వయం ప్రతిపత్తిని పునరుద్ధరించాలి. అఖిల భారత న్యాయ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.
- 2011లో రూపొందించిన రాజకీయ పార్టీల (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ అఫైర్స్) బిల్లును అమలులోకి తీసుకురావాలి. ఎన్నికల కమిషనర్ల నియామకంలో ప్రభుత్వ పెత్తనానికి ఆసరా కల్పిస్తున్న 2023 చట్ట సవరణను రద్దు చేయాలి. నియామక కమిటీలో ప్రభుత్వం నియమించే ప్రతినిధి స్థానే భారత ప్రధాన న్యాయమూర్తికి చోటు కల్పించాలి. ఎలక్టోరల్ బాండ్ విధానాన్ని ఎన్నికల సంఘం గట్టిగా వ్యతిరేకించాలి.
- ఆర్టీఐని బలోపేతం చేయాలి. 2019-23లో ఆర్టీఐ చట్టానికి తీసుకొచ్చిన తిరోగమన సవరణలను రద్దు చేయాలి. లోక్‌పాల్, లోకాయుక్త చట్టాన్ని సవరించి, ఎంపిక కమిటీలో అతిపెద్ద పార్టీ నాయకుడిని చేర్చాలి. కేంద్రంలో లోక్‌పాల్‌తో సమానమైన ఫ్రేమ్‌వర్క్‌తో రాష్ట్రాలలో లోకాయుక్తలను ఏర్పాటు చేయాలి. కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగపరచడాన్ని అరికట్టాలి.

వన్ నేషన్, వన్ ఎలక్షన్ వంటి చర్యలు భారతదేశ సమాఖ్య నిర్మాణాన్ని దెబ్బ తీస్తాయి గనుక ఇందుకు సంబంధించిన మిగతా 2లో

42కి పెరిగిన డయేరియా కేసులు

- జిజిహెచ్‌లో 24 గంటలు వైద్యం
- హెల్ప్ లైన్ ఏర్పాటు
- కలెక్టర్, కమిషనర్‌తో మంత్రి సమీక్ష

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రజిని

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి, గుంటూరు

గుంటూరులో తాగునీటిలో ఏర్పడిన సమస్య వల్ల వాంతులు, విరోచనాలు, తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో చికిత్స పొందుతున్న వారి సంఖ్య 42కు పెరిగింది. దీంతో, జిజిహెచ్‌లో 24 గంటలు వైద్య సేవలందిస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని తెలిపారు. బాధితుల కోసం హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేశామని, 8341396104 నంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని చెప్పారు. అధికారులతో మంత్రి సమీక్షించారు.

శనివారం సాయంత్రానికి డయేరియా బాధితుల సంఖ్య 21కి చేరగా, వీరిలో ఒక మహిళ మరణించారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు మరో 21 మంది ఆస్పత్రిలో చేరారు. అయితే, శనివారం ఆస్పత్రికి వచ్చి చికిత్సలు చేయించుకున్న వారిలో ఏడుగురు ఆరోగ్యంగా ఉండడంతో డిశ్చార్జి చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. ఆదివారం ప్రత్యేకంగా బాధితుల కోసం ఏర్పాటు చేసిన పోస్ట్ ఆపరేటివ్ వార్డును ఆయన పరిశీలించారు. పలువురు రోగులు తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో ప్రత్యేకంగా చికిత్స అందిస్తున్నారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని ఐసియుకి తరలించారు. మరో ముగ్గురు చిన్నారుల పరిస్థితి కూడా విషమంగా ఉండడంతో వారికి ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. వాంతులు, విరోచనాల వల్ల నిస్సత్తువ ఏర్పడడంతో ఎక్కువ మందిలో ఆందోళన కనిపిస్తోందని సూపరింటెండెంట్ చెప్పారు. అధిక రక్తపోటు, షుగర్ ఉన్న వారిని కూడా గుర్తించి వైద్యం అందిస్తున్నామని ఆయన తెలిపారు. పోస్ట్ ఆపరేటివ్ వార్డ్‌లో 40 పడకలను అందుబాటులో ఉంచామని చెప్పారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో నీటి కాలుష్యం వల్ల అనేక మంది ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. పలువురు అర్బన్ హెల్త్ సెంటర్లలో చేరారు. మెడికల్ షాపుల్లో మందులు తెచ్చుకుని ఇళ్ల వద్ద చికిత్సలు పొందే వారు, ఆర్ఎంపిల వద్ద చికిత్సలు చేయించుకుంటున్నా వారూ ఉన్నారు. పులిచింతల నుంచి నీరు కలుషితమై వస్తోందని, ఉండవల్లి పంపింగ్ సెంటర్‌లో పూర్తి స్థాయిలో క్లీనింగ్ కావడం లేదని, అందువల్ల ప్రజలు నీటిని కాచి చల్లార్చుకొని తాగాలని అధికారులు ప్రకటనలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. డయేరియా ప్రబలి ప్రజలు ఆస్పత్రులకు వెళ్తున్నారని విమర్శలు రావడంతో నగర కమిషనర్ చేకూరి కీర్తి ఆదివారం తెల్లవారుజామున నీటి సరఫరా జరిగే ప్రాంతాల్లో నేరుగా కుళాయిల వద్ద శ్యాంపిల్స్ తీసి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. క్లోరినేషన్ తగిన మోతాదులోనే ఉందని ఆమె చెప్పారు. నీటి పరిశుభ్రతలో లోపాలులేవని, వాంతులు, విరోచనాలకు ఇతర కారణాలు కూడా ఉంటున్నాయని మిగతా 5లో

వేర్వేరు చోట్ల నీట మునిగి ఐదుగురు మృతి

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్రంలో ఆదివారం జరిగిన రెండు ఘటనల్లో నీట మునిగి ఐదుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం రంప ఎర్రంపాలెం జెడ్‌పి హైస్కూలుకు చెందిన ఐదుగురు పదో తరగతి విద్యార్థులు విహారయాత్ర కోసమని అల్లూరి జిల్లా రంపచోడవరం మండలం ఐ.పోలవరం సమీపంలో ఉన్న సీతపల్లి వాగు వద్దకు వచ్చారు. వాగులో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి కాకర వీర వెంకట అర్జున్ (16), అండిబోయిన దేవి చరణ్ (16), లావేటి రామన్ (16) చనిపోయారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం ధర్మారావుపేటకు చెందిన అద్దేపల్లి చందు (17), తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాళ్లపూడికి చెందిన గగన్ సందేశ్ (12) సరిపల్లి గ్రామంలోని తమ బంధువుల ఇంటికి పుట్టిన రోజు వేడుకకు హాజరయ్యారు. ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్లగా ప్రమాదవశాత్తూ కోమటికుంట వద్ద కాలుజారి బోదెలో పడి మరణించారు.

సభలో పాల్గొన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న నారా లోకేశ్

'ఉక్కు' భూములు కాజేసే యత్నం

- టిడిపి అధికారంలోకి వస్తే ప్రభుత్వమే కొనుగోలు చేసి ప్లాంట్‌ను కాపాడుతుంది
- ఏటా డిఎస్‌సి నిర్వహణ
- 'శంఖారావం'లో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ హామీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరించి ఆ భూములను కాజేసేందుకు వైసిపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. వచ్చే ఎన్నికలకు కేడర్‌ను సమాయత్తం చేసేందుకు చేపట్టిన శంఖారావం కార్యక్రమాన్ని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం, పలాస, టెక్కలిలో నిర్వహించిన బహిరంగ సభల్లో లోకేష్ ప్రసంగించారు. తాము అధికారంలోకి వస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రాష్ట్ర ప్రభుత్వమే మిగతా 2లో

నగరి బహిరంగ సభలో అభివాదం చేస్తున్న వైఎస్ షర్మిల

జగన్‌ను గద్దె దింపాలి

- ఒక్క సీటు లేని బిజెపితో పాలక, ప్రతిపక్ష పార్టీల ట్రై యాంగిల్ లవ్
- ప్రత్యేక హోదా సాధన కాంగ్రెస్ పార్టీకే సాధ్యం : వైఎస్ షర్మిల

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం), నగరి

వైఎస్.రాజశేఖర్‌రెడ్డి బిడ్డ అయిన తాను తెలంగాణలో ఓ నియంతను గద్దె దింపించానని, మన రాష్ట్రంలోని నియంత జగన్ అన్ననూ గద్దె దింపుతానని పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన కోసం కాంగ్రెస్ పార్టీలో చేరానని తెలిపారు. ఆదివారం ఆమె చిత్తూరు జిల్లా నగరి బహిరంగ సభలో మాట్లాడుతూ ప్రత్యేక హోదా పదేళ్లు కావాలన్న చంద్రబాబు నాయుడు, తాము అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా సాధిస్తామని జగనన్న... ప్రత్యక్షంగా ఒకరు, పరోక్షంగా మరొకరు రాష్ట్రంలో ఒక్క సీటు కూడా లేని బిజెపితో ట్రైయాంగిల్ లవ్‌లో ఉన్నాయని ఎద్దేవా చేశారు. జగనన్న నవరత్నాల మిగతా 2లో

పెండింగ్ సమస్యలను పరిష్కరించకపోతే

14నుంచి ఉద్యమబాట

- 27న చలో విజయవాడ
- స్పందించకపోతే మెరుపు సమ్మె
- ఎపిజెఎసి వెల్లడి
- నేడు ఉద్యోగ సంఘాలతో మంత్రుల కమిటీ భేటీ

ఉద్యమ కార్యాచరణకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేస్తున్న శ్రీనివాసరావు, జి.హృదయరాజు తదితరులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలపై ఈనెల 12న ఉద్యోగ సంఘాలతో మంత్రుల కమిటీ సమావేశంలో ప్రభుత్వం వైపు నుంచి సానుకూలంగా నిర్ణయాలు రాకపోతే ఉద్యమ బాట పట్టనున్నట్లు ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బండి శ్రీనివాసరావు, సెక్రటరీ జనరల్ జి.హృదయరాజు తెలిపారు. విజయవాడ గాంధీనగర్ ఎపి ఎన్‌జిఒ భవన్‌లో ఆదివారం ఎపి జెఎసి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యమ కార్యాచరణకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. అనంతరం బండి శ్రీనివాసరావు, హృదయరాజు మీడియాతో మాట్లాడుతూ 13లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఈనెల 14న నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావడంతోపాటు తహశీల్దార్, సబ్‌కలెక్టర్, కలెక్టర్లకు మెమోరాండమ్‌లు ఇవ్వడం, 15, 16 తేదీల్లో నల్లబ్యాడ్జీలు ధరించి మధ్యాహ్న భోజన విరామ సమయంలో నియోజకవర్గ స్థాయిలో పాఠశాలల్లో నిరసనలు, 17న నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు నిర్వహించడం చేయాలని నిర్ణయించారు. 20న జిల్లా కేంద్రాల్లో (కలెక్టరేట్ల వద్ద) ర్యాలీలు, ధర్నాలు చేపట్టాలని, 21 నుంచి 24 వరకు అన్ని జిల్లా కేంద్రాల పర్యటనలు చేయాలని, 27న చలో విజయవాడ నిర్వహించాలని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే మెరుపు సమ్మెకు దిగాలని ఎపి జెఎసి విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు మిగతా 2లో

పాపిరెడ్డిపాలెంలో భూపోరాటం

- ఇళ్ల స్థలాల కోసం జెండాలు పాతిన పేదలు

అప్పుల ఊబిలో కేంద్రం

- కొండలా పెరుగుతున్న రుణాలు
- రాష్ట్రాలపై ఆంక్షలు విధిస్తున్న కేంద్రం
- సామాన్యులకు శాపంగా మారిన ప్రభుత్వ విధానాలు

లోపలి పేజీలో..

జగన్‌ను గద్దె దింపాలి

(మొదటిపేజీ తరువాయి)

పేరుతో ప్రజలకు మోసం చేశారాని, హోదా సాధనకు ఒక్క పోరాటమూ చేయలేదని విమర్శించారు. చంద్రబాబునాయుడు రాజధాని అమరావతి అంటూ సింగపూర్ గ్రాఫిక్స్ చూపారని, జగన్ మూడు రాజధానులంటూ ఒక్క రాజధానినీ కట్టలేదని దుయ్యబట్టారు. రాష్ట్రానికి హోదా వస్తే పరిశ్రమలు వస్తాయని, మన బిడ్డల బతుకులు బాగు పడుతాయన్నారు. హోదా సాధన కోసం వైసిపి, టిడిపి ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. రాజన్న పాలనలో రైతాంగం పండగని, జలయజ్ఞం రాజన్న కల అని వివరించారు. ఆయన బిడ్డ జగన్ పాలనలో రైతులకు గిట్టుబాటు ధరలేదని, పంట నష్టపరిహారం అందడం లేదని, స్థిరీకరణ నిధి లేదని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక నిరుపేద విద్యార్థులు విద్యకు దూరమయ్యారని అన్నారు. జాబ్ కేలండర్ పేరుతో నిరుద్యోగులను జగన్ మోశారని విమర్శించారు. 30 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నా, ఆరు వేల పోస్టులకు డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చారని, ఇదీ కూడా ఎన్నికల ముందు ఇవ్వడం రాజకీయ లబ్ధి కోసమేనని అన్నారు. అధికారంలోకి వచ్చాక ప్రజల ముందుకు రాని, కనీసం ఎమ్మెల్యేలకు కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వని ముఖ్యమంత్రి జగన్... ఇప్పుడు ఎన్నికలు వస్తుండడంతో 'సిద్ధం' అంటూ మళ్లీ ప్రజలను మోసం చేసేందుకే వస్తున్నారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మించారా? హోదా సాధించారా? బిడ్డల బాగు కోసం ప్రాజెక్టులు సాధించారా? అవేవీ చేయకుండా మళ్లీ ఎన్నికల ముందు మాయ మాటలతో వస్తున్నారని దుయ్యబట్టారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై తొలి సంతకం చేస్తానని గతంలో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని ఈ సందర్భంగా షర్మిల గుర్తు చేశారు. హోదా కోసం, మీ బిడ్డలు బాగు కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని, రాజన్న రాజ్యం సాధించాలని కోరారు. 'ఎల్లార్కం వణక్కం, నాన్ యార్ తెరిమిల్లా? రాజశేఖరరెడ్డి పొన్ను' అంటూ తమిళ భాషలో ప్రారంభించి ఆకట్టుకున్నారు. రాజన్న బిడ్డపై సోషల్ మీడియాలో వెకిలిగా మాట్లాడుతుంటే, పోస్టులు పెడుతుంటే అన్న జగన్ స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. 'మీరా... రాజన్న రాజ్యం సాధించేది' అని ప్రశ్నించారు. నగరి ఎమ్మెల్యే, మంత్రి రోజా నగరికి ఏమీ చేయలేదని, ఆమె భర్త, అన్నదమ్ములు మంత్రులుగా చెలామణీ అవుతూ మైనింగ్, శాండ్ దోచుకుంటున్నారని విమర్శించారు. టిడిపిలో ఉన్నప్పుడు రాజశేఖరరెడ్డిని గుడ్డలూడదీసి కొడతానని రోజా అన్న మాటలను వైఎస్ఆర్ అభిమానులు మరిచిపోలేదని అన్నారు. ఈ సభలో మాజీ ఎంపిపి రామచంద్రారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయనకు ఆమె కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పిసిసి మాజీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించకపోతే 14నుంచి ఉద్యమబాట

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. 12వ పిఆర్‌సిలో మధ్యంతర భృతి (ఐఆర్) 30శాతం తక్షణమే చెల్లించాలని, పెండింగ్‌లోని రెండు కొత్త డిఎలు (01.01.2023, 01.07.2023) తక్షణమే విడుదల చేయడంతోపాటు సిపిఎస్ వారి డిఎలు 90శాతం క్యాష్ రూపంలోనివి చెల్లించాలని కోరారు. పిఎఫ్, ఎపి జిఎల్ఐ లోన్స్, క్లైమ్స్, 11వ పిఆర్‌సి, డిఎ, సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, మెడికల్ రీ ఎంబర్స్‌మెంట్ బిల్స్ బకాయిలు చెల్లించాలని, 01.09.2024కు ముందు నోటిపై అయి అనంతరం నియామకమైన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీమ్ (ఓపిఎస్) అమలు చేయాలని ఎపి జెఎసి డిమాండ్ చేసింది. పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ 70 - 75 ఏళ్లమధ్య వయసు వారికి 10శాతం, 75-80 ఏళ్ల వారికి 15శాతం మంజూరు చేయాలని కోరారు. టీచర్లకు అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలని, జీఓ నెంబరు 117ను రద్దు చేయాలని, సిపిఎస్/జిపిఎస్‌లను రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలని బండి శ్రీనివాసరావు, జి.హృదయరాజు డిమాండ్ చేశారు. వీటితో పాటు పలు డిమాండ్లను ప్రభుత్వం ముందుంచనున్నట్లు వారు వెల్లడించారు.

పాపిరెడ్డిపాలెంలో భూపోరాటం

- ఇళ్ల స్థలాల కోసం జెండాలు పాతిన పేదలు

ప్రజాశక్తి- తోటపల్లి గూడూరు (నెల్లూరు జిల్లా)

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా టిపి గూడూరు మండలం టిపి గూడూరు బిట్-2 పాపిరెడ్డిపాలెం గ్రామంలో 497, 498 సర్వే నెంబర్లలోని 15 ఎకరాల మిగులు భూమిని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక పేదలు ఆదివారం స్వాధీనం చేసుకుని ఎర్ర జెండాలు పాతారు. 500 మంది పేదలు ఇళ్ల స్థలాల కోసం హద్దులు ఏర్పాటు చేసుకొని స్థలాలు కేటాయించుకున్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూములు, ఇళ్ల స్థలాల కోసం పేదలు గతంలో పలు దఫాలు వినతిపత్రాలు ఇచ్చారని తెలిపారు. అయినా, అధికారులు స్పందించకపోవడంతో గతంలో భూపోరాటానికి దిగి భూములను ఆక్రమించుకున్నారని గుర్తు చేశారు. వీటికి పట్టాలు ఇస్తామని ఆ సందర్భంగా అధికారులు ఇచ్చిన హామీ అమలు కాకపోవడంతో పేదలు మళ్లీ జెండాలు పాతారని తెలిపారు. పేదలు, వ్యవసాయ కార్మికుల పక్షాన తమ సంఘం నిరంతరం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జొన్నలగడ్డ వెంకమ్మ, మంగళ పుల్లయ్య, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆలూరు తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

మిగులు భూముల్లో జెండాలు పాతుతున్న పేదలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు ముందస్తు నోటీసులు

ప్రజాశక్తి- యంత్రాంగం

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు ముందస్తు నోటీసులు జారీ చేశారు. గృహనిర్బంధాలు చేపట్టారు. ఆదివారం సిఐటియు నేతల ఇంటికి వెళ్లి నోటీసులు అందజేశారు. 'చలో విజయవాడ'కు ప్రభుత్వ అనుమతులు లేనందున ఎవరూ వెళ్లరాదని నోటీసుల్లో పేర్కొన్నారు. ఏలూరులో ఆ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు డిఎన్‌విడి.ప్రసాద్‌కు పోలీసులు నోటీసులు జారీ చేసి, సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్బంధించారు. తిరుపతిలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళికి, మరి కొందరి నేతలకు, విద్యుత్ కార్మికులకు నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా కందారపు మురళి మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల పట్ల ప్రభుత్వం తీవ్రమైన వివక్షను ప్రదర్శిస్తోందన్నారు. సమస్యలు పరిష్కరించాలని, ఆందోళనలకు పిలుపు ఇచ్చినప్పుడల్లా అప్రజాస్వామిక పద్ధతులకు పాల్పడుతూ నోటీసులు ఇవ్వడం అన్యాయమన్నారు. విశాఖలో సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్‌ను చింతూరులోని ఎర్రంపేటలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

తిరుపతిలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మురళికి నోటీసు అందజేస్తున్న పోలీసులు

ఏలూరులో సిఐటియు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్‌కు నోటీసు అందజేస్తున్న సిఐ వెంకటేశ్వరరావు

2 ఎంపి స్థానాల్లో పోటీ

- తెలంగాణ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో సిపిఎం రెండు స్థానాల్లో పోటీ చేయనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్ర, శనివారాల్లో పార్టీ కార్యదర్శివర్గం, రాష్ట్ర కమిటీ సమావేశాలను హైదరాబాద్‌లోని మాకినేని బసవపున్నయ్య భవన్‌లో నిర్వహించారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, విజయరాఘవన్ హాజరైన ఆ సమావేశాల్లో శాసనసభ ఎన్నికల తర్వాత రాజకీయ పరిస్థితి, లోక్‌సభ ఎన్నికలు, తదితర అంశాలను చర్చించినట్టు తెలిపారు. కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జరగబోయే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌కు సిపిఎం మద్దతు ప్రకటించింది. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని, ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ఇళ్లు, ఇళ్ల స్థలాల పోరాటం కొనసాగుతోందని, ఆ పోరాటానికి పూర్తి మద్దతు ఇస్తూ, గుడిసెవాసులకు అండగా ఉండాలని నిర్ణయించింది. ఈ పోరాటంలో పాల్గొన్న వారిపై పెట్టిన కేసులు వెంటనే ఎత్తివేయాలని, పేదలకు వెంటనే ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని సిపిఎం డిమాండ్ చేసింది. కార్మికుల కనీస వేతనాల సమస్యపై కేంద్రీకరించాలని నిర్ణయించింది. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో రెండు పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేయాలని, స్థానిక జిల్లా కమిటీలతో చర్చించిన అనంతరం త్వరలో సీట్లను ఖరారు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తమ్మినేని తెలిపారు.

25వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

- సిఎం క్యాంపు కార్యాలయం ముట్టడికి ఎఐవైఎఫ్ యత్నం
- పలువురి అరెస్టు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ ఎఐవైఎఫ్ చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించేందుకు ఆదివారం ఆ సంఘం నాయకులు ప్రయత్నించారు. విజయవాడలోని రాష్ట్ర అతిథి గృహం నుంచి ప్రదర్శనగా బయలుదేరిన ఎఐవైఎఫ్ నేతలను పోలీస్ కమిషనర్ బంగ్లా వద్ద పోలీసులు అడ్డుకున్నారు. నాయకులను బలవంతంగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నాయకులు లంకా గోవింద రాజులు మాట్లాడుతూ 23వేల పోస్టులతో డిఎస్‌సి నోటిఫికేషన్ ఇస్తానని ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ హామీ ఇచ్చారని తెలిపారు. హామీని అమలు చేయకుండా ఇప్పుడు నిరుద్యోగులను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 25వేల పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 6,100 పోస్టులకే నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగులను నట్టేట ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25వేల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తొమ్మిదేళ్ల క్రితం రద్దు చేసిన అప్రెంటీస్ విధానాన్ని తిరిగి అమలు చేయాలని చూడటం సిగ్గుచేటని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు, కేంద్రప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం నోటిఫికేషన్‌కు పరీక్షకు 90 రోజుల గడువు ఉండాలని తెలిపారు. ఈ అంశాన్ని పట్టించుకోకుండా కేవలం 40 రోజుల్లో పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం ఒత్తిడి చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాళీ పోస్టులను మొత్తం భర్తీ చేయకపోతే సిఎం జగన్‌ను ఇంటికి పంపడానికి నిరుద్యోగ యువత సిద్ధంగా ఉందని హెచ్చరించారు. అరెస్టయిన వారిలో ఆ సంఘం నాయకులు షేక్ మున్నా, రణత్ యాదవ్, వియ్యపు రాజు, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ఆందోళనకారులను ఈడ్చుకెళ్తున్న పోలీసులు

అరెస్టులను ఖండించిన సిపిఐ

ఎఐవైఎఫ్ నాయకులను అక్రమంగా అరెస్టు చేయటాన్ని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. 6,100 పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేసి మెగా అంటూ యువతను ప్రభుత్వం దగా చేసిందని పేర్కొన్నారు.

కోల్డ్‌స్టోరేజి బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి

- అగ్ని ప్రమాదంపై విచారణకు సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంటూరు జిల్లా దుగ్గిరాలలో శుభమ్ మహేశ్వరి కోల్డ్ స్టోరేజిలో జరిగిన అగ్ని ప్రమాదంపై విచారణ జరిపి బాధిత రైతులను ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఆదివారం లేఖ రాశారు. జనవరి 19న జరిగిన ఈ అగ్నిప్రమాదంలో దాదాపు 1.2 లక్షల పసుపు బస్తాలు కాలిపోయి రైతులు ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు. ఈ ప్రమాదంపై గుంటూరు జిల్లా కలెక్టరు జనవరి 30న ఒక కమిటీతో విచారణ చేశామని చెబుతున్నా రైతులకు ఎలాంటి సమాచారం ఇప్పటిదాకా ఇవ్వలేదని పేర్కొన్నారు. రైతులు తమ పసుపు పంట అగ్నికి ఆహుతైన అంశంపై ఆందోళనలో ఉన్నారని, తక్షణం ఆర్థికంగా నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. క్వింటా పసుపునకు రూ.11,000 ఇవ్వాలని, పూర్తి ఇన్సూరెన్సును చెల్లించాలని, కోల్డ్ స్టోరేజి అద్దెలు, బ్యాంకు రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత రైతుల లిస్టు అధికారికంగా ప్రకటించాలని కోరారు. కోల్డ్ స్టోరేజి యాజమాన్యం ఇన్సూరెన్స్ చేసిన కంపెనీలు ఏవి అనే అంశాలను కూడా రైతులకు సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అగ్ని ప్రమాదంపై విచారణ నివేదికను పారదర్శకంగా ఇవ్వాలని కోరారు. కొంతమంది రైతులు బాండ్లు యాజమాన్యానికి ఇచ్చినా సరుకు డెలివరీ ఇవ్వలేదని, రికార్డు పుస్తకాల్లో ఇచ్చినట్లు రాసుకున్నందున వారికి కూడా నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ఐఎన్‌టియుసి నాయకులు నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1095వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి అనుబంధ కాంట్రాక్టు కార్మిక సంఘం కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రం సెయిల్‌లో కలపాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ఆషామాషీగా వచ్చింది కాదని, ప్రాణ త్యాగాలతో, పోరాటాలతో సాధించుకున్న కర్మాగారమని గుర్తుచేశారు. దీన్ని కాపాడుకునేందుకు ఎటువంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్రం విడిపోయాక మిగిలిన ఏకైక అతిపెద్ద కర్మాగారం ఇదేనని, కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందని తెలిపారు. ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేస్తే బిజెపిని ప్రజలు సమాధి చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో సన్యాసిరావు, పరంధామయ్య, అవతారం, భాస్కర్‌రావు, పివి.నగేష్ పాల్గొన్నారు.

'ఉక్కు' భూములు కాజేసే యత్నం

(మొదటిపేజీ తరువాయి)

కొనుగోలు చేసి కాపాడుకుంటుందని, ఉద్యోగుల ఉద్యోగ భద్రత తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మూడు రాజధానులంటూ మూడు ముక్కలాట ఆడుతున్నారని, విశాఖకు ఒక్క కంపెనీని కూడా తీసుకురాలేకపోయారని విమర్శించారు. విశాఖలో భూ కబ్జాలకు సహకరించలేదని తహశీల్దార్ రమణయ్యను హత్య చేశారని, ఈ సంఘటన రాష్ట్రంలోని పరిస్థితికి అద్దం పడుతోందని అన్నారు. మూతపడిన సుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని గత ఎన్నికల్లో జగన్ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మాట తప్పారని విమర్శించారు. ఏటా డిఎస్‌సి తీస్తామని చెప్పి వైసిపి ప్రభుత్వం మోసం చేసిందని, తాము అధికారంలోకి వస్తే ఏటా డిఎస్‌సి నిర్వహిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. జగన్ పాలనలో విద్యుత్ ఛార్జీలు తొమ్మిదిసార్లు పెరిగాయని, ఆర్‌టిసి ఛార్జీలు, ఇంటి పన్ను పెంచారని, చెత్తపై పన్ను విధించారని విమర్శించారు. జగన్ ప్రతిదానికి సిద్ధం... సిద్ధం... అంటున్నారని, జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారా? అని ఎద్దేవా చేశారు. జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించి రైతులను, సంక్షోభంలో కూరుకుపోయిన జీడి పరిశ్రమలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి అప్పలరాజు కొండలను సైతం మింగేస్తున్నారని పలాస సభలో ఆరోపించారు.

సిపిఎస్ రద్దు చేయాలని వినతి

శంఖారావం యాత్రకు వచ్చిన లోకేష్‌కు సిపిఎస్ రద్దు చేయాలని యుటిఎఫ్, ఎపి సిపిఎస్ఇఎ నాయకులు వినతిపత్రాలు ఇచ్చారు. డిఎస్‌సి 1998 క్వాలీఫై అభ్యర్థులు, ఆర్ఎంపిలు, పిఎంపిలు, అగ్రిగోల్డ్ బాధితులు, బెంతు ఒరియాలు, మత్స్యకార కండ్ర సామాజిక తరగతి నాయకులు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గౌతు శిరీష, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఒమర్ అబ్దుల్లా, సల్మాన్ ఖుర్షిద్

'ఒకే దేశం ఒకే ఎన్నిక' సమాఖ్య వ్యవస్థకే ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

రామ్‌నాథ్ కోవింద్ కమిటీని రద్దు చేయాలి.

- రాష్ట్ర ప్రజలను వారిచే ఎన్నుకోబడిన ప్రతినిధులతో సంప్రదించకుండా రాష్ట్రాల సరిహద్దులను మార్చకూడదు. తక్షణమే జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర హోదాను పునరుద్ధరించి, ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించాలి.
- ముఖ్యమంత్రులతో సంప్రదించి మాత్రమే గవర్నర్‌లను నియమించాలి.
- ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ చట్టం (ఎఫ్ఆర్‌బిఎం యాక్ట్)ను పున్ణపరిశీలించాలి. రుణం తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వ అనుమతి అవసరం అక్కర్లేకుండా రాజ్యాంగంలోని ఆర్టికల్ 293(3)ని సవరించాలి. రాష్ట్రాలకు అవశేష ఆర్థిక అధికారాలు ఉండాలన్న రాజమన్నార్ కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకోవాలి.
- మణిపూర్‌కు పార్లమెంటేరియన్లు, పౌర సమాజ ప్రతినిధులతో కూడిన నిజ-నిర్ధారణ కమిషన్‌ను పంపాలి.
- గత దశాబ్దంలో ప్రవేశపెట్టిన పాఠ్యపుస్తకాలు, పాఠ్యాంశాల్లోని అన్ని మార్పులను సమీక్షించాలి. మతపరమైన, భాషా ఆధారిత సంఘాల మధ్య సౌభ్రాతృత్వాన్ని ప్రోత్సహించే సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించాలి.
- ఆదివాసీ హక్కుల (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం- 2006 ప్రకారం కమ్యూనిటీ అటవీ హక్కులను అమలు చేయాలి. ఈ చట్టానికి తూట్లుపొడుస్తూ 2023లో తీసుకొచ్చిన సవరణను రద్దు చేయాలి.
- ఉపాధి హామీని విస్తరించి, బలోపేతం చేయాలి. రోజు కూలీని రూ.500కు పెంచాలి. ఆధార్ ఆధారిత తప్పనిసరి చెల్లింపు వ్యవస్థను రద్దు చేయాలి. సకాలంలో వేతనాలు చెల్లించాలి. కేంద్రం నుండి రాష్ట్రాలకు న్యాయంగా రావాల్సిన నిధులను విడుదల చేయాలి. మహిళా కార్మికుల కోసం ప్రత్యేకంగా పట్టణ ఉపాధి హామీని ఏర్పాటు చేయాలి. యువత ఉపాధి కోసం ప్రత్యేక ప్రోత్సాహకాలతో ఎంఎస్‌ఎంఈలకు ప్రత్యేకంగా రూపొందించిన పాలసీ ప్యాకేజీలను అందించాలి. శ్రామిక ప్రజల అన్ని విభాగాలకు ప్రధాన కార్మిక ప్రమాణాలను విస్తరింపజేస్తూ, అసంఘటిత కార్మికుల కోసం సమగ్ర చట్టాన్ని రూపొందించాలి. గిగ్ కార్మికుల సామాజిక భద్రత, ప్రాథమిక పని పరిస్థితులను నిర్ధారించడానికి అగ్రిగేటర్లు, ప్రభుత్వం, కార్మికులతో త్రైపాక్షిక ఒప్పందాలను కుదుర్చుకోవాలి.
- ఎలాంటి వివక్ష లేకుండా ఆరోగ్యాన్ని మానవ హక్కుగా గుర్తించాలి. కంటైనర్ టెర్మినల్ కోసం గ్రేటర్ నికోబార్ దీవుల్లోని వందల హెక్టార్ల అటవీప్రాంతాన్ని తొలగించే యత్నాలను విరమించుకోవాలి. ముఖ్యంగా దుర్బలమైన హిమాలయాల్లో విచక్షణారహిత నిర్మాణాలను అరికట్టాలి.

ఉద్యమబాటలో డ్రైవర్లు

- 106 చట్టసవరణ రద్దుకు పోరుబాట
- డ్రైవర్ల ఆందోళనలకు వాహన యాజమాన్యాల సంఘీభావం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రవాణారంగాన్ని సంక్షోభంలోకి నెట్టేలా కేంద్రం క్రిమినల్ చట్టాల్లో తెచ్చిన మార్పులపై డ్రైవర్లు ఉద్యమబాట పట్టారు. భారతీయ న్యాయ సంహిత 106 (1), 106 (2) చట్టసవరణ డ్రైవర్లనే కాదు వాహన యజమానులను కూడా ఆందోళనకు గురిచేస్తోంది. ఇండియన్ పీనల్ కోడ్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత చట్టాన్ని తీసుకొచ్చిన సందర్భంగా కేంద్రం పలు క్రిమినల్ చట్టాల్లో సవరణలు చేసింది. ఇప్పటిదాకా డ్రైవర్లు చేసే వాహన ప్రమాదాలను 304ఎ సెక్షన్ కింద ప్రమాదాలుగానే చూసేవారు. ఇప్పుడు ఒక వ్యక్తి మరణానికి కారకుడని, నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్ చేశారని 106 సెక్షన్ కింద కఠిన శిక్షలను డ్రైవర్లకు పెడుతూ చట్టసవరణ చేశారు. ప్రమాదం జరిగాక మేజిస్ట్రేట్‌కు, పోలీస్‌లకు సమాచారం ఇస్తే 106(1) కింద ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానాను ఎదుర్కోవాలి. ఒకవేళ సమాచారం ఇవ్వకుండా పరారైతే 106 (2) సెక్షన్ కింద పదేళ్ల జైలు, జరిమానాను ఎదుర్కోవాల్సి వుంటుంది. జరిమానాలు కూడా దాదాపు రూ.10 లక్షల వరకూ విధించేలా సవరణ చేశారు. సాధారణంగా ఎక్కడ ప్రమాదం జరిగినా తప్పొప్పులను చూడకుండా ప్రజలు మూకుమ్మడిగా దాడిచేసే ఘటనలు ఎక్కువగా వుండటంతో ఎక్కువమంది డ్రైవర్లు ఈ దాడులకు భయపడి దగ్గరలోని పోలీస్‌స్టేషన్లకు వెళతారు. సంఘటనా స్థలం వద్ద నుంచి పరారయ్యారని కేసు పెడితే ఎలా అని డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. ఈ సవరణలతో రవాణారంగంలో కీలకమైన డ్రైవింగ్ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడనుంది. వాహనాల ప్రమాదాల కింద ఎవరైనా మరణిస్తే ఇప్పటిదాకా డ్రైవర్లు సులభంగా కట్టుకునేలా జరిమానాలు, రెండేళ్లకు మించకుండా శిక్షలు వుండేవి. ఇకపై ప్రమాదవశాత్తు జరిగే హిట్ అండ్ రన్, ర్యాష్ డ్రైవింగ్‌ను నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్ కిందకు చేర్చి శిక్షలను పదేళ్లకు పెంచారు. ఇప్పటిదాకా 304ఎ కింద ప్రమాదాల కింద ఎవరైనా చనిపోతే గరిష్టంగా రెండేళ్లకు మించి శిక్ష వుండేది కాదు. రాష్ట్రంలో 22 వేల మంది ఆర్‌టిసిలో డ్రైవర్లు వుంటే, దాదాపు లక్షన్నర మందికి పైగా ప్రైవేట్ ట్రక్ డ్రైవర్లు వున్నారు. 10 లక్షల మంది వరకూ ఆటో డ్రైవర్లు, రెండు లక్షల మంది వరకూ కార్ డ్రైవర్లు వున్నట్లు అంచనా. ఇప్పటికే వేతనాలు తక్కువ అని, పని వేళలు ఎక్కువ అని చాలామంది డ్రైవింగ్ వృత్తికి దూరంగా పోతున్న పరిస్థితి వుంది. దేశవ్యాప్తంగా రవాణాశాఖ నిర్వహించిన సర్వేలో ట్రక్కు డ్రైవర్ల కొరత 30శాతం వుందని నివేదికలు చెబుతున్నాయి. ఇప్పుడు ప్రమాదవశాత్తు జరిగే ప్రమాదాలకు బాధ్యత వహించి లక్షల రూపాయల జరిమానాలను కట్టి పదేళ్లు జైలులో వుండాలంటే డ్రైవింగ్ వృత్తిలోకి ఎవరూ రారని ట్రక్కు యజమానులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రం తెచ్చిన 106 చట్టసవరణను పూర్తిగా రద్దుచేయాలని డ్రైవర్లతోపాటు యజమానులు కూడా ఆందోళనలకు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే ఆర్‌టిసిలోని ఉద్యోగ సంఘాలన్నీ ఉద్యమ కార్యాచరణను ప్రకటించాయి. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో ఈ చట్ట సవరణను రద్దు చేయాలని డ్రైవర్లు ఆందోళనా కార్యక్రమాలు, సదస్సులను నిర్వహించారు. 106(1), 106(2) చట్ట సవరణ రద్దే ప్రధానమైన డిమాండ్‌గా రవాణారంగ కార్మికులు ఈ నెల 16న దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు, రైతు సంఘాలు నిర్వహించనున్న గ్రామీణ బంద్, రంగాల వారీ సమ్మెను జయప్రదం చేసేందుకు సమాయత్తమవుతున్నారు.

మహా స్వాప్నికుడు పుస్తకం ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ, తదితరులు

చంద్రబాబుపై 'మహా స్వాప్నికుడు' పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడుపై సీనియర్ పాత్రికేయుడు పూల విక్రమ్ రచించిన మహా స్వాప్నికుడు పుస్తకాన్ని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ ఆవిష్కరించారు. కువైట్‌లో స్థిరపడిన ప్రవాసాంధ్రుడు వెంకట్ రచించిన ఈ పుస్తకావిష్కరణ సభలో జస్టిస్ గోపాలగౌడ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు గొప్ప విజనరీ వున్న దార్శనికుడని అన్నారు. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన చంద్రబాబు కృషి, పట్టుదల, నిరంతర శ్రమ ఆయుధాలుగా అంచెలంచెలుగా ఎదిగారంటూ, ఆయన జీవిత విశేషాలను పుస్తకంలో వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు టిడి జనార్దన్, నెట్టెం రఘురామ్, నన్నపనేని రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

జమకాని ఆసరా 4వ విడత : ఆచంట సునీత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి ఆసరా 4వ విడత ఆసరా నిధుల చెల్లింపు బటన్ నొక్కి 20 రోజులవుతున్నా ఇప్పటికీ లబ్ధిదారుల ఖాతాల్లో జమకాలేదని తెలుగునాడు అంగన్‌వాడీ, డ్వాక్రా సాధికార కమిటీ అధ్యక్షురాలు ఆచంట సునీత తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డికి ఆదివారం లేఖ రాశారు. గత నెల 23వ తేదీన అనంతపురం జిల్లా ఉరవకొండ బహిరంగ సభలో సిఎం ప్రకటించారని తెలిపారు. కొన్ని చోట్ల గ్రూపులకు చెక్కులు కూడా పంచారని, డబ్బులు పడలేదని పేర్కొన్నారు. మహిళలందరికీ రుణమాఫీ కింద వైఎస్ఆర్ ఆసరా పథకం అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పడమే కానీ క్షేత్రస్థాయిలో పొదుపు సంఘాలకు లబ్ధి శూన్యమని విమర్శించారు. మరోవైపు డ్వాక్రా మహిళలను ఆసరా వారోత్సవాలకు, రాజకీయ సభలకు తరలివచ్చే ముడిసరుకుగా మార్చేశారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కె. పట్టాభిరామ్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల ముద్రణలో అవినీతి చోటుచేసుకుందని ఆరోపించారు.

అప్పుల బాధతో యువ కౌలురైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - మాచర్ల (పల్నాడు జిల్లా)

అప్పుల బాధతో యువ కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన పల్నాడు జిల్లా మాచర్ల మండలం కంభంపాడులో ఆదివారం వెలుగు చూసింది. మాచర్ల పట్టణ సిఐ శరత్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. కంభంపాడుకు చెందిన ఉప్పుతోళ్ల శివకృష్ణ (27) వ్యవసాయం చేస్తుంటారు. గతేడాది కంభంపాడులో ఆరెకరాల్లో వరి, మాచర్ల పట్టణ శివారులో రెండెకరాల్లో కంది పంటలను కౌలుకు సాగు చేశారు. పొలాలకు నీరు సరిగా అందక దిగుబడులు బాగా తగ్గి అప్పులు పాలై కొద్ది రోజులుగా తీవ్రంగా మథనపడుతున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంటి నుండి బయటకు వెళ్లారు. అర్థరాత్రైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు రాత్రంతా వెదికి తెల్లవారుజామున శివకృష్ణ సాగు చేస్తున్న పొలం వద్దకు వెళ్లి చూడగా ఆయన అక్కడ చెట్టుకు ఉరేసుకుని కనిపించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. శివకృష్ణకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

విశాఖ నుంచి పోటీ

- డాక్టర్ కెఎ పాల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న సాధారణ ఎన్నికల్లో విశాఖ నుంచి ఎంపిగా పోటీ చేస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎపాల్ వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు కేంద్రంలో ఉన్న బిజెపికి దాసోహం అంటున్నాయని, ఆర్‌ఎస్‌ఎస్ దేశానికి ప్రమాదకారిగా మారిందన్నారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మీట్‌ది ప్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల కోసం పోరాటం చేసిన ఎన్‌టిఆర్‌కు , పార్లమెంట్ మాజీ స్పీకర్ జిఎంసి బాలయోగికి ఎందుకు భారతరత్న ఇవ్వలేదని ప్రశ్నించారు. మీట్‌ది ప్రెస్ కార్యక్రమంలో ఎపియు డబ్ల్యుజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, ఐజెయు సభ్యులు ఎస్‌కె బాబు, విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు కంచల జయరాజ్, దాసరి నాగరాజు పాల్గొన్నారు.

మేడారానికి పోటెత్తిన సందర్శకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మ దేవతలను దర్శించుకునేందుకు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిషా, మహారాష్ట్ర నుంచి వేలాది మంది సందర్శకులు తరలివచ్చి సమ్మక్క సారలమ్మ వనదేవతలను దర్శించుకున్నారు. సందర్శకుల తాకిడికి జంపన్నవాగు కిటకిటలాడింది. ఈ నెల 21 నుంచి జాతర అధికారకంగా ప్రారంభమవుతుంది. 23న రాష్ట్రపతి ముర్ము మేడారం రానున్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

- ప్రభుత్వ పాఠశాలల విభాగంలో విజేత కుప్పం జడ్‌పి స్కూల్
- ప్రయివేటు పాఠశాలల విభాగంలో కాకినాడ ఆదిత్య హైస్కూల్

ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విభాగంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో నిర్వాహకులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా యడ్లపాడు మండల కేంద్రంలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యాన రెండు రోజులపాటు నిర్వహించిన 34వ రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఆదివారంతో ముగిశాయి. రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి హాజరైన విద్యార్థులకు బహుముఖ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పరీక్షించారు. క్విజ్, ప్రాక్టికల్, ప్రయోగ, రాత, ఆలోచనాత్మక తదితర పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో విజేతగా చిత్తూరు కుప్పం జడ్‌పి పాఠశాల విద్యార్థులు నిలవగా, రెండో స్థానాన్ని సత్యసాయి జిల్లాకు చెందిన బిఎస్‌ఆర్ బాయ్స్ ఎంపి స్కూల్ విద్యార్థులు, మూడో స్థానాన్ని అనకాపల్లి జిల్లా మాడుగుల జడ్‌పి పాఠశాల విద్యార్థులు దక్కించుకున్నారు. వీరికి ధ్రువపత్రాలతోపాటు బహుమతులు, జ్ఞాపికలను కల్పతరువు సంస్థల డైరెక్టర్ ఎస్.సుబ్బారెడ్డి, కీర్తి డెవలపర్స్ సంస్థ అధినేత ముద్దుల వెంకట కోటయ్య, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరపున ఊటుకూరు శ్రీనివాసరావు, యడ్లపాడు నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ సృజన, డైరెక్టర్ పోపూరి వెంకటేశ్వర్లు ప్రదానం చేశారు.

ప్రయివేటు పాఠశాలల విభాగంలో మొదటి బహుమతిని కాకినాడకు చెందిన ఆదిత్య హెస్కూల్ విద్యార్థులు గెలుచుకోగా, రెండో బహుమతిని కర్నూలుకు చెందిన మాంటిస్సోరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్, మూడో బహుమతిని ఏలూరుకు చెందిన కుమారి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు సాధించారు. సంబరాల్లో పాల్గొన్న ప్రతి జట్టుకు జెవివి తరుపున ధ్రువపత్రం, జ్ఞాపికలను అందించారు. వీటిని జెవివి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ప్రధాన కార్యదర్శి కె.రామారావు, కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్, సి.హెచ్.జయప్రకాశ్, కెఎంఎంఆర్ ప్రసాద్, వైఎస్.నాగేశ్వర్, గోపాల్‌రావు, టి.సురేశ్, జెవివి పల్నాడుజిల్లా అధ్యక్షులు డి.బుజ్జిబాబు, చిలకలూరిపేట నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి ప్రదానం చేశారు.

జగన్‌ను గద్దెదించడమే ప్రధాన లక్ష్యం

- దళిత గర్జన సభలో మాజీ ఎంపి హర్షకుమార్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపి హర్షకుమార్

సిఎం జగన్‌ను గద్దె దించడమే లక్ష్యంగా దళితులంతా ఐక్యం కావాలని మాజీ ఎంపి జివి.హర్షకుమార్ పిలుపు నిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ వేమగిరిలో ఆదివారం నిర్వహించిన దళిత సింహగర్జన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో దళితులను ఐక్యం చేస్తామన్నారు. వైసిపి ప్రభుత్వం రద్దు చేసిన 25 పథకాలను పునరుద్ధరించే పార్టీకే దళితుల మద్దతు ఉంటుందని తెలిపారు. నవరత్నాల పేరుతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందన్నారు. మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన ఊచకోతపై ముఖ్యమంత్రి కనీసం స్పందించలేదని గుర్తు చేశారు. ఎన్నికల ముందు తానూ క్రైస్తవుడిని అని చెప్పి, అధికారం వచ్చిన తరువాత బిజెపి పక్షాన చేరి మోసం చేశారని విమర్శించారు. వేతనాల కోసం అంగన్‌వాడీలు చేసిన పోరాటానికి సమాజం మొత్తం సంఘీభావం తెలిపిందన్నారు. సలహాదారు పేరుతో ప్రభుత్వం నుంచి రూ.200 కోట్లు వేతనం తీసుకున్న సజ్జల రామకృష్ణారెడ్డికి అంగన్‌వాడీల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. రాజధానిలో ఎస్‌సి రైతులపై అట్రాసిటీ కేసు నమోదు చేశారని, విభజన హామీలను పూర్తిగా విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎస్‌ను రద్దు చేస్తానని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదన్నారు. నవరత్నాలకు సబ్‌ప్లాన్ నిధులనే కేటాయిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు సభ పెట్టడం సీటు కోసమే అంటూ తనపై కొంత మంది దుష్ప్రచారం చేస్తున్నారని, తాను విద్యార్థి దశ నుంచే అనేక పోరాటాలు చేశానని తెలిపారు. జగన్ అహంకారానికి దళితుల ఆత్మగౌరవానికి మధ్య జరిగే పోరాటమే దళిత సింహగర్జన అన్నారు. తొలుత రాష్ట్రంలో దళితులపై జరిగిన దాడులను ఆయన వివరించారు. దళితుల పక్షాన ఉంటామని చెబుతూనే పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్న వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా పాస్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు జార్జి శ్రీమంతుల, మాల మహాసేన అధ్యక్షులు అలగా నరసింహ, బొజ్జా ఐశ్వర్య, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పార్టీలో ఉండి ద్రోహం చేయను..

- మాజీ మంత్రి బాలినేని కీలక వ్యాఖ్యలు..!

ప్రజాశక్తి-టంగుటూరు (ప్రకాశం జిల్లా)

'నేను పార్టీలో ఉండి ద్రోహం చేయలేను.. ఇద్దరు మంత్రులను నా పక్కన పెట్టి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నాకు పరీక్ష పెట్టారు.. ఇద్దరిలో ఎవరు ఓడినా బాలినేనే ఓడించారంటారు..' అంటూ మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రకాశం జిల్లా టంగుటూరులోని అనంతవరం, సూరారెడ్డిపాలెం గ్రామాల్లో ఆదివారం జరిగిన ఇంటిగ్రేటెడ్ సచివాలయ భవనాల సముదాయం ప్రారంభోత్సవానికి మంత్రి ఆదిమూలపు సురేష్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. అనంతవరం గ్రామంలో మంత్రి సురేష్ మాట్లాడుతూ.. కొండపి నియోజకవర్గం టిడిపి కంచుకోట అని, ఈ దఫా కొండపిలో నాయకులంతా ఐకమత్యంగా పనిచేసి వైసిపి జెండా ఎగురవేయాలన్నారు.

దీనిపై బాలినేని మాట్లాడుతూ.. మంత్రి సురేష్ వ్యాఖ్యాలతో తాను విభేదిస్తున్నానని చెప్పారు. కొండపి నియోజకవర్గంలో నాయకత్వ విభేదాల వల్లనే గత రెండు దఫాలుగా వైసిపి ఓటమిపాలైనట్లు తెలిపారు. ఇక్కడ నాయకులందరూ ప్రభుత్వ పనులు చేసేందుకు ముందుకు రావడంలేదని, పనులు చేస్తే బిల్లులు వస్తాయో.. లేదో అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. బాలినేని వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి.

విజేతలతో ముఖ్యఅతిథులు, నిర్వాహకులు

విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

సమాజం పట్ల బాధ్యత పెంచుకోవాలి

- గోదావరి బాలోత్సవం ముగింపు సభలో వక్తలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

చిన్న వయస్సు నుంచే సమాజం పట్ల బాధ్యతను పెంచుకోవాలని, చదువుతో పాటూ ఆటపాటల్లోనూ రాణించాలని పలువురు వక్తలు విద్యార్థులకు సూచించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాల ఆవరణలో రెండు రోజులుగా జరుగుతున్న గోదావరి బాలోత్సవం ముగింపు వేడుక ఆదివారం జరిగింది. బాలోత్సవం అసోసియేట్ అధ్యక్షులు వివిఎస్‌ఎస్.కృష్ణకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ మాజీ కమిషనర్ ఎం.జితేంద్ర, ప్రముఖ నాట్యాచార్యులు సప్పా దుర్గాప్రసాద్, శ్రీ వెంకటేశ్వర ఫైనాన్స్ అధినేత వేణుగోపాల్, ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ ఎన్ఎస్-ఎస్.శర్మ, ప్రముఖ కవి డాక్టర్ అరిపిరాల నారాయణరావు తదితరులు మాట్లాడారు. మంచి సమాజం కోసం అవసరమైన మానవ వనరులను అందించేందుకు ఇటువంటి బాలోత్సవాలు ఎంతో అవసరమన్నారు. ర్యాంకుల, మార్కుల కోసమే అన్నట్లుగా కొనసాగుతున్న ప్రస్తుత విద్యావిధానం వల్ల దేశానికి ఎలాంటి ప్రయోజనమూ లేదని తెలిపారు. విద్యతోపాటు, సమాజం పట్ల బాధ్యతను పెంచుకునేలా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరముందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి బాలోత్సవాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. గోదావరి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి పిఎస్ఎన్.రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.తులసి రెండు రోజుల కార్యకలాపాలను వివరించారు. 32 విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో సుమారు 5,600 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ముగింపు సభలో ఎల్ఐసి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్.రామ్మోహనరావు, సంఘ సేవకులు మాటూరి సిద్ధార్థ, స్వామి యాడ్స్ అధినేత భాస్కర్, ప్రముఖ వైద్యులు చైతన్యశేఖర్, అమరావతి బాలోత్సవం నిర్వాహకులు టి.క్రాంతికుమార్ పాల్గొన్నారు.

మెటీరియల్ కాంపొనెంట్ నిధుల విడుదలకు మీనమేషాలు

- రాష్ట్ర వ్యాప్తంగా రూ.2415 కోట్ల బకాయి
- కేంద్ర ప్రభుత్వ నిర్వాకంతో నిలిచిన భవన నిర్మాణాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అర్ధాంతరంగా నిలిచిపోయిన సచివాలయ భవనం

జాతీయ ఉపాధి హామీ చట్టంలో భాగంగా రాష్ట్రానికి మంజూరు చేయాల్సిన మెటీరియల్ కాంపొనెంట్ నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం మీనమీషాలు లెక్కిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా రూ.2415 కోట్లకు పైగా బకాయి ఉన్నప్పటికీ చెల్లింపునకు ముందుకు రావడం లేదు. దీంతో, చాలాచోట్ల భవన నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. సంబంధిత కాంట్రాక్టర్లు తాము అప్పుల పాలయ్యామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల నిర్మాణ పనులు ఏళ్ల తరబడి మొండి గోడలతో వెక్కిరిస్తున్నాయి. ఉపాధి పథకం ద్వారా చేపట్టిన పనులు, వాటికి చెల్లిస్తున్న బిల్లుల ఆధారంగా మెటీరియల్ కాంపొనెంట్ పనులకు కూడా కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాల్సి ఉంది. అలా వచ్చిన మొత్తంతో మన రాష్ట్రంలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బికె), వైఎస్‌ఆర్ విలేజ్ క్లీనిక్ భవన నిర్మాణాలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సచివాలయాలకు రూ.46 లక్షలు, ఆర్‌బికెలకు రూ.23.94 లక్షలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లకు రూ.20.80 లక్షల అంచనా వ్యయంతో 2019 నుంచి భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. రాష్ట్రంలో 9,585 గ్రామ సచివాలయ భవనాలు తలపెట్టగా ఇప్పటి వరకు 6840 భవన నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించారు. 7436 రైతు భరోసా కేంద్రాల భవన నిర్మాణ పనులు ప్రారంభించగా, వీటిలో 5296 భవనాలను పూర్తి చేశారు. 5414 వెల్‌నెస్ సెంటర్లుకుగాను 3059 పూర్తయ్యాయి. అధికారిక లెక్కల ప్రకారం సచివాలయాలు, ఆర్‌బికెలు 71 శాతం, విలేజ్ క్లీనిక్‌లు 57 శాతం భవనాల చొప్పున నిర్మాణ పనులు పూర్తి చేశారు. సచివాలయాలకు రూ.4179 కోట్లు, ఆర్‌బికెలకు రూ.1780 కోట్లు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లకు రూ.1126 కోట్ల చొప్పున మొత్తం రూ.7085 కోట్లు ఖర్చుకాగా, కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు విడుదల చేసింది కేవలం రూ.4,670 కోట్లు మాత్రమే. విజయనగరం జిల్లాలో సుమారు రూ.28 కోట్లకుపైగా బకాయి ఉంది. ఈ నిధుల కోసం సంబంధిత కాంట్రాక్టర్లు సుమారు ఏడాదిగా ఎదురు చూస్తున్నారు. వాస్తవానికి ఎక్కువ చోట్ల వైసిపి నాయకులు, సర్పంచులు, వారి మద్దతుదారులే ఈ నిర్మాణ పనులు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోవడంతో వీరంతా ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీరంతా గ్రామాల్లో రాజకీయంగా క్రియాశీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం ఎన్నికలు దగ్గర పడుతుండడం వల్ల ఎమ్మెల్యేలు, మంత్రుల్లో భయాందోళన మొదలైంది. ఇందుకనుగుణంగానే మంత్రి బొత్స సత్యనారాయణ తన సొంత జిల్లా విజయనగరంలో బకాయిల చెల్లింపునకు హామీ ఇచ్చినప్పటికీ కేంద్రం నిధులు విడుదల చేయకపోవడంతో మాట నిలబెట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. రాజకీయంగా కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న రాజీ ధోరణి వల్ల ఇటువంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు రాజకీయ నాయకుల నోట వినిపిస్తోంది.

మాట్లాడుతున్న డాక్టర్ మురళీకృష్ణ, వేదికపై డాక్టర్ చక్రవర్తి

బాలల్లో కేన్సర్‌పై అవగాహన అవసరం

- కెజిహెచ్ పిడియాట్రిక్ హెచ్ఒడి డాక్టర్ బిఎస్.చక్రవర్తి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

బాలల్లో కేన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కెజిహెచ్ పిడియాట్రిక్ హెచ్ఒడి డాక్టర్ బిఎస్.చక్రవర్తి అన్నారు. అంతర్జాతీయ బాల్య కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖలోని మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, శ్రేయ కేన్సర్ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యాన ఆదివారం ఎంవిపి కాలనీలోని మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ కేన్సర్‌ను ఎదుర్కోవడం సామాన్యమైన విషయం కాదని, ఈ వ్యాధి ద్వారా వచ్చే సమస్యలను నిర్మూలించేందుకు ఒక్కసారి మందులు వాడితే సరిపోదని, తరుచూ పరీక్షలు చేయించుకుంటూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కేన్సర్ వ్యాధిగ్రస్తులు ధైర్యంతోపాటు సానుకూల దృక్పథం కలిగి ఉండాలన్నారు. మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ.. తమ ఆస్పత్రిలో గత ఎనిమిదేళ్లలో 1,380 మంది పీడియాట్రిక్ రోగులకు చికిత్స చేశామని, 70 శాతం మందిలో కేన్సర్‌ను నివారించామని తెలిపారు. బాల్య కేన్సర్లలో రకాలను తెలియజేశారు. ప్రతి మూడు నిమిషాలకు ఒక పిల్లవాడు కేన్సర్‌తో మృతి చెందుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మ్యాజిక్ షో ఆకట్టుకుంది. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బాల స్టాలిన్ చౌదరి, డాక్టర్ ప్రవీణ పూన్న, డాక్టర్ రజనీ ప్రియ, డాక్టర్ కిషోర్ పాల్గొన్నారు.

ఎస్‌టిఎఫ్ఐ, యుటిఎఫ్ పతాకాలను ఎగురవేస్తున్న నాయకులు నక్కా వెంకటేశ్వర్లు, కె.సురేష్‌కుమార్

ఒపిఎస్ సాధించి తీరుతాం

- పోరాటాలకు పుట్టినిల్లు యుటిఎఫ్ : నక్కా వెంకటేశ్వర్లు
- ఘనంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

యాభై ఏళ్ల చరిత్ర కలిగిన యుటిఎఫ్ పోరాటాలకు పుట్టినిల్లని, ఉద్యమాలతో ప్రభుత్వం మెడలు వంచి ఉపాధ్యాయుల ప్రతి హక్కులను కాపాడి, ఒపిఎస్‌ను సాధించుకుంటామని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కర్నూలు సిల్వర్ జూబిలీ కళాశాలలో ఆదివారం యుటిఎఫ్ స్వర్ణోత్సవ నగారా, డప్పుల కొట్టి సంబరాలను ప్రారంభించారు. ముందుగా యుటిఎఫ్ పతాకాన్ని రాష్ట్ర సహాధ్యక్షులు కందుకూరి సురేష్ కుమార్, ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని నక్కా వెంకటేశ్వర్లు ఆవిష్కరించి, అక్కడ ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ లోగోను నాయకులు ఆవిష్కరించారు. సభాధ్యక్షులుగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యుఆర్ఎ రవికుమార్ వ్యవహరించారు. ఈ సందర్భంగా నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యుటిఎఫ్ ఉద్యమంలో అమరులైన కుటుంబాలకు సంఘం అండగా నిలుస్తుందని తెలిపారు. పాత పెన్షన్ విధానం సాధించి తీరుతామని, సిపిఎస్ రద్దయ్యేవరకు పోరాటం దశల వారీగా చేస్తామని చెప్పారు. యుటిఎఫ్ జిల్లా తొలి ప్రధాన కార్యదర్శి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి పుల్లయ్య మాట్లాడుతూ అంకితత్వం, ఉద్యమ స్ఫూర్తి ఒక్క యుటిఎఫ్‌కే సాధ్యమన్నారు. పోరాటాలతోనే ఉపాధ్యాయుల ప్రయోజనాలు సాధించుకుంటామని తెలిపారు. ప్రతీ కార్యకర్త యుటిఎఫ్ కుటుంబ సభ్యుడన్న విషయాన్ని నాయకత్వం మరచిపోదని, ఆనాటి నుండి ఈనాటి వరకు అదే ఒరవడి కొనసాగుతోందని తెలిపారు. సురేష్ కుమార్ మాట్లాడుతూ ఈ సంబరాలు ఏడాదంతా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతాయన్నారు. యుటిఎఫ్ మాజీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు నరసింహులు మాట్లాడుతూ అనేక ఉద్యమాలు నిర్మించి ఉద్యోగ ప్రయోజనాలు సాధించి పెట్టిన ఘనచరిత్ర కలిగిన సంఘమైన యుటిఎఫ్ కోసం చివరి శ్వాస వరకు శ్రమిస్తానన్నారు. కోడుమూరు మాజీ ఎంఇఒ నాగభూషణం శెట్టి యుటిఎఫ్ సుదీర్ఘ ఉద్యమ చరిత్రను పద్యంలో వివరించారు. కెంగార మోహన్ రచించిన యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల గేయాన్ని ప్రజా నాట్యమండలి సీనియర్ నాయకులు ఎంపి బసవరాజు సభలో ఆలపించారు. గతంలో నాయకత్వ బాధ్యతలు నిర్వర్తించిన వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌పాటి స్వాగతం పలుకగా సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు నాగమణి, జయరాజు, ఎల్లప్ప, నంద్యాల జిల్లా కార్యదర్శి సుధాకర్, సిఐటియు నాయకులు రామాంజనేయులు, జెవివి నాయకులు సుధీర్ రాజు , జిల్లా ఆర్థిక కార్యదర్శి యెహోషువా సందేశం ఇచ్చారు.

శ్రీనుతో మాట్లాడుతున్న మాల్యాద్రి, కెవిపిఎస్ నాయకులు

శ్రీనుకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి

- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి

ప్రజాశక్తి - ముమ్మిడివరం(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి కేసులో నిందితుడు జనిపల్లి శ్రీనివాసరావుకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో విశాఖ సెంట్రల్ జైల్ నుంచి కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో ఇంటికి చేరుకున్న శ్రీనివాసరావును ఆయన ఆదివారం పరామర్శించారు. బాధితునికి, ఆయన కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. చట్టాల అమల్లో నిర్లక్ష్య వైఖరి కారణంగా శ్రీను ఆరేళు జైలులోనే గడపాల్సి వచ్చిందని తెలిపారు. ఈ కేసులో ముఖ్యమంత్రి కోర్టుకు హాజరు కాకపోవడం వల్ల ఇన్నేళ్లు జైలులోనే మగ్గాల్సి వచ్చిందన్నారు. పౌరహక్కుల నేతలు, హైకోర్టు న్యాయవాది సలీం, దళిత సంఘాలు శ్రీనుకు అండగా ఉండడం అభినందనీయమన్నారు. జైల్లో శ్రీను డిగ్రీ పూర్తి చేయడం, పుస్తకాలను అధ్యయనం చేయడం అభినందనీయమన్నారు. విచారణ లేకుండా దీర్ఘకాలం రిమాండ్‌లో మగ్గిన శ్రీనుకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆయన కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. నేటి మనువాద మతోన్మాదుల పాలనలో ఎస్‌సి, ఎస్‌టిల రక్షణ కోసం ఉన్న చట్టాలు నిర్వీర్యమవుతున్నాయని తెలిపారు. విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాలు సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల ఇలాంటి ఘటనలు చర్చకు రావట్లేదని చెప్పారు. సమావేశాలను సక్రమంగా నిర్వహించాలని కోరారు. ఆయన వెంట జిల్లా నాయకులు గుదే దుర్గాప్రసాద్, శెట్టిబత్తుల తులసీరావు, యలమంచిలి బాలరాజు, శరత్ తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న హైకోర్టు మాజీ న్యాయమూర్తి భవాని ప్రసాద్

ఓటుతోనే సమాజ మార్పు

- సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ అధ్యక్షులు భవానీ ప్రసాద్
- రాష్ట్రంలో నిశబ్ద విప్లవం ఆరంభమైంది : నిమ్మగడ్డ రమేష్ కుమార్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఓటుతోనే సమాజ మార్పు అని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ అధ్యక్షులు, హైకోర్టు మాజీ న్యాయమూర్తి భవానీ ప్రసాద్ అన్నారు. 'ఓటు వేద్దాం - ప్రజాస్వామ్య పరిరక్షణ' పేరుతో కర్నూలులోని త్రిగుణ ఇన్ హోటల్‌లో ఆదివారం ఆ సంస్థ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం ఉండాల్సిన స్థితిలో లేదన్నారు. రాను రాను నైతికంగా పతనం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నుకోవాల్సిన వారిని ఎన్నుకోకపోతే మన భవిష్యత్తు ప్రశ్నార్థకంగా తయారవుతుందని తెలిపారు. సరైన వారిని ఎన్నుకోకపోవడం వల్ల అత్యధిక మంది ప్రజలు బాధను అనుభవిస్తున్నారన్నారు. డబ్బు, మద్యం కోసం ఓటు వేసే పరిస్థితిని మార్చగలిగితే సమాజం ముందుకు వెళుతుందని తెలిపారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కార్యదర్శి, ఎపి మాజీ ఎన్నికల ప్రధానాధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిశబ్ద విప్లవం ఆరంభమైందని, బెదిరింపులకు లొంగకుండా ఓటు వేసే పరిస్థితి వస్తుందని తెలిపారు. పౌరుల్లో సామాజిక బాధ్యతను గుర్తు చేయడానికే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ విచక్షణతో ఓటు వేయాలని కోరారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఉపాధ్యక్షులు, మాజీ ముఖ్య కార్యదర్శి ఎల్‌వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికిన నాయకులు ఎన్నికల తరువాత ప్రజల గురించి పట్టించుకోవడం లేదన్నారు. దోచుకోవడంపై ఉన్న దృష్టి ప్రజలకు ఇచ్చిన హామీలపై ఉండడంలేదని విమర్శించారు. ప్రజల్లో చైతన్యం ఉంటే సరిపోదని, ప్రజాప్రతినిధుల్లోనూ చైతన్యం తేవాలన్నారు. సమావేశంలో లెట్స్ ఓట్ సంస్థ జాతీయ కన్వీనర్ సుబ్బరంగయ్య, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కోశాధికారి పాల్గుణ కుమార్, కార్యవర్గ సభ్యులు, తెలంగాణ మాజీ ఎన్నికల ప్రధానాధికారి నాగిరెడ్డి, పి.రఘు, రాంశంకర్‌నాయక్, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు కల్కూర చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఓటు వేద్దాం అనే కరపత్రాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

"అన్యాయాన్నెదిరిస్తే
నా గొడవకు సంతృప్తి
అన్యాయం అంతరిస్తే
నా గొడవకు ముక్తి ప్రాప్తి
అన్యాయాన్నెదిరించినవాడు
నాకు ఆరాధ్యుడు "

– కాళోజీ

రోజొకటి వస్తోంది..!

పంచభూతాలూ
నిన్ను వ్యతిరేకిస్తాయి
ఊపిరి సలపని వాతావరణం
నిన్ను చుట్టు ముడుతుంది
నీ తప్పులన్నీ నీకు తెలిసొచ్చే
రోజొకటి వస్తోంది

ఘడియ ఘడియకూ
నువ్వు కదిలినా కదలక పోయినా
కాలం ఆగదు
క్షణాల బతుకు ముళ్ళు
తిరుగుతూనే వుంటది
అన్నీ రోజులూ నీవి కావు
నిన్ను మడత బెట్టి కడిగేసే రోజొకటి వస్తది

వందిమాగధులంతా చెల్లా చెదరై పోతారు
ఉన్న పళంగా
అతికిచ్చుకున్న బలమంతా
పురాతన గోడలా కుప్ప కూలుతుంది
దుఃఖం రాల్చిన మట్టి దిబ్బల మధ్య
నీ అసలు అస్తిత్వ ఆనవాళ్లను
తడుముకునే రోజొకటి వస్తోంది!

చరిత్ర పటల్ని తిరగేసి చూడు
విర్రవీగే వెర్రి నియంతలంతా
కాలగర్భంలో కలిసి పోయారు
ఏదీ శాశ్వతం కాదు..
శిఖరంపై ఉన్నాననీ
చిటికెలు మిటకరియ్యకు
పాతాళంలో పడిపోయే రోజొకటి వస్తోంది!

అసామాన్య ఆవులింతలు తీయకు
నిద్రమత్తు వొదిలి
నిజాలు తేటతెల్లమైపోతాయి
అప్పుడు...
దేహమూ మనసూ
బోధివృక్షం ముందు మోకరిల్లుతోంది
చేతులు కాలిపోయి వుంటాయి
పత్ర హరితాలెవ్వీ కానరావు
నిరంతర ఆత్మఘోష లోంచి
నీ మనిషితనం గుర్తొచ్చే
రోజొకటి తప్పక గుర్తొస్తుంది..!

– డా.కటుకోఝ్వల రమేష్
99490 83327

ఓట్ ఫర్ ...

వల పన్నక ముందే
నూకలు జల్లుతారు
పక్షుల్లా పడిపోకండి
బలి ఇవ్వకముందే
బలంగా మేపుతారు
పశువుల్లా మోసపోకండి!
కల చెదరక ముందే
కళ్ళు తెరవండి
మనస్సాక్షిని చంపుకోకండి
మనుషుల్లా మెలగండి !

– పొలమరశెట్టి ఫ్రాన్సిస్
70320 34546

తొలి ప్రేయసి

ఆ అమ్మాయి
అమావాస్య కన్నా అందమైంది
నవ్వితే సూర్యతేజం –
చెరువు గట్టు మీద చేద బావి దగ్గరకి
చంకన బిందెతో
వస్తూ పోతూ వయ్యారంగా కనిపించేది
నల్ల కందిరీగ
తెల్ల పరికిణీలో వస్తున్నట్లుండేది
నడకలో కదుల్తున్న లోలాకులు
నా హృదయాన్ని కదిలిస్తుండేవి

అలా చూస్తూనే
ఒకరినొకరు చూసుకుంటూనే
చూపుల్తోనే ప్రేమ పూలు
పూయించాం
చూపుల్తోనే ప్రేమ పావురాలెగరేశాం
చూపుల్తోనే ప్రేమ మందిరంలో జీవించాం –
పచ్చని పైర గాల్లో
ఎల్లప్పుడూ
సంజ్ఞా పరిచ్ఛేదం వరకే పరిమితమయ్యాం
ఏ దుష్ట సంధి కార్యమై పోలేదు
సమర్థం కాని సమాస పదాలవ్వడం చేత
ఇల్లూ, చుట్టూ లోకం విభేదించింది
కలలు క్రియారహితమైనాయి

కాల ప్రవాహంలో తాను, నేను
వ్యతిరేక దిశల్లోకి వెళ్లిపోయాం!

ఇప్పటికీ
నల్లరంగు చొక్కా అన్నా
నల్ల కళ్లద్దాలన్నా
నల్ల చీమన్నా
మిక్కిలి మక్కువపడతాను మనసులో –

ఇటీవలే తెలిసింది!
తాను చీకట్లో చీకటై పోయిందని
వెన్నెల రాత్రిలోని చంద్ర బింబం
ఆమె చిరు దరహాసం అడిగి తీసుకుందని
ఆమె లేని లోకంలోని ఈ ఖాళీని
ఇక దేనితోనూ పూరించలేమని ...

– రవి నన్నపనేని
91821 81390

తెలుగు సాహితీవనం కవితా పురస్కారం -2024

తెలుగు సాహితీవనం కవితా పురస్కారం కోసం కవితలను ఆహ్వానిస్తున్నాం. నలుగురు విజేతలకు ఒక్కొక్కరికి రూ. 1,116 చొప్పున నగదు బహుమతితో పురస్కార ప్రదానం ఉంటుంది. హైదరాబాద్‌లో జరిగే తెలుగు సాహితీవనం 7వ వార్షికోత్సవ సభలో విజేతలకు పురస్కారం అందచేస్తాం. ఏదైనా సామాజిక అంశం పైన 25 లైన్లకు మించకుండా కవిత రాయాలి. కవితను టైప్ చేసి యూనికోడ్ పంపించాలి. పేరు, వివరాలు హామీపత్రం మీద మాత్రమే ఉండాలి. ఏ ఇతర మధ్యమాల్లోనూ ప్రచురించిన, పరిశీలనలో ఉన్న కవితను పంపకూడదు. కవితలను sahiti-vanam82@gmail.com కు మెయిల్ చేయాలి. కవితలను పంపటానికి చివరి తేదీ : 5.3.2024. నాలుగు పురస్కారాల్లో రెండు 25 వేల సభ్యులు ఉన్న తెలుగు సాహితీవనం సభ్యులకు కేటాయించాము. మరిన్ని వివరాలకు – 9490805404.

– తెలుగు సాహితీ వనం

విస్మయపరిచే 'ఇవీ, మన మూలాలు!'

మానవ ప్రస్థానం గురించీ, మరీ ముఖ్యంగా 'మన' మూలాల గురించీ తెలుగులో ఒక సాధికారిక గ్రంథంగా ఇటీవల విడుదలైంది కల్లూరి భాస్కరం రచన 'ఇవీ మన మూలాలు'. ఈ పుస్తకం గురించి ఇప్పుడు విస్తారమైన చర్చ జరుగుతోంది. ఈ పుస్తకం ఎందుకు చదవాలో చెప్పేముందు వారి మాటలు వినండి.

"మన విశ్వాసాలూ, ఇష్టా ఇష్టాలూ, రాజకీయ అవసరాలదీ కాకుండా, శాస్త్ర పరిశోధనల్లో జ్ఞానానిది పైచేయి అయినంతవరకూ, ఆ పరిశోధన క్రమంలో ఎలాంటి ఫలితాలు వచ్చినా, వాటిని తెరచిన బుద్ధితో ఆహ్వానించడమే మనం చేయగలిగిందీ, చేయవలసిందీ."

"ఒక్క మనదేశానికి మాత్రమే పరిమితమై చెప్పుకుంటే, జన్యు పరిశోధనలు భారత్‌లోకి ఆర్య ఇండో– యూరోపియన్ జనాల వలసను స్పష్టీకరించిన దరిమిలా, జనం సెంటిమెంటును వాడుకునే రాజకీయానికీ, జ్ఞానరంగానికీ మధ్య ఒక అసమ యుద్ధం ముమ్మరమైంది. ధర్మ పోరాటంలో తాను ఓడిపోతున్న పరిస్థితుల్లో రాజకీయం తమకు కలిసివచ్చే మేధావులూ, మీడియా సాయంతో అసత్యాలూ, అర్ధసత్యాలూ వక్రీకరణలే ఆయుధాలుగా అధర్మ పోరాటానికి దిగింది. అంతకన్నా కూడా అసలా చర్చ మీదే తెరదించేసి వ్యూహాత్మక మౌనం పాటించడమే మంచిదని కూడా క్రమంగా భావించినట్లు కనిపిస్తోంది."

నిజానికి కల్లూరి భాస్కరం గారి ఈ వాక్యాలే ఈ పుస్తకానికి ఆలంబన. నా ఈ సమీక్షకు పురికొల్పిన మాటలు కూడా ఇవే! ఇవీ 'మన' మూలాలు అనగానే మనకు తట్టేది ఒక గర్వాతిశయం. మన పూర్వీకుల గురించి గర్వంతో ఉప్పొంగిపోవాలన్న ఆసక్తి! ప్రతి మానవుడికీ ఇది సహజమేమో! మన జననం, మన జనం, మన ఊరు, మన దేశం, మన తాత ముత్తాతలు, మన వంశవృక్షం ... అబ్బా, ఈ 'మన'లో ఎంత ఆకర్షణ వుంది! ఈ అవ్యాజమైన అనురాగాన్ని ఏ జన్యువు పెంచి పోషించిందో తెలీదు కానీ, మన మూలాల గురించి తెలుసుకోవాలన్న తపన మనని నిరంతరం ఉత్సాహంతో నింపేస్తుంది. ఈ సందర్భంలో అలెగ్స్ హేలీ రాసిన 'ది రూట్స్' మనని అమితంగా ప్రభావితం చేసిన పుస్తకాల్లో ఒకటి.

ప్రాణికోటి ప్రస్థానం అంతా కలగాపులగం. అదేమీ అధ్యాయాలకు అధ్యాయాలు ఏదో మెథడలాజికల్‌గా పద్ధతిగా అల్లుకుపోయిన కథేమీ కాదు. నిజానికి అదొక పేజీలు చిరిగిన పుస్తకం. అన్నీ అతుకుల బొంతలు. తదుపరి పేజీలో క్లూ దొరుకుతుందన్న ఉత్సాహంతో పేజీ తిప్పితే అక్కడ ఆ పేజీనే గల్లంతై ఉంటుంది.

తొలి మానవ ఆనవాళ్లు మొదలయ్యాక వాటి వలసలన్నీ అయోమయంగా ఊహకు అందనంతగా, ఎటువంటి ఆధారాల్లేకుండా పోవడానికి చాలా కారణాలే ఉన్నాయి. మనం భూగోళంగా భావించే ఈ మట్టి (నీటి) ముద్ద ఒకప్పుడెలా ఉందో ఆ తర్వాత అది పెళ్ళలుగా విడిపోయి ఖండాలుగా అవతరించినప్పుడూ, మంచు యుగాలు కొనసాగినప్పుడూ, జల ఖండాలు విడదీసినప్పుడూ, అగ్ని పర్వతాలు బద్దలైనప్పుడూ ఎలా రూపురేఖలు మార్చుకుందో నిరాధారం. మానవ మనుగడ మొదలయ్యే అనేక దశల్లో ఆ ఖండ భాగాలు చెల్లాచెదురై, గుంపులు గుంపులుగా కలిపి వుంచిన తొలి మానవ ప్రాణుల మధ్య అగాధాలు సృష్టించినా ఒక చోటు నుంచి ఇంకొక చోటుకు వెళ్లి మరొక గుంపుతో సంపర్కాలు జరిపి, తమ జన్యువుల్లో అన్ని గుంపుల తాలూకూ లక్షణాలను ఎలా మోసుకుంటూ తిరిగారో అంతా అనూహ్యం. అయినప్పటికీ, ఒకచోట స్థిరపడే వరకూ కొనసాగిన ఆ మానవ మహాప్రస్థానాన్ని, గల్లంతయిన పేజీలను జాగ్రత్తగా పేర్చుకుంటూ, సరిచేసుకుంటూ, నిర్మించుకురావడం చాలా ఆసక్తికరం. ఈ ఆసక్తికర కథనాన్ని ఈ పుస్తకం నిష్పక్షపాతంగా మన ముందుంచే ప్రయత్నం చేసింది.



వారి అధ్యయన సామగ్రి అంతా అత్యంత ఆధునిక పరిశోధనల్లో వెలికి వచ్చిన సమాచారంతో పాటూ, ఇతిహాస హోదా గల మహాభారత కథనాన్ని అంతర్వాహినిగా జోడిస్తూ, వ్యాఖ్యానిస్తూ సాగిన సత్యాన్వేషణ ఇది. గ్రీకు ఇలియడ్, ఒడిసీ ఎపిక్స్ యాంత్రోపాలజిస్టుకు యే దృక్కోణంలో ఉపయోగపడ్డాయో ఇంచుమించు అదే రీతిలో మహాభారతాన్ని ఒక మానవ శాస్త్ర పరిశోధకుడిలా అధ్యయనం చేసిన రచయిత ఆయా గాథల్లోని మార్మికతలను తరచి చూస్తూ ఈ పుస్తకాన్ని కొనసాగిస్తారు.

చాల్స్ డార్విన్, టోనీ జోసెఫ్, డేవిడ్ రైక్, రూథర్ ఫర్డ్, డేవిడ్ అంతోనీ వంటి వారి అద్భుత పరిశోధనా ఫలితాలను ఉటంకిస్తూ సాగిన ఈ రచన బీజాంకుర దశ నుంచి, అంటే ఎక్స్, వై క్రోమోజోముల నుంచి మొదలై, హద్దుల్లేని భూగోళమంతా చుట్టి, ఆర్యావర్తం వరకూ వచ్చి అంతమవుతుంది. స్థల కాలాల సరిహద్దుల ఊహా జగతి ఒక్కసారిగా విస్తృతమై, దిగంతాలు దాటి వెతుక్కుంటూ వెళ్లి, అన్వేషణ పూర్తయ్యాక మన హృదయాలు కుంచించుకుపోవడానికి బదులు విప్పారుతాయి. కుల, వర్ణ, వర్గ, జాతి స్పృహలు లేని ఒక మహోన్నత సమాజంలో విశ్వ మానవ ప్రాణిగా వికసించాల్సిన అవసరాన్ని ఈ పుస్తకం మన హృదయంలో నాటుతుంది. ఈ పుస్తకం పూర్తయ్యాక, మానవ సమాజం పట్ల ఒక గొప్ప గ్రంథానికి వుండాల్సిన బాధ్యత ఇంతకంటే వేరే ఏదో ఉంటుందనుకోవడం పొరపాటనిపిస్తుంది.

ఈ గ్రంథం మహా వానరాలైన చింపాంజీలూ, బోనోబోలు, వొరాంగుటాన్లూ, గొరిల్లాలు, హోమోలు (24 జతల క్రోమోజోములు కలిగిన) నుంచి విడిపోయి, 23 జతల క్రోమోజోములు కలిగిన మనిషి తొలిసారిగా కనబడటం మొదలుపెట్టిన 32 లక్షల సంవత్సరాల క్రితం నుంచీ ప్రారంభించి, 19 లక్షల సంవత్సరాల క్రితం ఆఫ్రికా నుంచి వేరే ప్రాంతాలకు విస్తరించడమూ, 7 లక్షల సంవత్సరాల క్రితం ఉనికిలోకి వచ్చిన హోమో సేపియన్స్, నియాండర్తల్ అనే రెండు మానవ రకాల పరిశీలనతో ప్రారంభమవుతుంది. నియండర్తల్ మగ ప్రాణి లక్ష సంవత్సరాల క్రితం ఈ హోమో సేపియన్స్ ఆడ ప్రాణితో జత గూడడమూ, నియాండర్తల్ రకం అంతరించిపోయినా ఇప్పటికీ మనలో 'కెరాటిన్' జన్యు అవశేషాన్ని మోసుకు తిరగడమూ అనే ఒక్క ఉదాహరణతో మన సజాతీయ గుంపుల మధ్య సంపర్కాలు ఖండాలు దాటి ఉన్నాయన్న వాస్తవం గగుర్పాటు కలిగిస్తుంది. ఇది కేవలం ఒక ఉదాహరణ మాత్రమే! ఇలాంటివి అనేకం ఈ పుస్తకం నిండా వున్నాయి. నియాండర్తల్ కంటే ముందే సైబీరియాలో మరో మానవ రకమైన డెనిసోవన్ జన్యు అవశేషాలు తొమ్మిది వేల కిలోమీటర్ల అవతల ఉన్న న్యూ గినీలో దొరికాయంటే ఈ మానవ వలస ఎంత విస్తారమో అర్థం చేసుకోవచ్చు.

మానవ చరిత్రలో తొలి మహత్తర విప్లవం వ్యవసాయమనీ, వ్యవసాయం కోసం ప్రాదేశిక భావన బలపడి రాజ్యావతరణకు ఎలా దారి తీసిందో, ఈ ప్రాదేశిక భావన వెనక అసలు నిజం ఆస్తుల సొంతమూ, వాటిని కాపాడుకోవడం కోసమేననేది సరిహద్దుల గీతలు, కంచెలు, గోడల్లో చూడొచ్చుననే నిజాన్ని బయట పెడుతుంది. ఇలాంటి అద్భుత సూత్రీకరణలు ఈ పుస్తకంలో చాలా ఉన్నాయి. ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డేవిడ్ రైక్, హిట్టైట్ లిపి ఛేదించిన ప్రముఖ పురాతత్వ భాషావేత్త బెడ్రిక్ హ్రోజ్నీ నీ ప్రస్తావిస్తూ, వ్యవసాయ విప్లవం పారిశ్రామిక విప్లవంతో పోల్చదగ్గ మహా విప్లవం ఎందుకైందో చెబుతారు.

14 వేల సంవత్సరాల క్రితం మంచుయుగం ముగిసి, భూమి వేడెక్కుతున్న తరుణంలో అప్పటికి వున్న 20 లక్షల మంది హంటర్ గేదరర్స్ అనేక ప్రాంతాలకు విస్తరిస్తూ వెళ్లి, స్థిర నివాసాల ఏర్పరచుకోవడమూ, 11, 12 వేల సంవత్సరాల క్రితం ఆగ్నేయ టర్కీలోనూ, ఉత్తర సిరియాలోనూ వీళ్ళే మొక్కలూ, జంతువులూ పెంచడం ద్వారా ఈ విప్లవానికి ఆద్యులవ్వడం ఆ తర్వాత సింధులోయ తీరాలకు వెళ్లడం, అక్కడి నుంచి మన మూలాల్లోకి చొరబడటంతో కథ మలుపు తిరుగుతుంది.

జన్యు ఆధారాలతో చెప్పినప్పుడు వేల సంవత్సరాల క్రితం ఈ వలసలు రూఢిగా జరిగినట్లు తెలుస్తోంది. మెహర్ గఢ్‌లో క్రీస్తు పూర్వం ఏడు వేల సంవత్సరాల నుంచీ దొరికిన జనావాసాల ఆనవాళ్ళలో తొలి భారతీయులూ, లేదంటే ఇరాన్ ప్రాంతం నుంచి వచ్చిన వాళ్ళూ అయి ఉండాలన్న టోనీ జోసెఫ్ పరిశోధనలను కూడా ఇక్కడ పరిగణనలోకి తీసుకుంటారు.

నాలుగు భాగాలుగా విస్తరిల్లిన ఈ గ్రంథంలో మొదటి భాగంలో మానవ పూర్వీక జాతులైన నాలుగైదు రకాల మనలాంటి వారి మూలాలను చూపగా, రెండో భాగంలో వాంగ్మయాధారాలూ, యూరప్, భారత్‌లో కనపడే సామ్యాలూ, మూడో భాగంలో ఆఫ్రికన్ తల్లిలో వెతుక్కున్న జనన రహస్యాలూ, జన్యుమూలాలూ, తర్వాత అక్కడి నుంచి మానవ ప్రస్థాన విస్తృతిలో భాగంగా భరతభూమిగా పేర్కొనే మన సరిహద్దుల లోపల మెహర్‌గఢ్, హరప్పా, ద్రవిడ సంస్కృతి మేళవింపులూ, సరిహద్దు దేశాలతో బాంధవ్యమూ, ఆర్యావర్తమూ, వేదవాఙ్మయమూ, రామాయణ మహాభారతాల వెనుక ఉన్న చారిత్రక వెలుగు జిలుగులూ, మధ్య యూరప్ నుంచి చైనా వరకూ ఎనిమిది వేల కిలోమీటర్ల దూరం వ్యాపించిన స్టెప్స్ (ఎందుకో మరి రచయిత ఈ పదాన్ని 'స్టెప్పీలు' అన్నారు! నిజానికి వీటిని స్టెప్స్ అనడం సరైంది!) అనబడే గడ్డి భూములనుంచి (సరిహద్దుల ఎల్లలు అనే స్పృహ ఇప్పుడు ఏర్పరచుకున్నది!) మొదలు పెట్టి, మహాభారత గాథల్లోని ఇతిహాసపు ఆనవాళ్లనూ, ఆర్యావర్తంలో అతి సాధారణమైన పశు బలుల గురించీ, యజ్ఞ యాగాదుల గురించీ, వైదిక ప్రమాణాల గురించీ చాలా విస్తృతమైన వివరణలు ఇస్తూ 'మన' మూలాల లోపలికి చొచ్చుకు వెళతారు.

ఇందులో ప్రతిదీ ఒక ఆసక్తికరమైన అంశమే. మన మూలాల్లోని ఒకటి రెండు సందర్భాల్ని ఇక్కడ ఉటంకించడం ద్వారా అవి మిమ్మల్ని ఎంతగా అప్రతిభుల్ని చేస్తాయో చూడొచ్చు. భారతీయుల రూపురేఖల్లో జన్యు మిశ్రమం వల్ల ఎంత వైవిధ్యం కనబడుతుందో చెబుతూ, నలుపు నుంచి చామనచాయ వరకూ, యూరోపియన్ కవళికల నుంచి చైనీయ కవళికల వరకూ ఇక్కడ జనాల్లో కనిపిస్తాయనీ, ఉత్తర భారత పూర్వీకులకు యురేషియా జనాలతో అంటే– యూరప్, మధ్య ఆసియా, పశ్చిమాసియా, కాకసస్ లతో జన్యు సంబంధం ఉందనీ, అదే సమయంలో దక్షిణ భారత పూర్వీకులకు, నేటి భారత ఉపఖండానికి బయట ఉన్న ఏ జనాభాతోనూ జన్యు సంబంధం లేదనీ డేవిడ్ రైక్ ప్రతిపాదించిన సూత్రీకరణలను ప్రస్తావిస్తారు.

భారతీయుల జన్యు చరిత్ర ఇక్కడి వివిధ కులాల నిచ్చెన మెట్ల అమరికకు తూచినట్టు సరిపోవడం కూడా ఒక ఆశ్చర్యమేననీ, స్థూలంగా చెప్పాలంటే ఉన్నత వర్గాలకూ, నిమ్న వర్గాలకు మధ్య జన్యు వారసత్వంలో కూడా హెచ్చుతగ్గులు ఉన్నాయనీ ఆధారాలు చూపిస్తారు. జన్యుపరంగా చూస్తే భారతదేశంలో మిశ్రమం కాని జనాలు ఎవరూ లేరనీ, జన్యుపరంగా తాము స్వచ్ఛమైన వాళ్ళమని ఏ ఒక్క కులమూ లేదా వర్గమూ చెప్పుకునే అవకాశం ఏమీ లేదనీ, ఒకే ఊళ్లో పక్క పక్కన ఉంటున్నా సరే, భారతీయ జనాల్లో జన్యు వైవిధ్యం ఉత్తర దక్షిణ యూరప్‌లలో కన్నా రెండు మూడు రెట్లు ఎక్కువగా ఉందనీ, అసలు భారతదేశం అంటే 'పెద్ద సంఖ్యలో ఉన్న చిన్న చిన్న గుంపులతో నిండినదే' అనే డేవిడ్ రైక్ చెప్పిన మాటల్లోని సత్యాన్ని గ్రహించాల్సిన అవసరం గురించి చెబుతారు.

ఈ విషయ విస్తృతి ఒక మహా సముద్రమైతే, ఈ సమీక్ష ఒక నీటి బొట్టు మాత్రమే! ఈ సమీక్ష ఉద్దేశం బాధ్యతగల ఒక చదువరిగా తన జాతి మూలాలను వెతుక్కునే క్రమంలో సరిహద్దులు లేని ఒక నవీన మానవుడి అవతరణ దిశగా మన ప్రస్థానం కొనసాగుతుందని తెలుసుకోవడమే ప్రధాన విషయం. తెలుగువారికి ఒక గొప్ప పరిశోధక గ్రంథాన్ని అందించిన కల్లూరి భాస్కరం గారికి యావత్తూ తెలుగు ప్రజానీకం కృతజ్ఞతలు తెలుపుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– వి.విజయకుమార్
85558 02596

నిజం దిశగా.. నిర్భయంగా ...

యాములపల్లి నర్సిరెడ్డి అనబడే ఈ కవి స్వచ్ఛమైన మనిషి. తన బాధని, సంఘర్షణని, తన ప్రాంత వేదనని, సమాజంలోని వైపరీత్యాలను శిలావృక్షంగా మన ముందుకు తీసుకుని వచ్చాడు. నర్సిరెడ్డి చాలాకాలం నుంచి రాయలసీమ నుంచి కవిత్వం అయ్యాడు. అవుతున్నాడు. నా దృష్టికి కవిగాను మనిషిగాను నర్సిరెడ్డి ఒకేలా కనిపిస్తాడు. ఈ కవి ఇంతకుముందే వోరుపొ్పోటు, మన్నే మాత్రం పుస్తకాలని ప్రచురించాడు. వోరుపొ్పోటు దీర్ఘ కవితగా వెలువడి అనేక మన్ననలను, బహుమతులను అందుకుంది.

రాయలసీమ నీటి కోసం, నీటిని నిలబెట్టే చేతుల కోసం, ఆ నేల బాగు కోసం ఆనాటి నుంచి నేటిదాకా నిరంతరం శ్రమించే విషయం మనందరికీ తెలుసు. ఈ కవి కూడా సీమ వ్యథను, బాధను అక్షరాలకు తీవ్రతను రాసి, కవిత్వంలా కురుస్తున్నాడు. నిశ్చేష్టంగా నిలబడిపోయిన గాలిని చూపిస్తాడు. నీళ్లు లేక మధ్యలోనే రాలిపోయిన అవిటి పుష్పాల వేదన వినిపిస్తాడు. అక్షౌహిణీల సైన్యంతో దాడి చేస్తున్న ఉక్కపోతను పరిచయం చేస్తాడు. రాయలసీమ పల్లెల్లోని పొడి దృశ్యాలను పోత పోసినట్టే కై కడతాడు. కుండపోత ప్రేమతో వర్షం కురిసిన రోజుని, కరువు నేలపై కరుణతో వచ్చిన వానని గురించి రాసిన కవిత నిజంగా అపురూపమే. జలదర్పణం చూపిస్తాడు. వలస, కరువు అవిభక్త కవలలు అంటూ వాపోతాడు.

'మీరేమీ అనుకోకుండా ఒకే ఒక్కసారి/ మా రాయలసీమ అమ్మ కడుపును స్కాన్ చేసి చూడండి/ ఆమె గర్భసంచిలో ఒక బట్టల్లేని శిశువే కాదు/ బట్టల సర్దిన బ్యాగ్ కూడా కనిపిస్తుంది/ గాడిద కాలు గిట్టలా ఇద్దరూ అతుక్కునే పుడతారు/ వలస పోవడానికి ఏం చేయమంటారు/ వలస మా నంజీరైన బతుకుల్లో భాగమైపోతేను ..'

రాయలసీమ స్థితిగతులు, పరిస్థితులు, కన్నీటి గాథలు చెప్పడం ఎప్పటినుంచో ఉంది. అయితే నర్సిరెడ్డి పడుతున్న ఆవేదన, దుఃఖం మనల్ని మెలి పెడుతుంది. నర్సిరెడ్డి కవితని ప్రారంభించడంతోనే మనల్ని తన వెంట తీసుకుపోతాడు. వాక్యాల్లో పోలికలు, రూపకాలు పరుగులు పెడ్తుంటాయ్. అతని పదాల వాక్యాల వెంట మనం పరుగులు తీస్తాం. వాక్యాల్లో వేగం మనల్ని గుక్కతిప్పుకోనివ్వదు. అనంతపురం జిల్లాని ఎడారి పండుకోయిల అని, చింత నిప్పుల కొలిమి అని, చెప్పులు అరిగేలా తిరిగిన వలస బొబ్బల పారాణి అని అంటాడు.

నర్సిరెడ్డి కవిత్వంలో ఇవాళ్టి రాజకీయాలు, అవినీతి, పర్యావరణం, వస్తు జ్ఞాపకాలు, వ్యక్తులు, వృత్తి కేంద్రంగా కొన్ని ఉన్నాయి. మరికొన్ని విభిన్న వస్తువుల మీద కూడా కవితలు ఉన్నాయి. తీసుకున్న వస్తువుకు, ఎంచుకున్న అభివ్యక్తి పాఠకుల్ని చదివించేలా చేస్తుంది. భవన నిర్మాణ కార్మికుల గురించి రాసిన కవితలో అతని జీవితాన్ని ఆవిష్కరించిన విధానం బాగుంది. ఇంటికి శంకుస్థాపన చేసింది మొదలు, గృహ ప్రవేశం రోజు వరకు అతని కష్టం ఏమిటో చెబుతాడు. అతని కష్టానికి మనం డబ్బు చెల్లించి, మర్చిపోతాం. ఉన్నవాళ్ల అంతస్తులపైకి వెళ్తూ ఉంటే, ఈ కార్మికుడు తనివి కాని అంతస్తులు దిగిపోయే విషాదాన్ని గుర్తుచేస్తాడు. 'గృహప్రవేశం రోజు పేపర్ ప్లేట్లో/ ఓ గరిటెడు [illegible] తీరిపోయేవాడి రుణానికి/ ప్రాణాలు పోయాక వచ్చే కార్మిక జీవిత బీమా కన్నా/ వాడితో జీవితమే కావాలని ఎదురు చూసే/ ఇంటి ఇల్లాలి కళ్ళ వత్తులకు ఏ బుర్జ్ ఖలీఫాలు సమాధానం ఇవ్వగలవు?' అనే ప్రశ్న వేస్తాడు.



ఈ కవితలో ప్రాణాల్ని పిడికట్లో పట్టుకోడానికి కూడా వాడికి చేతులు ఖాళీగా ఉండవు. ఊపిరి తాడుని శూన్యానికి కట్టి తాత్కాలికంగా నిలబెట్టిన కర్రలను అనుసంధానం చేయడం, తరాల పర్యంతం నిలిచే కట్టడాల వెనుక పార్టీ జెండా మోసిన సాధారణ కార్యకర్తలా ఉండటం' లాంటి వాక్యాలు ఆ కవితను నిలబెట్టాయి. అలాగే ఒకప్పుడు ఎంతో వైభవంగా ఉన్న నాటకాల పరిస్థితి ఇప్పుడు ఎలా అయిందో మనందరికీ తెలుసు. ఆ నేపథ్యంలో రాసిన కవిత నాటకం. ఆ కవితలో కూడా ఇప్పటి వాస్తవాలను చిత్రీకరించి తీరు నర్సిరెడ్డిలోని కవిత్వ నిర్మాణ శక్తిని తెలుపుతుంది. కవితలో ముగింపు వాక్యాలు ... 'తబలా తమ్ముడితో హార్మోనియం పక్క ఊరికి మకాం మారుస్తుంది/ పద్యం పొలం గట్ల పైకో, జీవాల మంద మధ్యకో తరలిపోతుంది/ చావడిలో గబ్బిలాలు కొత్తగా కాపురం పెడతాయి/ ఊరంతా పిల్లన గ్రోవినిని పూడ్చిపెట్టిన నిశ్శబ్దం...' ఈ వాక్యాన్ని చదివాక పాఠకుడి మనసు కూడా నిశ్శబ్దం అయిపోతుంది. నర్సిరెడ్డి కవిత్వంలో కల్లబొల్లి మాటలు ఉండవు. వాస్తవాల చిత్రణ ఉంటుంది. తీవ్రమైన ఆవేశంలోనూ పట్టుతప్పని పదాల పోహళింపు ఉంటుంది. తాను ఎంచుకున్న వస్తువుని అవలీలగా కవిత్వం చేసి, మనలోకి పంపుతాడు. తాను ఒక మొక్క వేసినప్పటికీ సంతోషాన్ని సంబరం అనే కవితలో రాశాడు. మొక్క నాటిన సంతోషం, ప్రాణాపాయ వ్యక్తికి రక్తం ఇచ్చినంత ఆనందం అంటాడు. సీకాయి గిన్నెను అరచేతి చెరువుగా, వక్కరోలును కళాఖండంగా, బలపాన్ని బాల్య మిత్రుడిగా, గాటి పట్టును భూమధ్యరేఖగా కవిత్వీకరించడం విభిన్నంగా అనిపిస్తుంది. కులాలకు, మతాలకు రాజీనామా చేస్తే బాగుంటుందని కొత్త ఆలోచన కూడా చేశాడు. ఈ లౌకికవాద దేశంలో జరుగుతున్న కుట్రల గురించి రాసిన రాజీనామా అనే కవిత కూడా మనల్ని ఆలోచింపజేస్తుంది. ఇంతవరకు ఎవరూ రాయని ఒక విభిన్న వస్తువు బట్టల షాపుల ముందు ఉండే 'మానికిన్'. ఇవి బట్టల షాపుల ముందు ఉండే అందమైన బొమ్మలు. అది బేరాలని ఆకర్షించే వస్తువు. అయితే దాని గురించి చెప్తూ చెప్తూ ముగింపు వచ్చేసరికి – 'బొమ్మ బొమ్మై బతికిపోయింది / లేకుంటే వెంటపడి వేధించే కుర్ర కారుకి సమాధానం చెప్పి/ సగం చెప్పలేక/ సగం చచ్చుండేది.' ఈ వాక్యాలు చెప్పడం ద్వారా నేడు అమ్మాయిలు మీద జరుగుతున్న వేధింపులు గురించి వ్యంగ్యంగా చెప్తున్నట్టున్న ఉన్నా అందులో ఉన్న నిజాన్ని ఒప్పుకోవాల్సిందే! నర్సిరెడ్డి కవిత్వంలో గమనించిన మరో అంశం రాయలసీమ మాటలను, పదాల్ని అవసరం ఉన్న చోట సమర్థవంతంగా ఉపయోగించగలడం, ఆ నుడికారాన్ని శక్తివంతంగా మనలోకి పంపగలడం.

ఇందులో ఉన్న ఒక స్మృతి కవిత సిన్నవ్వ. ఆమె జీవితాన్ని జ్ఞాపకాలని చెప్తూ చెప్తూ చివరకి ఇలా అంటాడు : 'పుట్టింటి పట్టుచీర సినిమాను పట్టు పట్టి చూసొచ్చి/ అందులో కథానాయక కష్టాలను ఎందరికో చెప్పి ఏడ్చిన మనిషి/ తన అగచాట్లు మాత్రం ఖాళీ కడియాల్లో దాచుకొని/ గంపెడు సంతానం కడుపులో గిన్నెడు బువ్వై బతికింది/ మా సిన్నవ్వ స్వర్గానికి పోలేదు / స్వర్గమే ఆమెను ఎత్తుకుపోయింది.' ఈ వాక్యంలో ఎత్తుకుకుపోయింది అనే మాట రాయలసీమ నుడికారం. నర్సిరెడ్డి తన కవిత్వానికి తానే హామీ పత్రం కూడా రాసుకున్నాడు.

దుక్కిలో గుంటక్కి/ మడిలో మడక్కి/ చేదబావి గిలక్కి/ జగ్గుడు కొమ్మ ఉయ్యాలకి/ ఆల్ ఇన్ వన్‌లా పనికొచ్చేలా/ మా తాత పేడిన మోకుతాడు నా కవిత్వం అని, లేత పైరు పొట్ట చేను గాలి రేపిన కంకులు కొట్లాట తన కవిత్వమని, ఆవు వెంట నడిచి వచ్చిన లేగదూడ తన కవిత్వం అని ... ఇలా తన కవిత్వం గురించి చెప్తూనే, కవిత్వం ఏం చేయాలో చెప్పకనే చెప్తాడు. అయితే నర్సిరెడ్డి ఇంకా పాత కవిత్వ నిర్మాణ పద్ధతుల్ని అనుసరిస్తున్నాడు. టెక్నిక్‌పరంగా ఇంకా కాస్త ముందుకు వెళ్లాలని ఆశిస్తున్నాను. శిలావృక్షం అనే శీర్షిక అనంతపురానికి ప్రతీకగా వాడినట్టుగా అనిపిస్తుంది. శీర్షికలు పెట్టడంలో కూడా నర్సిరెడ్డి తనదైన పంథాన్ని అనుసరించాడు. ఈ కవితా సంపుటిని కరువు నేలపై కరుణ కురిపించిన ఫాదర్ విన్సెంట్ దంపతులకు అంకితం ఇవ్వడం మంచి విషయం.

– డాక్టర్ సుంకర గోపాల్
94926 38547

"వాడెప్పుడు తెలుసుకుంటాడో"

ఒక మిత్రుడున్నాడు బలేచిత్రమైనవాడు
తెలివైనవాణ్ణనుకుంటాడు తనకు తెలిసిందేజ్ఞానమంటాడు

వాడొక పానమట్టం లేని బోడిలింగం
భూగోళం లింగాకారంలోనే ఉందని దబాయిస్తుంటాడు

ఎన్ని రుజువులు చూపినా తనుపట్టిన కుందేలుకు మూడే
కాళ్ళని వాదిస్తుంటాడు

భూమ్మీద ఎన్నిరకాల జాతుల పళ్ళున్నా అతడు కొనేదీ తినేదీ
ఒక్క నారింజపండు మాత్రమే

అన్నిరకాల పువ్వుల్లో కనకాంబరాలే శ్రేష్టమైనవంటాడు

మిరప్పండంటే భయమో కోపమో గానీ అతని వంటింటిలో
దానికి చోటేలేదు

కూరలో కారం వేసుకోడు ఎర్రగా ఉంటుందని

చప్పిడికూడు తినీతినీ రుచులకు దూరమై
ఈకలుమొలిచిన తోలుముక్కయిపోయింది వాడి నాలుక

సింధూరం దిద్దుకున్న నుదురెదురైతే బెదిరిపోతాడు

మందారం తురుముకున్న జడ కనబడితే అదిరిపడతాడు

నారింజరంగును చూడ్డానికి మాత్రమే అలవాటుపడిన వాడి
కళ్ళు ఇంద్రధనసును చూడలేకపోతున్నాయిప్పుడు

సప్తవర్ణమిశ్రమం కాషాయమే అని అతని ప్రగాఢ విశ్వాసం

పొద్దుపొడుపు సమయంలో బయటికి రాడు
అరుణకాంతి తనకు పడదని

చీకటికి అలవాటుపడ్డ కళ్ళు వెలుగును చూడలేవుకదా

ఎరుపును నిషేధించిన వాడి జీవితానికి ఉదయాలెలావస్తాయి?

ఎప్పుడో 'అపాయం' అనే హెచ్చరిక బోర్డు కూడా
నారింజరంగులోనే కనిపించి వాడేమైపోతాడోనని భయం నాది.

వాడెప్పుడు తెలుసుకుంటాడో
ప్రమాదానికి గుర్తె ఎక్కడో ఉన్నాడని వాడు నమ్మేవాడు తనని
రక్షించడానికి రాడనీ,
కాపాడాల్సింది ఆస్పత్రిలో వైద్యుడేననీ
తన ఒంట్లోకి ఎక్కించాల్సింది ఎర్రని నెత్తురేనని ..!!

గంటేడ గౌరి నాయుడు
9441415182

అన్నదాతల పోరుబాట 2.0

- 16న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెకు సంయుక్త కిసాన్ మోర్చా సన్నాహాలు
- ముందస్తు నిర్బంధం, ఆంక్షలతో ప్రభుత్వం
- మార్చి13న ఛలో ఢిల్లీకి కొన్ని సంఘాల పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం రైతులు, వ్యవసాయ కార్మికుల నిరంకుశ విధానాలపై కర్షకలోకం రెండో విడత మహోద్యమానికి సన్నద్ధమవుతోంది. ఢిల్లీ సరిహద్దుల్లో దీక్షా శిబిరాలను ఏర్పాటు చేసి ఏడాదిపాటు చారిత్రాత్మక పోరాటం సాగించిన సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఈ నెల 16న గ్రామీణ బంద్, రంగాలవారీ పారిశ్రామిక సమ్మెకు చురుగ్గా సన్నాహాలు జరుగుతున్నాయి. కాగా ఈ నెల 13న సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం) ఆధ్వర్యంలో పంజాబ్, హర్యానా రాష్ట్రాల రైతులు 'ఢిల్లీ చలో' చేపట్టనున్నారు. ఈ ర్యాలీకి 2,500 ట్రాక్టర్లతో 20 వేల మంది రైతులు రావచ్చునని ఢిల్లీ పోలీసుల అంచనా. అంబాలా-శంభు, ఖనౌరీ-జింద్, దబ్వాలి సరిహద్దులను బారికేడ్లు, ఇనుప కంచెలతో పోలీసులు దిగ్బంధించారు. అయితే ఈ 13న చేపట్టే 'ఢిల్లీ చలో' కార్యక్రమంతో తమకు ఎలాంటి సంబంధం లేదని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి.

డిమాండ్లివే..

పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కల్పించే చట్టం తేవాలి. వ్యవసాయ రంగాన్ని వేధిస్తున్న ఇతర సమస్యలను పరిష్కరించాలి. రైతుల నుంచి వివిధ అభివృద్ధి పనుల కోసం తీసుకున్న భూములను అభివృద్ధి చేయాలి. అలా చేయకపోతే ఆ భూములను తిరిగి రైతులకు అప్పగించాలి. లోక్‌సభ ఎన్నికల లోపు కేంద్ర ప్రభుత్వం రైతన్నలకు ఇచ్చిన హామీలను అన్నిటినీ నెరవేర్చాలి.

షర్మిల నేతృత్వంలో కాంగ్రెస్ ఎన్నికల కమిటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఎపిపిసిసి) అధ్యక్షులు వైఎస్ షర్మిల రెడ్డి నేతృత్వంలో పార్టీ రాష్ట్ర ఎన్నికల కమిటీని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. షర్మిల ఛైర్మన్‌గా 20 మంది సభ్యులతో ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సభ్యులుగా పార్టీ సీనియర్ నాయకులు ఎన్ రఘువీరా రెడ్డి, టి సుబ్బరామిరెడ్డి, పల్లం రాజు, కె రాజు, కెవిపి రామచంద్రరావు, గిడుగు రుద్రరాజు, ఎస్ శైలజానాథ్, చింతా మోహన్, జెడి శీలం, కె బాపిరాజు, ఎన్ తులసి రెడ్డి, షేక్ మస్తాన్ వలి, సుంకర పద్మశ్రీ, జంగా గౌతం, రాకేష్ రెడ్డి, సిరివెళ్ల ప్రసాద్, ఉషా నాయుడు, సూర్య నాయక్, శ్రీనివాస రెడ్డి ఉన్నారు. ఎపిపిసిసి అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎన్ రాజా, కాంగ్రెస్ అనుబంధ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు కూడా కమిటీలో సభ్యులుగా ఉంటారు.

సమీర్ వాంఖడేపై ఇడి కేసు

ముంబయి: సినీనటుడు షారుక్‌ఖాన్ కుమారుడు ఆర్యన్‌ఖాన్‌ను డ్రగ్స్ కేసులో నిందితుడిగా చేర్చకుండా ఉండేందుకు రూ.25 కోట్లు లంచం అడిగారన్న ఆరోపణలపై ఎన్‌సిబి ముంబయి మాజీ జోనల్ డైరెక్టరు సమీర్ వాంఖడేపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. సమీర్‌పై ఇప్పటికే సిబిఐ కేసు నమోదయిన విషయం తెలిసిందే. 2021లో డ్రగ్స్‌కేసులో ఆర్యన్‌ఖాన్‌ను సమీర్ అరెస్టు చేశారు. ఈ కేసులో ఆర్యన్‌కు ఎన్‌సిబి క్లీన్‌చిట్ ఇచ్చింది. ఆ తర్వాత సమీర్‌పై పలు ఆరోపణలు రావడంతో జోనల్ డైరెక్టరు పదవి నుంచి బదిలీ చేసి, విచారణ చేపట్టారు.

సోమాలియాలో సైనిక స్థావరంపై దాడి

- ముగ్గురు యుఎఇ సైనికులు మృతి

దుబాయ్ : సోమాలియాలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో ముగ్గురు యుఎఇ సాయుధ దళాల సభ్యులు, ఒక బహ్రెయిన్ అధికారి మరణించినట్లు యుఎఇ రక్షణ మంత్రిత్వ శాఖ ఆదివారం ఒక ప్రకటనలో ధ్రువీకరించింది.

రెండు దేశాల మధ్య సైనిక సహకారంలో భాగంగా యుఎఇ, రిపబ్లిక్ ఆఫ్ సోమాలియా మధ్య ద్వైపాక్షిక ఒప్పందం ప్రకారం సోమాలియా రాజధానిలోని సైనిక స్థావరంలో అరబ్ ఎమిరేట్స్, బహ్రెయిన్ అధికారులు శిక్షణ పొందుతున్నారు. శనివారం మొగదిషులోని జనరల్ గోర్డాన్ మిలిటరీ స్థావరంపై సైనికులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ దాడి తమ పనేనని అల్ ఖైడా అనుబంధ మిలిటెంట్ గ్రూపు అల్-షబాబ్ ప్రకటించింది. అల్-షబాబ్‌ను అణచివేసేందుకు యత్నిస్తున్న సోమాలియా ప్రభుత్వానికి యుఎఇ మద్దతు ఇచ్చినందున తాము ఎమిరేట్స్‌ను శత్రువుగా పరిగణించామని పేర్కొంది.

సైనికుల కుటుంబ సభ్యులకు సోమాలియా రక్షణ మంత్రిత్వ శాఖ తన సంతాపాన్ని తెలియజేసింది. దాడిలో గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఉగ్రవాద కార్యకలాపాలపై దర్యాప్తు చేసేందుకు సోమాలియా ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి యుఎఇ కట్టుబడి ఉందని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

అప్పుల ఊబిలో కేంద్రం

- కొండలా పెరుగుతున్న రుణాలు
- రాష్ట్రాలపై ఆంక్షలు విధిస్తున్న కేంద్రం
- సామాన్యులకు శాపంగా మారిన ప్రభుత్వ విధానాలు

న్యూఢిల్లీ : భారత్‌పై రుణభారం కొండలా పెరిగిపోతోందని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) గత డిసెంబరులో ప్రకటించగానే కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాయి. ఈ అప్పుల కుప్ప కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థకు వచ్చిన ముప్పేమీ లేదంటూ ఐఎంఎఫ్ ప్రకటనను తక్కువ చేసి చూపే ప్రయత్నం చేశాయి. 2022-23లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రుణాలు స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)లో 86.5% మేర ఉన్నాయని, ఇది సంక్షోభమేమీ కాదని చెబుతూ ప్రజలకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేశాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి రుణాలు 2014-15లో జిడిపిలో 67%గా ఉన్నాయి. అవి క్రమేపీ పెరుగుతూ ప్రస్తుత స్థాయికి చేరాయి. కోవిడ్ మహమ్మారి విజృంభించిన 2020-21లో ఈ రుణాలు గరిష్ట స్థాయికి...అంటే జిడిపిలో 90%కి చేరుకున్నాయి. విడివిడిగా చూసినట్లయితే 2022-23లో జిడిపిలో కేంద్ర రుణాలు 61% ఉండగా, రాష్ట్రాల మొత్తం రుణాలు 29.5% మాత్రమే. ఈ గణాంకాలన్నీ ఆర్‌బీఐ అందించినవే. కేంద్ర రుణాలు కానీ, రాష్ట్రాల మొత్తం రుణాలు కానీ గత దశాబ్ద కాలంలో పెరుగుతూనే ఉన్నాయి. అయితే ఈ రుణాలు జిడిపిలో 100 శాతాన్ని చేరుకోలేదని, కాబట్టి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వాదించే వారూ ఉన్నారు. అనేక సంపన్న ఆర్థిక వ్యవస్థల రుణభారం జిడిపిలో వంద శాతాన్ని దాటేసిందని వారు గుర్తు చేస్తున్నారు. కాబట్టి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇస్తున్నారు.

ఆశాజనకంగా లేని ప్రైవేటు పెట్టుబడులు

అయితే ఇక్కడ గమనించాల్సిన విషయం ఒకటుంది. దేశ ప్రజల ఆదాయాలు తక్కువగా ఉన్నాయి. ఉద్యోగాల సంఖ్య పెరగడం లేదు. మరోవైపు ద్రవ్యోల్బణం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితుల్లో రుణ స్థాయి అధికంగా ఉండడం కచ్చితంగా కలవరం కలిగించే విషయమే. మరో విషయమేమంటే మూలధనపు పెట్టుబడికి నిధుల కోసం కేంద్ర ప్రభుత్వం అప్పులు చేస్తోంది. ఈ నిధిలో ఎక్కువ భాగం రహదారులు, బ్రిడ్జిలు వంటి మౌలిక సదుపాయాల కోసం ఖర్చవుతుంది. దీనివల్ల ప్రైవేటు రంగ పెట్టుబడులకు ప్రోత్సాహం లభిస్తుందన్న అభిప్రాయం ఉంది. అయితే అవి ఆశాజనకంగా లేవు.

రాష్ట్రాలపై పెరుగుతున్న ఆంక్షలు

ఇదిలావుండగా ఇటీవలి కాలంలో రాష్ట్రాల రుణ స్థాయిపై తాజాగా వివాదం చెలరేగింది. కేరళ వంటి కొన్ని రాష్ట్రాలు మితిమీరి అప్పులు చేస్తున్నాయని కేంద్రం ఆరోపిస్తోంది. వాస్తవానికి రాష్ట్రాలు తీసుకునే రుణాల పరిధిపై కేంద్ర చట్టాలు ఎన్నో ఆంక్షలు విధిస్తున్నాయి. రాష్ట్రాల మొత్తం రుణాలు పెరుగుతున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వ రుణంలో అవి ఇప్పటికీ సగమే ఉన్నాయి. కానీ రాష్ట్రాల అప్పులు ఎందుకు పెరుగుతున్నాయన్న విషయాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉంది. గత దశాబ్ద కాలంలో రాష్ట్రాలు తీసుకునే రుణాలపై కేంద్రం ఎన్నో ఆంక్షలు విధించింది. రాష్ట్రాలకు రావాల్సిన నిధులను సైతం నిలిపివేసిన సందర్భాలు ఉన్నాయి. ఉదాహరణకు జీఎస్టీనే తీసుకుందాం. రాష్ట్రాలకు ఇవ్వాల్సిన జీఎస్టీ నష్టపరిహారం సంవత్సరాల తరబడి ఆలస్యమవుతోంది. కొన్ని సందర్భాలలో కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నిధుల విడుదలలో తరచుగా జాప్యం జరుగుతోంది. దీంతో రాష్ట్రాలు అప్పులు తీసుకోక తప్పడం లేదు. లేదా ఆ పథకాలను కొనసాగించేందుకు సొంత వనరుల నుండి నిధులు అందజేయాల్సి వస్తోంది.

2017లో జిఎస్‌టి అమలులోకి వచ్చింది. ఈ విధానం కారణంగా పన్నులపై రాష్ట్రాలకు ఉన్న హక్కులన్నీ హరించుకుపోయాయి. కేంద్రం విదిల్చే నిధుల పైనే అవి ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆర్థిక సంఘం నిధులను కూడా పూర్తిగా ఇవ్వడం లేదని కొన్ని రాష్ట్రాలు ఆరోపిస్తున్నాయి. దీనంతటికీ కారణం కేంద్ర ప్రభుత్వ ఏకీకృత, ఆంక్షలతో కూడిన వైఖరే. ఇది నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ ముఖ్య లక్షణం.

ఆర్థిక విధానాలే కారణం

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాల కారణంగా దేశ ప్రజలపై మోయలేని రుణభారం పడుతోంది. 2018వ సంవత్సరపు ఎన్ఎస్ఎస్‌ఓ నివేదిక ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబంపై సగటున రూ.60,000 రుణభారం పడుతోంది. అదే పట్టణ ప్రాంతంలో అయితే ఈ భారం రూ.1.2 లక్షలుగా ఉంది. అయితే ఇది సగటు భారం మాత్రమే అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. అప్పులతో అల్లాడుతున్న కుటుంబాలను మాత్రమే కాకుండా జనాభా మొత్తాన్ని పరిగణనలోకి తీసుకొని అంచనా వేశారు. 2012లో ఈ రుణభారం గ్రామీణ కుటుంబంపై రూ.32,522గా, పట్టణాల్లో నివసిస్తున్న కుటుంబంపై రూ.84,625గా ఉంది. ఆదాయాలు తక్కువగా ఉండడం, సరైన ఉపాధి లభించకపోవడం, నిరుద్యోగం, భద్రత లేని ఉద్యోగాలు వంటి కారణాలతో కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి.

సామాన్యుల నడ్డి విరుస్తూ...

ప్రభుత్వాలు తాము తీసుకునే రుణాలను వడ్డీతో సహా తీర్చేస్తాయి. వివిధ రూపాల్లో పన్నుల ద్వారా పోగు చేసిన సొమ్మును ఇందుకోసం వినియోగిస్తాయి. ఈ పన్నుల్లో ఎక్కువ భాగం భరించేది పరోక్ష పన్నుల ద్వారా సామాన్య ప్రజలే. మోడీ ప్రభుత్వం సంపన్న కార్పొరేట్ రంగాలకు పెద్ద ఎత్తున పన్ను రాయితీలు కల్పిస్తోంది. కార్పొరేట్ పన్నుల్లో నేరుగా కోత పెడుతోంది. మరోవైపు పెట్రోలియం ఉత్పత్తుల ధరలను కృత్రిమంగా పెంచుతూ సామాన్యుల నడ్డి విరుస్తోంది. ప్రభుత్వ రుణాలు తీర్చడానికి ప్రజలపై అధిక పన్నుల భారం మోపుతోంది. దీంతో వ్యక్తిగత లేదా కుటుంబ అప్పులు పెరిగిపోతున్నాయి.

పార్లమెంటరీ సంప్రదాయాల ఉల్లంఘనలో మోడీ సర్కార్ ఘనాపాటి

- ఉప సభాపతి లేకుండానే సమావేశాల నిర్వహణ
- చర్చలు, సంప్రదింపులకు దక్కని చోటు
- పౌర సమాజ గ్రూపుల ఛార్జిషీట్

న్యూఢిల్లీ: కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పార్లమెంటరీ సంప్రదాయాలు, విలువలను ఉల్లంఘించడంలో ఘనాపాటిగా నిలిచిందని పౌర సమాజ గ్రూపులు, హక్కుల కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు మోడీ సర్కారుపై ఘాటైన పదజాలంతో ఛార్జిషీటు విడుదల చేశారు. డిప్యూటీ స్పీకర్ లేకుండానే లోక్‌సభ సమావేశాలను నిర్వహించడం, పార్లమెంటును అతి తక్కువ సార్లు సమావేశపరచడం, ఆర్డినెన్సులపై ఆధారపడడం, కీలకమైన బిల్లులపై అరకొరగా చర్చలు జరపడం వంటి ఉదంతాలను ఆ ఛార్జిషీటులో ప్రస్తావించారు. ఛార్జిషీటును ఆన్‌లైన్‌లో విడుదల చేసిన సందర్భంగా అహ్మదాబాద్‌కు చెందిన హక్కుల కార్యకర్త సెడ్రిక్ ప్రకాష్ మాట్లాడుతూ వివిధ అంశాలపై తమ ఆందోళనల్ని వెలుగులోకి తేవాల్సిన అవసరం ఏర్పడిందని చెప్పారు. ఈ ఛార్జిషీటును ప్రజల ముందు ఉంచుతున్నామని, భయం కారణంగానే వారు తమ అభిప్రాయాలను బయటకు చెప్పడం లేదని అన్నారు. ఛార్జిషీటులోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి....

డిప్యూటీ స్పీకర్ పదవిని భర్తీ చేయకుండానే...

రాజ్యాంగంలోని ఆర్టికల్ 93కు విరుద్ధంగా లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవిని భర్తీ చేయకపోవడం అసాధారణం. ఈ పదవిని ప్రతిపక్షాలకు కేటాయించాలన్న సంప్రదాయాన్ని కూడా విస్మరించారు. తద్వారా పార్లమెంటరీ పద్ధతులకు స్వస్తి చెప్పారు. సాధ్యమైనంత త్వరగా లోక్‌సభలో స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులను భర్తీ చేయాలని ఆర్టికల్ 93 నిర్దేశిస్తోంది. స్వాతంత్ర్యానంతరం ఉప సభాపతి లేకుండానే లోక్‌సభ పదవీకాలం ముగియడం ఇదే మొదటిసారి. సాధారణంగా స్పీకర్ అధికార పక్షానికి చెందిన వారై ఉంటారు. సంప్రదాయకంగా డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షాలకు కేటాయిస్తారు. అయితే మోడీ ప్రభుత్వం ఆ సంప్రదాయానికి స్వస్తి చెప్పింది.

తక్కువ సిట్టింగ్స్‌తో సరి...

మోడీ పాలనలో పార్లమెంట్ సమావేశాలు జరిగే రోజులు తగ్గిపోతున్నాయి. ఇటీవలి చరిత్రలోనే 17వ లోక్‌సభ అత్యంత తక్కువ సార్లు సమావేశమైంది. ఈ సమావేశాలు 2024 బడ్జెట్ సమావేశాలతో కలిపి సుమారు 278 రోజులు జరిగాయి. ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి జరిగిన సమావేశాలు (1999-2004 మధ్య 13వ లోక్‌సభ) 423 రోజుల పాటు కొనసాగాయి. దానితో పోలిస్తే ఇప్పుడు 34% తక్కువ రోజులు పార్లమెంట్ సమావేశమైంది. గత సమావేశాలతో పోల్చినప్పటికీ ఈ తగ్గుదల స్పష్టంగా కన్పిస్తోంది. సమావేశాల్లో చర్చలు సరిగా జరగలేదన్న విషయాన్ని ఇది తేటతెల్లం చేస్తోంది. ఆర్డినెన్సులపై ఎక్కువగా ఆధారపడడం, తక్కువ సమయంలో చర్చ ముగించి బిల్లుల్ని ఆమోదించడం, పార్లమెంటరీ అజెండాలను తారుమారు చేయడం వంటి ఉదంతాలు కూడా చోటుచేసుకున్నాయి.

ఇవేం సంప్రదింపులు?

2009-14 మధ్య 71% బిల్లుల్ని స్టాండింగ్ కమిటీ పరిశీలనకు నివేదిస్తే 2019 నుండి కేవలం 16% బిల్లుల్ని మాత్రమే ఈ కమిటీకి పంపారు. 2014-2021 మధ్య పార్లమెంటులో ప్రవేశపెట్టిన 301 బిల్లుల్లో కేవలం 74 బిల్లుల్ని...అంటే 24.5% బిల్లుల్ని మాత్రమే సంప్రదింపుల కోసం సభ్యులకు పంపిణీ చేశారు. వీటిలో కూడా కనీసం 40 బిల్లుల్ని నిర్ధారిత సమయమైన 30 రోజుల ముందుగా సభ్యులకు అందజేయలేదు. మూడు క్రిమినల్ బిల్లులపై స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ ప్రజల నుండి వ్యాఖ్యలను ఆహ్వానించలేదు. దీనిపై పలువురు ప్రతిపక్ష ఎంపీలు తమ అసమ్మతిని తెలియజేస్తూ నోట్ అందజేశారు.

2014 తర్వాత కేవలం ఐదు బిల్లులు మాత్రమే సంయుక్త పార్లమెంటరీ కమిటీల ముందుకు వెళ్లాయి. 2016-2023 మధ్యకాలంలో 79% బడ్జెట్ ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదం పొందింది. వివిధ మంత్రిత్వ శాఖలకు చెందిన బడ్జెట్లను పరిశీలించేందుకు స్టాండింగ్ కమిటీలకు గతంలో 40 రోజుల సమయం ఇచ్చే వారు. దానిని 2021లో 20 రోజులకు కుదించారు.

ప్రతిపక్ష సభ్యుల ప్రశ్నల తొలగింపు

పార్లమెంట్ శీతాకాల సమావేశాల నుండి ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడంతో వారు లేవనెత్తిన సుమారు 290 ప్రశ్నలను తొలగించారు. వాస్తవానికి సస్పెన్షన్‌కు గురైన సభ్యుల ప్రశ్నలను తొలగించే నిబంధన ఏదీ అమలులో లేదు. కీలక బిల్లుల ఆమోదంలో చూపిన తొందరపాటు ప్రజాస్వామ్య ప్రక్రియను అపహాస్యం చేసింది. జవాబుదారీతనం లోపించింది. అసాధారణ రీతిలో సమావేశాల నుండి 146 మంది ఎంపీలను సస్పెండ్ చేయడం ఇదే తొలిసారి. ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్ తర్వాత క్రిమినల్ బిల్లులు, టెలికం బిల్లు, ఎన్నికల కమిషనర్ల నియామక బిల్లు వంటి కీలక బిల్లుల్ని ఉభయసభల్లో ఆమోదించారు. ఏదేమైనా సభ నుండి సస్పెండ్ అయిన సభ్యుల ప్రశ్నలను తొలగించడం ఇదే మొదటిసారి కాదు. 2015, 2020, 2023లో కూడా ఇలాగే జరిగిందని పౌర సమాజ బృందాలు విడుదల చేసిన ఛార్జిషీటు ఎత్తిచూపింది.

ఎంఎస్‌పి అమల్జేయకపోతే
ఎంఎస్‌కు భారతరత్న గౌరవం అసంపూర్ణం

- స్వామినాథన్ సిఫారసును కేంద్రం అమల్జేయాలి
- కేంద్రానికి సామాజిక కార్యకర్త ఇఎఎస్ శర్మ బహిరంగ లేఖ

న్యూఢిల్లీ : ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు కేంద్రం ఇటీవల భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో సామాజిక కార్యకర్త, మాజీ బ్యూరోక్రాట్ ఇఎఎస్ శర్మ స్పందించారు. డాక్టర్ స్వామినాథన్ ప్రతిపాదించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) ఫార్ములాను అమలు చేయకపోతే ఆయనకు ప్రకటించిన భారతరత్న గౌరవం అసంపూర్ణమవుతుందని ఆయన పేర్కొన్నారు. స్వామినాథన్ కమిటీ ప్రతిపాదించిన ఎంఎస్‌పిని అమలు చేయాలని కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు ఆయన కేంద్రానికి ఒక బహిరంగ లేఖను రాశారు.

స్వామినాథన్ కమిటీ ఫార్ములాను అమలు చేయాలనే డిమాండ్‌ను దేశవ్యాప్తంగా ఉన్న రైతులు నిరంతరం వినిపిస్తున్న విషయం విదితమే. ముఖ్యంగా, కేంద్రం తీసుకొచ్చిన మూడు వివాదాస్పద సాగు చట్టాలకు వ్యతిరేకంగా నిరసనలు తెలిపినపుడు అన్నదాతలు స్వామినాథన్ కమిటీ ప్రతిపాదనను అమలు చేయాలని తమ వాదనను గట్టిగా వినిపించారు. ఆ సమయంలో మూడు సాగు చట్టాలను వెనక్కి తీసుకున్న మోడీ సర్కారు.. స్వామినాథన్ కమిటీ ప్రతిపాదనను అమలు చేస్తామని రైతులకు హామీ ఇచ్చింది. వీటితో పాటు మరికొన్ని వాగ్దానాలనూ చేసింది. అయితే, స్వామినాథన్ కమిటీ సిఫారసులతో పాటు ఇతర వాగ్దానాలనూ కేంద్రం అమలు చేయకపోవటం గమనార్హం. ప్రస్తుతం స్వామినాథన్‌కు భారతరత్నను ప్రకటించటంతో ఆయన చేసిన సిఫారసుల అమలు మళ్లీ చర్చకు దారి తీస్తున్నది. 'డాక్టర్ స్వామినాథన్ కమిటీ విధానంలో హేతుబద్ధత స్పష్టంగా ఉన్నది. ఈ విధానంపై ఆధారపడిన ఎంఎస్‌పి.. వ్యవసాయం నుంచి వ్యవసాయేతర కార్యకలాపాలకు వలసలు లేకుండా, వ్యవసాయ భూమిని వ్యవసాయేతర పనులకు మళ్లించకుండా నిర్ధారిస్తుంది' అని కేంద్ర మంత్రివర్గ కార్యదర్శి రాజీవ్ గౌబాకు రాసిన లేఖలో ఇఎఎస్ శర్మ పేర్కొన్నారు. దేశంలోని తీవ్రమైన నిరుద్యోగ సమస్య రైతు సమాజం ఎదుర్కొంటున్న సమస్యల గురించి మాట్లాడుతుందని ఆయన వివరించారు. వివిధ పంటలు, ప్రత్యేకించి ఆహార పంటల ఎంఎస్‌పిని నిర్ణయించటానికి స్వామినాథన్ సిఫారసు చేసిన ప్రాతిపదికను పూర్తిగా అనుసరించటమే వ్యవసాయానికి డాక్టర్ స్వామినాథన్ చేసిన కృషిని గుర్తించటానికి ప్రభుత్వానికి అత్యంత సరైన మార్గమని ఇఎఎస్ శర్మ తన బహిరంగ లేఖలో పేర్కొన్నారు.

అమెరికాలో కుప్పకూలిన హెలికాప్టర్

- యాక్సిస్ బ్యాంకు సిఇఒ సహా ఆరుగురు మృతి

అమెరికా : అమెరికాలో హెలికాప్టర్ కుప్పకూలిన ఘటనలో యాక్సిస్ బ్యాంక్ (నైజీరియా) సిఇఒ సహా ఆరుగురు చనిపోయారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి కాలిఫోర్నియా-నెవడా సరిహద్దుల్లో చోటు చేసుకున్నట్లు సంబంధిత అధికారులు ఆదివారం తెలిపారు. యాక్సెస్ బ్యాంక్ సిఇఒ హెర్బర్ట్ విగ్వే తన భార్య, కుమారుడు మరికొందరితో కలిసి యూరోకాప్టర్ ఇసి 130 హెలికాప్టర్‌లో మొజావా ఎడారిపై ప్రయాణిస్తుండగా, శాన్ బెర్నార్డినో కౌంటీ వద్ద దాదాపు 3 వేల అడుగుల ఎత్తు నుంచి హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ఘోర దుర్ఘటనలో హెలికాప్టర్‌లోని వారంతా మృతి చెందారు. ఘటనా స్థలానికి సమీపంలో ఉన్న ఐ-15 జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్నవారు ప్రమాదాన్ని గమనించి వెంటనే 911కు కాల్ చేశారు. ఈ ప్రమాదంపై ఎఫ్ఎఎ దర్యాప్తు చేపట్టింది. మృతుల్లో నైజీరియాకు చెందిన ఎన్‌జీఎక్స్ గ్రూపు మాజీ ఛైర్మన్ అబింబోలా, ఇద్దరు పైలట్లు కూడా ఉన్నారు. 'ఆఫ్రికా బ్యాంకింగ్ రంగానికి ఇది పెద్దషాక్' అని వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్ ఎవాలా ఎక్స్‌లో పోస్టు చేశారు. హెర్బర్ట్ విగ్వే గతంలో గ్యారెంటీ ట్రస్ట్ బ్యాంక్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేశారు. నైజీరియా 'యాక్సిస్ బ్యాంక్' ఆఫ్రికాలోని పలు దేశాల్లో కార్యాకలాపాలు నిర్వహిస్తోంది.

పాక్ ఎన్నికల ఫలితాల్లోనూ రిగ్గింగ్

- గెలుపు ధ్రువీకరణ పత్రాలు తారుమారు
- పార్లమెంటు, రెండు రాష్ట్రాల అసెంబ్లీల్లో అతిపెద్ద పార్టీగా పిటిఐ
- విజయం మాదేనన్న ఇమ్రాన్
- 10 కేంద్రాల్లో నేడు రీపోలింగ్

ఇస్లామాబాద్ : సైన్యం కనుసన్నల్లో జరిగిన పాకిస్తాన్ సాధారణ ఎన్నికల్లో పోలింగ్ దగ్గర నుండి ఫలితాల వెల్లడి దాకా భారీ అవకతవకలు జరిగాయని లోకం కోడై కూస్తోంది. ఓట్ల రిగ్గింగే కాదు, చివరికి గెలుపు ధ్రువీకరణ పత్రాల జారీలోనూ అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. జైలులో ఉన్న మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మద్దతుతో పోటీ చేసిన ఇండిపెండెంటు అభ్యర్థులు పలు స్థానాల్లో విజయం సాధించారు.అయితే విజేతగా నిలిచినవారిని పరాజితులుగా పేర్కొంటూ తప్పుడు పత్రాలు (ఫారం 47)ను రిటర్నింగ్ అధికారి జారీ చేయడం వివాదానికి దారి తీసింది. ఆదివారం ఇమ్రాన్ ఖాన్ జైలు నుంచి పంపిన విజయోత్సవ సందేశంలో ఫలితాన్ని తారుమారు చేసిన ఆ రిటర్నింగ్ అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఎన్నికల్లో పిటిఐ మూడింట రెండొంతుల విజయం సాధించిందని ఆయన చెప్పారు. ఈ విజయానికి తోడ్పాటునందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా వుండగా భారీగా అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు రావడంతో పది కేంద్రాల్లో సోమవారం రిపోలింగ్ నిర్వహిస్తున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది.

ఓట్ల లెక్కింపు ముగిసే సరికి మొత్తం 264 స్థానాలకు గాను ఇమ్రాన్ నేతృత్వంలోని పిటిఐకి 93, పాకిస్తాన్ ముస్లిం లీగ్ (ఎన్)కు 75, పాకిస్తాన్ పీపుల్స్ పార్టీకి 54, ఇతర చిన్న పార్టీలకు 42 స్థానాలు వచ్చినట్లు ఎన్నికల సంఘం అధికారికంగా వెల్లడించింది. ఏ పార్టీకి పూర్తి మెజారిటీ లేనందున సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు సైన్యం మద్దతుతో నవాజ్ షరీఫ్, బిలావల్ జర్దారీ భుట్టో ప్రయత్నిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి..

బిజెపియేతర రాష్ట్రాలకు భారీగా నిధుల కోత

- కేరళ ఆర్థిక మంత్రి కెఎన్ బాలగోపాల్ విమర్శ

తిరువనంతపురం : బిజెపియేతర రాష్ట్రాల పట్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్ర స్థాయిలో వివక్షను కొనసాగిస్తూనేవుంది. తాజాగా ప్రవేశపెట్టిన కేంద్ర మధ్యంతర బడ్జెట్‌లోనూ బిజెపియేతర రాష్ట్రాలకు మోడీ సర్కార్ మొండి చేయి చూపిందని కేరళ ఆర్థిక మంత్రి కెఎన్ బాలగోపాల్ విమర్శించారు. సామాజిక మాధ్యమాల్లో ఈ మేరకు ఆయన పోస్టు చేశారు. పన్నుల పంపిణీ విధానంలో కేంద్రం అనుసరిస్తున్న తీరును ఆయన ఆక్షేపించారు. కేంద్రం నుంచి దక్షిణాది రాష్ట్రాలకు అందుతున్న నిధుల శాతంలో తగ్గుదల కనిపిస్తోందని బాలగోపాల్ విశ్లేషించారు. 'ఇతర రాష్ట్రాలకు ఇచ్చిన మొత్తాన్ని, కేరళ వచ్చిన మొత్తాన్ని గమనించండి. ఈ పీరియడ్‌లో కేంద్రం సేకరించిన నిధులు 11 రెట్లు పెరిగాయి. కానీ, కేరళకు పన్నులో పెరుగుదల మాత్రం 8.8 రెట్లుగానే ఉన్నది. అంటే, ఇందులో భారీ తగ్గుదల ఉన్నది. అందుకే కేరళ, పంజాబ్, కర్నాటక, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు ఈ విషయాన్ని లేవనెత్తుతున్నాయి' అని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలకు కూడా బిజెపి ప్రభుత్వం అరకొర నిధులతోనే సరిపెడుతోందని, దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వాలపై ఎనలేని భారాలు పడుతున్నాయని ఆయన తెలిపారు. దీంతో సామాజిక, సంక్షేమ పథకాల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల కొరతను ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. 'కేరళలో 62 లక్షల కుటుంబాలకు పెన్షన్లు ఇవ్వాలి. కేంద్రం నుంచి చెల్లింపులు లేకపోవటంతో పింఛన్ల విడుదలలో జాప్యం జరుగుతున్నది' అని ఆయన ఉదహరించారు. కేరళపై కేంద్రం వివక్ష చూపుతున్నదని రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలో ఢిల్లీలో నిరసన కార్యక్రమం జరిగిన విషయం విదితమే.

భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడమే

- వాగ్లేపై దాడిని ఖండించిన ఎడిటర్స్ గిల్డ్

న్యూఢిల్లీ : మహారాష్ట్రలోని పూనేలో సీనియర్ పాత్రికేయుడు నిఖిల్ వాగ్లేపై జరిగిన దాడిని ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా (ఈజీఐ) తీవ్రంగా ఖండించింది. వాగ్లే, మరి కొందరు పోలీసు రక్షణతో కారులో ప్రయాణిస్తుండగా ఓ రాజకీయ పార్టీకి చెందిన మితవాదులు ఆ వాహనంపై దాడి చేసి ధ్వంసం చేశారు. 'నిర్భయ్ బానో' కార్యక్రమంలో పాల్గొనేందుకు వాగ్లే, మానవ హక్కుల న్యాయవాది అసీం సరోద్, హక్కుల కార్యకర్త విషంభర్ చౌదరి కారులో వెళుతుండగా ఈ ఘటన జరిగింది. రాష్ట్ర సేవాదళ్ అనే సంస్థ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీకి ఇటీవల కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడంపై వాగ్లే విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయనపై దాడి జరిగిందని భావిస్తున్నారు.

ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ ఎడిటర్స్ గిల్డ్ ఓ ప్రకటన విడుదల చేసింది. వాగ్లే తన అభిప్రాయాన్ని తెలియజేశారని, ఈ కారణంతో ఆయనపై దాడి చేయడం చట్టవిరుద్ధం, అక్రమమని తెలిపింది. దాడికి బాధ్యులైన వారిపై కేసు నమోదు చేయాలని, వాగ్లేకు రక్షణ కల్పించాలని, ఆయన భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడాలని అధికారులను, మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. వాగ్లేపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడంపై కూడా ఎడిటర్స్ గిల్డ్ ఆందోళన వ్యక్తం చేసింది. పాత్రికేయులను భయపెట్టేందుకు, వేధించేందుకు క్రిమినల్ చట్టాలను దుర్వినియోగం చేయడాన్ని ఖండించింది. పాత్రికేయులపై వచ్చే ఫిర్యాదులను ఎఫ్‌ఐఆర్‌లుగా నమోదు చేసేటప్పుడు సంయమనం పాటించాలని, లేకుంటే విచారణ ప్రక్రియే శిక్షగా మారుతుందని ఎడిటర్స్ గిల్డ్ తెలిపింది.

బిజెపికి 370కి పైగా స్థానాలు

- మోడీ జోస్యం

ఝబువా : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బిజెపియే విజయం సాధిస్తుందని, 370కి పైగా స్థానాల్లో గెలుపొందుతామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జోస్యం చెప్పారు. మధ్యప్రదేశ్‌లో వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభ కార్యాక్రమాల్లో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఝబువా జిల్లాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. గత ఎన్నికలతో పోలిస్తే ఒక్కో పోలింగ్ కేంద్రంలో కనీసం 370 ఓట్లు అదనంగా పోలయ్యేలా చూడాలని, 370 స్థానాలకు పైగా బిజెపి అభ్యర్థులను గెలిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన కాంగ్రెస్.. 2024లో తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. ఎన్నికల సమయం వస్తేనే ఆ పార్టీకి గ్రామాలు, పేదలు, రైతులు గుర్తుకొస్తాయని ఆరోపించారు. కాంగ్రెస్ నినాదం 'దోచుకోవడం, విభజించడం' అని ఆయన పేర్కొన్నారు.

13, 14 తేదీల్లో యుఎఇ పర్యటన

ప్రధాని మోడీ ఈ నెల 13, 14 తేదీల్లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)లో పర్యటించనున్నారు. తొలి రోజు ఆయన యుఎఇ అధ్యక్షులు షేక్ మహమ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్‌తో సమావేశం కానున్నారు. అలాగే రాజధాని నగరమైన అబుధాబిలో నిర్మించిన తొలి హిందూ ఆలయాన్ని మోడీ ప్రారంభిస్తారు.

హంగరీ అధ్యక్ష పదవికి కటాలిన్ నోవాక్ రాజీనామా

హంగరీ : ఒక చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన దుండగుడికి హంగరీ ప్రభుత్వం క్షమాభిక్ష పెట్టడం ఉద్రిక్తతలకు దారితీసింది. దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో హంగరీ దేశాధ్యక్షులు కటాలిన్ నోవాక్ రాజీనామా చేశారు. ప్రజలను ఏ విధంగానూ నొప్పించే ఉద్దేశం తనకు లేదని ఈ సందర్భంగా ఆమె అన్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..కొంతకాలం క్రితం ఓ బాలల సంరక్షణాలయ ప్రధాన అధికారి అక్కడి చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలు వెలువెత్తాయి. ఈ దారుణాన్ని కప్పిపుచ్చేందుకు అధికారికి సహకరించిన మరో ఉద్యోగికి ప్రభుత్వ సూచన మేరకు ఆ దేశ అధ్యక్షులు కటాలిన్ నోవాక్ క్షమాభిక్ష ప్రసాదించారు. ఇటీవలే ఓ వెబ్ సైట్ ఈ విషయాన్ని బయటపెట్టడంతో దేశంలో ఒక్కసారిగా కలకలం రేగింది. వెంటనే ప్రధాని రాజీనామా చేయాలంటూ ... ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. గత శుక్రవారం నిరసనకారులంతా కలిసి అధ్యక్ష నివాసం ఎదుట ధర్నాకు దిగారు. ప్రధానితో పాటూ అధికార పక్షం మొత్తం ఈ ఘటనకు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. వరల్డ్ పోలో ఛాంపియన్‌షిప్స్‌లో భాగంగా ... హంగరీ మ్యాచ్‌ను చూడటానికి కటాలిన్ నోవాక్ ఖతర్‌కు వెళ్లారు. దేశంలో ఉద్రిక్త పరిస్థితులు, నిరసనల గురించి తెలిసిన వెంటనే ఆమె హుటాహుటిన స్వదేశానికి చేరుకున్నారు. శనివారం విమానం దిగిన వెంటనే తాను రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రజలను నొప్పించాలన్నది తన ఉద్దేశం కాదని అన్నారు. హంగరీ ప్రభుత్వాధికారం ప్రధాని చేతుల్లో ఉంటుందని తెలిపారు. అధ్యక్షులకు నామమాత్రపు అధికారాలు మాత్రమే ఉంటాయని చెప్పారు. తన నిర్ణయంతో బాధపడినవారందికీ క్షమాపణలు చెబుతున్నానని అన్నారు. మార్చి 2022లో కటాలిన్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. ఓ మహిళకు ఈ బాధ్యతలు దక్కడం చరిత్రలో ఇదే తొలిసారి. ఇదిలా ఉంటే, ప్రధాని విక్టర్ ఆస్బార్న్‌కు ప్రధాన మద్దతుదారుగా ఉన్న కటాలిన్ రాజీనామా చేయడం పరిస్థితులను మరింత ఉద్రిక్తంగా మార్చింది. అయితే ... ప్రధాని కూడా గద్దెదిగాలంటూ ప్రతిపక్షాలు నిరసనలు కొనసాగిస్తున్నాయి.

42కి పెరిగిన డయేరియా కేసులు

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు సమర్థించుకుంటున్నారు.

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు : మంత్రి రజని

గుంటూరు నగరంలో తాగునీటి విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ, నగరపాలక సంస్థ అన్ని రకాల నివారణ చర్యలూ తీసుకుంటున్నట్లు తెలిపారు. నగరంలో ప్రబలిన డయేరియాపై ఆదివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, నగర కమిషనర్, మేయర్ ఇతర అధికారులతో ఆమె సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ శుభ్రమైన తాగునీటిని అందించటానికి అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. బాధితుల నివాస ప్రాంతాల్లో 32 టీములతో ఇంటింటి సర్వే చేపడుతున్నామని, జిజిహెచ్‌లో, స్థానిక యుపిహెచ్‌సిలల్లో 24 గంటల వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. జిఎంసి నిర్లక్ష్యం వల్లే డయేరియా ప్రబలిందని, ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నా ఎందుకు శాశ్వత నివారణ చర్యలు తీసుకోవట్లేదని విలేకరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పకుండానే వెళ్లిపోయారు. ఈ సమావేశంలో కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి పాల్గొన్నారు.

జేసీబీలు, బుల్‌డోజర్లే ఆయుధాలు

- ముస్లిం ఆవాసాలు, ఆస్తులు లక్ష్యంగా విధ్వంసం
- ప్రార్థనా స్థలాలనూ వదలని పాలకులు
- బిజెపి పాలిత రాష్ట్రాల్లో ప్రహసనంగా మారిన కూల్చివేతలు
- దేశీయ, అంతర్జాతీయ చట్టాలు బేఖాతరు : నిగ్గు తేల్చిన అమ్నెస్టీ

న్యూఢిల్లీ : దేశంలో...ముఖ్యంగా బీజేపీ పాలిత అసోం, గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ముస్లింలు, వారి ఆస్తులపై యధేచ్ఛగా దాడులు జరుగుతున్నాయి. రాజధాని ఢిల్లీ ఆప్ పాలనలో ఉన్నప్పటికీ అక్కడ పెత్తనం అంతా బీజేపీదే. ఆ రాష్ట్రంలో సైతం మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని దాడులు సాగిస్తున్నారు. ఈ రాష్ట్రాల్లో జేసీబీలు, బుల్డోజర్లు ప్రయోగించి చట్టవిరుద్ధంగా, కక్షపూరితంగా ముస్లింల ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ జరిపిన విచారణలో తేలింది. ఈ రాష్ట్రాల్లో 128 నిర్మాణాల కూల్చివేతలు జరగ్గా వాటిలో 63 ఘటనలపై అమ్నెస్టీ విచారణ జరిపింది. వీటిలో కనీసం 33 సందర్భాలలో ముస్లింల ఆస్తుల్ని కక్షపూరితంగా నేలమట్టం చేశారు.

మైనారిటీ ఆస్తుల విధ్వంసానికి సంబంధించి అమ్నెస్టీ ఇంటర్నేషనల్ రెండు నివేదికలు రూపొందించింది. ముస్లింల నివాసాలు, వ్యాపార సంస్థలు, ప్రార్థనా స్థలాలను జేసీబీలు, బుల్‌డోజర్లు, ఇతర యంత్రాలతో చట్టవిరుద్ధంగా ధ్వంసం చేశారని ఆ నివేదికలు తేల్చాయి. ఈ విధ్వంసకాండను వెంటనే నిలిపివేయాలని అమ్నెస్టీ డిమాండ్ చేసింది. ఆస్తులు కోల్పోయి రోడ్డున పడ్డ వందలాది మందిని, న్యాయ నిపుణులను, పాత్రికేయులను, మత పెద్దలను అమ్నెస్టీ ఇంటర్వ్యూ చేసింది. సంఘటనా స్థలాలను సందర్శించి, బహిరంగ విచారణ జరిపింది. విధ్వంసానికి సంబంధించి అందుబాటులో ఉన్న 78 వీడియోలు, ఫొటోలు వాస్తవమా కాదా అనే విషయాన్ని పరిశీలించింది. వీటిలో 69 వీడియోలు, ఫొటోలను సామాజిక మాధ్యమాల నుండి సేకరించగా మిగిలినవి బాధితులు అందజేశారు. ఉపగ్రహ చిత్రాలు, గూగుల్ ఎర్త్, మాపిల్లరీ వంటి వేదికల ద్వారా కూడా అమ్నెస్టీ సమాచారాన్ని సేకరించింది.

పోలీసుల సాక్షిగా...

ముస్లింలు ఎక్కువగా నివసించే ప్రాంతాలను, వారి ఆస్తులను కూల్చివేతలకు లక్ష్యాలుగా ఎంచుకున్నారు. గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ముస్లింల ఆవాసాలకు సమీపంలో ఉన్న హిందువుల ఆస్తుల జోలికి మాత్రం వెళ్లలేదు. ఈ దారుణాలను అనేక మంది రాజకీయ నాయకులు, మీడియా సంస్థలు 'బుల్డోజర్ న్యాయం'గా అభివర్ణించాయి. ఇవి సుపరిపాలనకు మోడల్స్ అని వ్యాఖ్యానించాయి. కూల్చివేతల కారణంగా కనీసం 617 మంది గూడును, జీవనోపాధిని కోల్పోయారు. పురుషులు, మహిళలు, చిన్నారులు, వృద్ధులను బలవంతంగా నివాసాల నుండి ఖాళీ చేయించారు.

వారిని భయపెట్టి వేధించారు. పోలీసులు చట్టవిరుద్ధంగా దాష్టీకం ప్రదర్శించి, జరిగిన విధ్వంసానికి సాక్షిగా నిలిచారు.

బాధితులు కనీసం తమ వస్తువులను తీసుకోవడానికి కూడా అనుమతించకుండా పోలీసులు 39 ప్రాంతాల్లో బలప్రయోగం చేశారు. పోలీసులు తమపై దాడి చేసి, అవమానించారని 14 మంది బాధితులు అమ్నెస్టీకి తెలిపారు. 'పోలీసులు అమర్యాదకరంగా ప్రవర్తించారు. తలుపులు పగలగొట్టి ప్రజల్ని ఇళ్ల నుండి బయటికి లాగారు. లాఠీలతో చితకబాదారు' అని మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ బాధితురాలు వాపోయారు. ఆ రాష్ట్రంలోని సెంధ్వా ప్రాంతంలో 60 సంవత్సరాల వృద్ధురాలి ఇంటిని కూడా కనికరం లేకుండా కూల్చేశారు.

అధికార పరిధిని అతిక్రమించి...

కూల్చివేతల్లో బ్రిటన్ కంపెనీకి చెందిన జేసీబీలను విచ్చలవిడిగా ఉపయోగించారని అమ్నెస్టీ ఆరోపించింది. కూల్చివేతల్లో చట్టబద్ధత ఉన్నదా లేదా అనే విషయాన్ని నిర్ధారించుకోవడంలో భారతీయ మీడియా విఫలమైందని తెలిపింది. మీడియా సైతం ముస్లింల పట్ల వివక్ష చూపిందని వేలెత్తి చూపింది. అధికార పరిధిని అతిక్రమించి కూల్చివేతలకు పాల్పడ్డారని, వీటిని అంతర్జాతీయ చట్టాలు నిషేధించాయని వివరించింది. ఉల్లంఘనలకు పాల్పడిన వారిని బాధ్యులను చేయాలని, బాధితులకు తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది.

అమ్నెస్టీ ఏం చెప్పింది?

అక్రమ కట్టడాలు, ఆక్రమణల పేరు చెప్పి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అనేక కూల్చివేతలు జరిగాయని అమ్నెస్టీ తేల్చింది. ప్రభుత్వంలోని అత్యున్నత స్థాయి వ్యక్తుల ప్రోద్బలంతో ఈ విధ్వంసం సాగిందని తెలిపింది. ముస్లింలపై బుల్డోజర్లు ప్రయోగించాలని అనేక రాష్ట్రాల్లో అధికారులు ప్రత్యక్షంగానో పరోక్షంగానో సూచనలు చేశారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్‌పై 'బుల్డోజర్ బాబా' అనే ముద్ర కూడా ఉంది. 2022 ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో బీజేపీ పాలనలోని అసోం, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోనూ, ఆమ్‌ఆద్మీ పాలనలోని ఢిల్లీలోనూ మత ఘర్షణలు, నిరసనలు జరిగిన తర్వాత కక్షసాధింపు చర్యలుగా కూల్చివేతలు చోటుచేసుకున్నాయని అమ్నెస్టీ వివరించింది. బుల్‌డోజర్లతో విధ్వంసం జరపడం ఆటవికమని, భయానకమని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ సెక్రటరీ జనరల్ అగ్నెస్ కల్లామార్డ్ వ్యాఖ్యానించారు. ఈ చర్యలు న్యాయసమ్మతం కావని, చట్టవిరుద్ధమైనవని, వివక్షతో కూడినవని తెలిపారు. కూల్చివేతల కారణంగా కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యాయని చెప్పారు. ఇళ్లు, వ్యాపార సంస్థలు, ప్రార్థనా స్థలాలను ధ్వంసం చేయడం ద్వారా అధికారులు చట్టాన్ని తుంగలో తొక్కారని విమర్శించారు. విద్వేషాలను రెచ్చగొడుతూ, వేధింపులకు పాల్పడుతూ, హింసాత్మక చర్యల ద్వారా అధికారులు ఈ దురాగతాలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చట్టాలను తుంగలో తొక్కి...

కూల్చివేతల సమయంలో దేశీయ, అంతర్జాతీయ చట్టాలను ఎక్కడా అనుసరించలేదని అమ్నెస్టీ తన విచారణలో తేల్చింది. కనీసం ముందస్తు సంప్రదింపులు జరపలేదని, బాధితులకు నోటీసులు ఇవ్వలేదని, వారికి ప్రత్యామ్నాయ పునరావాస సౌకర్యం కల్పించలేదని, చివరికి రాత్రి సమయాలలో కూడా కూల్చివేతలు కొనసాగించారని వివరించింది.

తాజాగా గత నెలలో ముంబయిలోని మహ్మద్ అలీ రోడ్డులో మత ఘర్షణలు జరిగిన తర్వాత 40 నిర్మాణాలను కూల్చివేశారు. అయోధ్యలో జనవరి 22న బాలరాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమం జరిగిన అనంతరం ఈ ఘర్షణలు చెలరేగాయి.

బాధితులను బలవంతంగా ఖాళీ చేయించి కూల్చివేతలకు పాల్పడ్డారని, ఇలా చేయడాన్ని అంతర్జాతీయ మానవ హక్కుల చట్టం, అంతర్జాతీయ ఒప్పందం (ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులు) నిషేధించాయని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ తెలిపింది. 'కూల్చివేతల కోసం జేసీబీలనే కాదు. అనేక ఇతర యంత్రాలను కూడా ఉపయోగించారు. వీటిని తరచుగా వినియోగించడంతో పలు కంపెనీలు ఆర్థికంగా ప్రయోజనం పొందాయి' అని పేర్కొంది. కొన్ని జేసీబీలను కొనుగోలు చేయడం కూడా జరిగింది.

బుల్డోజర్లతో ముస్లిముల నివాసాలను కూల్చుతున్న అధికారులు (ఫైల్)

రాయలంలో భారీ అగ్నిప్రమాదం

- పాత ప్లాస్టిక్ స్క్రాప్ గొడౌన్‌లో మంటలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్ (పశ్చిమగోదావరి జిల్లా)

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం రాయలం గ్రామ పరిధిలో ప్లాస్టిక్ స్క్రాప్ గొడౌన్‌లో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. పెద్దఎత్తున అగ్నికీలలు ఎగసి పడి దట్టమైన పొగ అలుముకోవడంతో చుట్టుపక్కల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. భీమవరంలోని రెండు ఫైరింజన్లతోపాటు ఆకివీడు ఫైరింజన్ కూడా రంగంలోకి దిగి మంటలు అదుపు లోకి తీసుకొచ్చాయి. జిల్లా అసిస్టెంట్ ఫైరాఫీసర్ సిహెచ్.సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో సుమారు రెండు గంటలకుపైగా 20 మంది సిబ్బంది కష్టపడి మంటలను అదుపు చేశారు. చుట్టుపక్కల అపార్టుమెంట్లు ఉండటంతో వాటిలోని ప్రజలంతా ఆందోళనకు గురయ్యారు. ఈ సందర్భంగా ప్రమాదంపై ఫైరాఫీసర్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ గొడౌన్ వెనుక భాగంలో చెత్తకు నిప్పంటించడంతో ఆ మంటల కారణంగా గొడౌన్‌లో సామగ్రి దగ్ధమైం దన్నారు. ఈ ప్లాస్టిక్‌కు మండే గుణం ఉండడంతో ఒక్కసారిగా మంటలు, పొగ పెద్దఎత్తున ఎగసిపడ్డా యన్నారు. నష్టం అంచనా వేయాల్సి ఉందని తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రచయిత గంటేడ గౌరునాయుడు

సాహితీ లోకానికి మాస్టారు 'కారా'

- కారా మాస్టారు కథలతో కొద్దిసేపు ముచ్చట్లలో కవులు, రచయితలు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

నేటి ఆధునిక కాలంలో కారా మాస్టారు రచనలు సాహితీ ప్రపంచానికి దిక్సూచని, సాహితీ లోకంలో అందరికీ మాస్టారు కారా మాస్టారు అని పలువురు వక్తలు కొనియాడారు. కారా మాస్టారి కథలతో కొంతసేపు సాహితీ కార్యక్రమం స్నేహ కళా సాహితీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగింది. పార్వతీపురంలోని గిరిజన్ భవన్‌లో సాహితీవేత్త గోపాలరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత గంటేడి గౌరీనాయుడు, ఆముదాలవలస సాహితీ స్రవంతికి చెందిన పివిఎన్ మూర్తి, సహజ సాహితీ సాంస్కృతిక సంస్థకు చెందిన ఎన్‌కె బాబు, శ్రీకాకుళం సిక్కోలు బుక్ ట్రస్టు రచయిత, వక్త దుప్పల రవికుమార్, రాజాం రచయితల సంఘానికి చెందిన రచయిత పొదిలాపు శ్రీనివాసరావు మాట్లాడుతూ కారా మాస్టారి సాహిత్యాన్ని, వ్యక్తిత్వాన్ని, నిబద్ధతను వివరించారు. రచయిత, కథకుడు, విమర్శకుడైన కారా మాస్టారి రచనల శైలి సరళంగా ఉంటుందన్నారు. ఆయన రాసిన యజ్ఞం ఆధునిక తెలుగు సాహిత్యంలో కన్యాశుల్కంతో సమానమైనదని పేర్కొన్నారు. కారా భౌతికంగా లేకపోయినా ఆయన కథలు, రచనలు, ఆయన ఏర్పాటు చేసిన కథానిలయం చిరకాలం ఉంటాయని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాల్లోని మురపాకలో పుట్టి విశాఖలో లెక్కల మాస్టారుగా పనిచేసిన కారా మాస్టారు సాహితీ ప్రపంచంలో అందరికీ మాస్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రచయితలు శాంతి, కుమార్ వర్మ, జగదీష్, పక్కి రవీంద్ర, స్వామి నాయుడు, చిన్నంనాయుడు, సోమేశ్వర రావు, గణపతిరావు, రంజిత్ కుమార్, సత్యనారాయణ, గోవింద, బూరి ఇళ్లంనాయుడు, పాలకొండ రామలింగ స్వామి, పిల్లా లక్ష్మన్నాయుడు, పిల్లా తిరుపతిరావు, శ్రీకాకుళం సాహితీ అరసం, సాహితీలహరి, జనవిజ్ఞాన వేదిక, స్నేహ కళా సాహితీలకు చెందిన కవులు, రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

పట్టాలిచ్చారు.. స్థలాలు మరిచారు..

- లబ్ధిదారుల ఎదురు చూపులు
- నాలుగేళ్లుగా అందని వైనం
- హడావిడిగా రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

తమకు నవరత్నాల పథకంలో ఇళ్ల పట్టాలిచ్చి నాలుగేళ్ల అయిందని, ఇప్పటివరకు స్థలాలు చూపించలేదని సామర్లకోట మండలం కాపవరం గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు వారం రోజుల క్రితం కాకినాడ కలెక్టరేట్‌కు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. నిరుపేదలమైన 91 మందికి ప్రభుత్వం పట్టాలు ఇచ్చినా ఇప్పటివరకు అనువైన స్థలాలు ఎందుకు చూపించలేదని అడుగుతుంటే అధికారులుః, పాలకులు పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. ఇలా జిల్లాలో వేలాదిమంది లబ్ధిదారులకు హడావుడిగా ఇంటి పట్టాలు ఇచ్చినప్పటికీ నేటికీ స్థలాలు చూపించకపోవడంతో అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. వారికి సమాధానం చెప్పే నాథుడే కరువయ్యారు. కొన్నిచోట్ల స్థలాలు చూపించినా అవి సుదూరంగా ఉండటం, నివాసయోగ్యంగా లేకపోవడం, కనీస సౌకర్యాలు లేకపోవడం వంటి కారణాల వల్ల లబ్ధిదారులు వెనకడుగు వేస్తున్నారు. అధికారులకు ఈ సమస్యలు తెలిపినా పట్టించుకోకపోవడం వల్ల అనేకమంది నిర్మాణాలు ఇంకా ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రభుత్వం హడావిడిగా రిజిస్ట్రేషన్లు చేయిస్తుండడంతో స్థలాలు అందుకోలేని లబ్ధిదారులు తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

కాకినాడ జిల్లావ్యాప్తంగా 1.20 లక్షల ఇళ్ల పట్టాలు మంజూరు చేయగా సుమారు 70 వేల్ల ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో ఇప్పటివరకు దాదాపు 30 వేల వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని జిల్లా అధికారులు తెలిపారు. సుమారు 10 వేల మంది లబ్ధిదారులకు పట్టాలు చేతికి అందజేశారు కానీ నేటికీ ఇళ్ల స్థలాలు చూపించలేదు. స్థలాలు సేకరించినా లే అవుట్లను అభివద్ధి చేయలేదు. కొన్నిచోట్ల అభివద్ధి చేసినా లబ్ధిదారులు అయిష్టత చూపుతున్నారు. గ్రామాలకు సుదూరంగా ఉండడంతోపాటు నివాసానికి అనుకూలంగా లేకపోవడంతోనే పలువురు ఆ స్థలాల్లోకి వెళ్లేందుకు ఇష్టపడడం లేదు. సామర్లకోట మండలం వికె.రాయపురంలో సుమారు 330 మంది లబ్ధిదారులకు నాలుగేళ్ల క్రితం దోమలపాకలు పొలాల మధ్యలో స్థలాలు సేకరించారు. లబ్ధిదారులు తొలుత అనుకూలంగా లేక వాటిని నిరాకరించారు. ప్రస్తుతం వైసిపి పాలన ముగుస్తున్న నేపథ్యంలో సంబంధిత స్థలాలను ఎత్తుచేసి రోడ్లు, విద్యుత్తు వంటి సౌకర్యాలు కల్పించి వెంటనే తమకు స్థలాలను అప్పగించాలని పలువురు కోరుతున్నారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం కలెక్టర్ కతికా శుక్లాకు తమ గోడు వెళ్ళబోసుకునేందుకు వచ్చారు. అనంతరం జెసిని కలిసి సమస్యలను చెప్పుకున్నారు. నాలుగేళ్ల క్రితం పట్టాలిచ్చినా మాకు ఇస్తామన్న స్థలాలను అభివద్ధి చేయలేదని, కనీసం దారి మార్గం కూడా లేదని జెసి వద్ద వారు వాపోయారు. ఇదే మండలం మాధవపట్నం గ్రామానికి చెందిన సుమారు 500 మంది లబ్ధిదారులకు అదే గ్రామంలో స్థలాలను సేకరించినా నేటికీ చేతికి ఇవ్వలేదు. సుమారు నాలుగు అడుగులు ఎత్తు మేర భూమిని మట్టితో కప్పాల్సి ఉంది. అధికారులు లేఅవుట్లలో సౌకర్యాలు కల్పించకుండానే ఇప్పుడు హడావిడిగా రిజిస్ట్రేషన్లు చేయడం మొదలుపెట్టారు. భూమిని అభివృద్ధి చేయకుండా స్థలాలు చూపకుండా రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారంటూ లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.

సామర్లకోట మున్సిపాలిటీలో ఐదు వార్డులకు చెందిన 424 మంది లబ్ధిదారులకు వేట్లపాలెంలో 268 మందికి, హుస్సేన్‌పురం వద్ద 156 మందికి స్థలాలు చూపించగా లబ్ధిదారులు మొదట్లో విముఖత వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఇమ్మని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. పిఠాపురంలో సుమారు 4 వేల మంది లబ్ధిదారులకు నరసింగపురం-1, 2 లేపుట్లలో 56 ఎకరాలు, ఏడు కాలువల ప్రాంతంలో 18.49 ఎకరాలు, విరవాడ రోడ్డులోని 3.42 ఎకరాలు, కుమారపురం కొబ్బరితోటలో 1.82 ఎకరాలు, కుమారపురం వాటర్ వర్క్స్ వద్ద 5 ఎకరాలు, మసీదు మాన్యంలో 5.25 ఎకరాలు సేకరించారు. అభివృద్ధి చేయకుండానే ఇప్పుడు ఆయా స్థలాల్లో తుప్పలు తొలగించి, పొక్లెయిన్లతో చదునుచేసి, సరిహద్దు రాళ్లు పాతుతున్నారు. సచివాలయాల వారీగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. రౌతులపూడి మండలంలో 3,372 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా 3,012 మందికి పట్టాలు పంపిణీ చేశారు. నేటికీ ఒక్క ఇంటి నిర్మాణం కూడా ప్రారంభం కాలేదు. సుమారు 90 ఎకరాలను సేకరించారు. మండల కేంద్రంలో 12 ఎకరాల్లో 620 మందికి పట్టాలు ఇచ్చినా కోర్టు వివాదాలతో ఇక్కడా ఇంటి నిర్మాణాలు మొదలు కాలేదు.

తీరంలో ఆలివ్‌రిడ్లే తాబేళ్ల మృత్యువాత

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు (శ్రీకాకుళం జిల్లా)

సముద్ర జలాల్లో కాలుష్యం ఏరివేతలో ముఖ్య భూమిక పోషించే ఆలివ్ రిడ్లే తాబేళ్లకు కష్టమొచ్చింది. అరుదైన ఈ రకం తాబేళ్లు సముద్రంలో మృత్యువాత పడుతూ ఒడ్డుకు కొట్టుకొస్తున్నాయి. ఆదివారం ఓ తాబేలు మృతి చెంది ఒడ్డుకు చేరుకుంది. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి, గుణుపల్లి, నువ్వలరేవు, కొత్తపేట, మంచినీళ్లపేట, డోకులపాడు, మెట్టూరు, కంబాలరాయుడుపేట సముద్ర తీరాలకు తరచూ తాబేళ్లు కొట్టుకొస్తున్నాయి. అక్కుపల్లి సముద్ర తీరానికి మృత్యువాత పడిన తాబేళ్లు పదుల సంఖ్యలో కొట్టుకొస్తున్నాయి. చేపల వేటకు వివియోగించే బోట్లకు, వలలకు తగిలి మృతి చెందుతున్నాయి. తీరంలోని ఇసుకలో గుడ్లు పెట్టేందుకు వస్తున్నప్పుడు ఇలా చనిపోతున్నాయి. తాబేళ్ల కళేబరాలు వల్ల తీరంలో దుర్గంధం వ్యాపిస్తోంది. అక్కుపల్లి శివసాగర్ బీచ్ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుంది. కళేబరాల దుర్గంధంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. సముద్ర జలాలను శుభ్రపరిచే తాబేళ్లు చనిపోతుండడంతో పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సముద్ర అలివ్ రిడ్లే తాబేళ్లను సంరక్షించాలని పలువురు కోరుతున్నారు.



దోలీలో తరలిస్తున్న కుటుంబ సభ్యులు

గిరిజనులకు తప్పని డోలీ కష్టాలు

ప్రజాశక్తి- అనంతగిరి (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఆదిమ జాతి పివిటిజి గిరిజన ప్రజలకు అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్తున్న మాటలు ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి. మారుమూల గిరిజన గ్రామాల్లో కనీసం రోడ్డు సౌకర్యాలు లేక రోగులు, బాలింతలు, గర్భిణులకు డోలి కష్టాలు తప్పడం లేదు. అనంతగిరి మండలం మారుమూల పెద్దకోట పంచాయతీ పరిధి ఆదిమ జాతి పివిటిసి మద్రేబు గ్రామానికి చెందిన కొండతాబేలి లింబో అనే గిరిజనుడు గత వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు గ్రామం నుండి దట్టమైన అటవీ ప్రాంతం కొండ కోనల నడుమ సుమారు పది కిలోమీటర్ల దూరం దుప్పటి డోలి కట్టి తునిసిబు గ్రామం రోడ్డుకు చేర్చారు. అక్కడి నుండి ప్రథమ చికిత్స నిమిత్తం పాడేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యులు రోగికి చికిత్స అందించడంతో ఆరోగ్య పరిస్థితి కుదుటపడింది. అనంతరం ఆస్పత్రి నుండి తునిసిబు గ్రామం వరకు ప్రయివేటు వాహనంలో తరలించి అక్కడ నుండి కుటుంబ సభ్యులు మద్రేబు గ్రామం వరకు డోలి సాయంతో తిరిగి తరలించారు. గ్రామానికి కనీసం రోడ్డు సౌకర్యం కల్పించాలని ఈ నెల 14వ తేదీన ఉమ్మడి విశాఖ జిల్లాలో జరిగే జిల్లా పరిషత్ సమావేశంలో ఆందోళన చేపడతామని పివిటిజి సంఘం జిల్లా అధ్యక్షులు, సిపిఎం కార్యవర్గ సభ్యులు కె.గోవింద్ తెలిపారు.

బిజెపిపై కార్పొరేట్ కంపెనీల నిధుల వర్షం

- ఎన్నికల బాండ్లలో కాషాయపార్టీకే అత్యధిక నిధులు
- 2022-23లో దాదాపు రూ.1300 కోట్లు
- కాంగ్రెస్ కంటే ఏడు రెట్లు అధికం

న్యూఢిల్లీ : అటవీ హక్కులను, సామాన్య ప్రజానీకం హక్కులను కాలారాస్తూ, రాజ్యాంగ మౌలిక సూత్రాలను కూడా పక్కన పెట్టేసి కార్పొరేట్ కంపెనీల సేవలో తరిస్తున్న కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న బిజెపిపై కార్పొరేట్ కంపెనీలు నిధుల వర్షం కురిపిస్తున్నాయి. ఇందుకోసమే అన్నట్టుగా మోడీ సర్కార్ అమల్లోకి తీసుకొచ్చిన 'ఎన్నికల బాండ్ల స్కీమ్' బిజెపికి అధిక మొత్తంలో నిధులను తెచ్చిపెడుతోంది. 2022-23లో ఎలక్టోరల్ బాండ్ల ద్వారా అధికార బిజెపికి రూ.1300 కోట్లు వచ్చి చేరాయి. కాంగ్రెస్‌కు అందిన విరాళాల కంటే ఇది ఏడు రెట్లు అధికం కావటం గమనార్హం.

2022-23 ఆర్థిక సంవత్సరంలో బిజెపికి మొత్తం రూ.2120 కోట్ల నిధులు అందాయి. ఇందులో 61 శాతానికి పైగా ఎలక్టోరల్ బాండ్ల నుంచే వచ్చి చేరటం గమనార్హం. ఎన్నికల సంఘానికి సమర్పించిన పార్టీ వార్షిక ఆడిట్ నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో బిజెపికి వచ్చిన విరాళాల మొత్తం రూ.1775 కోట్లుగా ఉన్నది. బిజెపి మొత్తం ఆదాయం 2021-22లో రూ.1917 కోట్లు కాగా.. అది 2022-23లో రూ.2360.8 కోట్లకు పెరగటం గమనార్హం. బిజెపి 2022-23 ఆర్థిక సంవత్సరంలో వడ్డీల నుంచి రూ.237 కోట్లను పొందింది. 2021-22లో ఇది రూ.135 కోట్లుగా ఉన్నది.

ఇందుకు విరుద్ధంగా, కాంగ్రెస్‌కు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా వచ్చిన విరాళాలు పడిపోయాయి. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఆ పార్టీకి అందిన విరాళాల మొత్తం రూ.236 కోట్లు కాగా.. 2022-23 ఆర్థిక సంవత్సరంలో అది రూ.171 కోట్లకు పడిపోయింది.

టిడిపికి పది రెట్లు పెరిగిన నిధులు

రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన టిడిపికి గతంలో ఎన్నికల బాండ్ల ద్వారా వచ్చిన నిధుల కంటే ఈ దఫా పది రెట్లు నిధులు పెరిగాయి. 2022-23లో ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రూ.34 కోట్లు వచ్చి చేరాయి. అంతకముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది పది రెట్లు అధికం కావటం గమనార్హం. అలాగే ఉత్తరప్రదేశ్‌లోని ప్రధాన ప్రతిపక్షం సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), 2021-22లో ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రూ.3.2 కోట్లను పొందింది. 2022-23లో మాత్రం ఆ పార్టీకి ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ఎలాంటి నిధులూ అందలేదు.

యువతకు ప్యాకేజీ హుళక్కేనా?

- కటాఫ్ డేట్ విషయంలో బాధితుల ఆవేదన
- మూడేళ్లు దాటితే రీనోటిఫికేషన్ నిబంధనకు తూట్లు
- నిరాశ, నిస్పృహలలో పోలవరం నిర్వాసిత యువత

ప్రజాశక్తి- విఆర్.పురం (అల్లూరి సీతారామరాజు జిల్లా)

పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో నిర్వాసిత కుటుంబాల్లోని 18 ఏళ్లు నిండిన వారికి ప్యాకేజీ అమలు ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్ర ప్రయోజనాల కోసం నిర్మిస్తున్న ప్రాజెక్టుకు తాము ఆస్తులు, భూములు, సర్వం ధారపోసి నిలువనీడలేని నిర్వాసితులుగా మారితే, తమ పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరి దుర్మార్గమని వీరంతా ఆవేదన చెందుతున్నారు.ఎప్పుడో 2017లో జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఇప్పుడు పరిహారం ఇస్తున్నారు. దానినే కటాఫ్ డేట్‌గా నిర్ణయించి సర్వే చేసి పరిహారం ఎవరికి ఇవ్వాలో నిర్ణయిస్తున్నారు. దీంతో, అప్పటికి 18 ఏళ్లు నిండని వారికి, ఇప్పుడు ఏడేళ్ల తర్వాత ఆ వయస్సు దాటినా ప్యాకేజీ అందని పరిస్థితి ఉండడం దారుణం నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారు. 2017 నాటికి 18 ఏళ్లు నిండకపోయినా, ఇప్పుడు 2024 నాటికి ఎంతోమంది యువతీ, యువకులు వయోపరిమితి దాటి ఉన్నారు. వారికి ఉండడానికి ఇల్లు లేదు. భవిష్యత్‌లో ఇల్లు నిర్మించుకుందామంటే స్థలం ఉండదు. పోలవరం ప్రాజెక్టులో సర్వం కోల్పోవడంతో వారికి ఆర్థిక భరోసా కూడా లేదు. ఇలా అన్నింటికీ చెడి, రోడ్డున పడే దుస్థితి నెలకొందని వారంతా మనోవేదనకు గురవుతున్నారు. భూసేకరణ, పునరావాసం, ప్యాకేజీల చట్టం ప్రకారం నోటిఫికేషన్ వచ్చి మూడేళ్లు గడిచిన తర్వాత దాన్ని అమలు చేయలేని పరిస్థితి ఉంటే, రీ నోటిఫికేషన్ జారీ చేసి, కొత్తగా గ్రామాల్లో సర్వే చేసి, గ్రామ సభలను నిర్వహించాలి. అప్పటికి అర్హులైన వారిని లబ్ధిదారుల గుర్తించి, పరిహారం, ప్యాకేజీ ఇవ్వాల్సి. ఇదే విషయమై గతేడాది వరద ముంపు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి చింతూరు మండలం కల్లేరు గ్రామంలో ప్రకటించారు. అయితే, ఈ మాట అమలు అడుగు కూడా ముందుకు పడలేదు. పోలవరం నిర్వాసితుల సమస్యలు, పునరావాసం, ప్యాకేజీలపై 2006 నుంచి నేటి వరకు బాధితుల పక్షాల సిపిఎం పోరాటం చేస్తూనే ఉంది. ఎన్నో రకాల ఉద్యమాలు, పాదయాత్రలు, బహిరంగ సభలు, రౌండ్ టేబుల్ సమావేశాలు, ఢిల్లీలో ధర్నాలు, రాష్ట్రపతిని కలిసే ప్రయత్నం వంటి ఎన్నో రూపాల్లో ఉద్యమించింది. పోలవరం ముంపు ప్రాంతాల్లో సిపిఎం రాష్ట్ర, దేశ నాయకులు పర్యటించారు. భద్రాచలంలో అప్పటి ఎమ్మెల్యే సున్నం రాజయ్య నాయకత్వంలో జరిగిన నిరసనలో ఆందోళనకారులపై పోలీసు కాల్పులు వంటి ఘటనలు మరువలేనివి. బాధితులకు నేటికీ న్యాయం జరగడం లేదు. నేతలు ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మిగిలిపోతున్నాయని నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారు.

రఫాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు

- హమాస్ అగ్రనేత కుమారుడు మృతి ?

గాజా : గాజా సిటీపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇజ్రాయెల్ భీకర దాడుల కారణంగా ఇప్పటికే వేల సంఖ్యలో మరణాలు నమోదయ్యాయి. ఇక, తాజాగా... గత శనివారం రఫా నగరంపై ఇజ్రాయెల్ బాంబులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో హమాస్ అగ్రనేత ఇస్మాయిల్ హనియే కుమారుడు హజెం హనియే(22) కూడా మతి చెందినట్టు సమాచారం. స్థానిక మీడియాతో పాటు ఇజ్రాయెల్ సోషల్ మీడియాలో ఈ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. హజెం హనియే ప్రస్తుతం ఓ కాలేజీలో చదువుతున్నట్లు సమాచారం.

రఫా నగరంపై ఇజ్రాయెల్ సైన్యం బాంబుల వర్షాన్ని కురిపించింది. వైమానిక దాడులతో విరుచుకుపడింది. తాజాగా రఫా నగరంపై ఇజ్రాయెల్ చేసిన దాడిలో కనీసం 44 మంది పాలస్తీనావాసులు చనిపోయారు. ఈ నగరంలో 14 లక్షల మంది జీవిస్తున్నట్లు అంచనా. ఈ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహు ఆదేశించిన కాసేపటికే దాడులు చేయడం గమనార్హం. గాజాలో దాడులు ప్రారంభమైన తర్వాత లక్షలాది మంది రఫాకు నిరాశ్రయులుగా వెళ్లి తలదాచుకుంటున్నారు. ఇప్పుడు అక్కడ కూడా ఇజ్రాయెల్ దాడులు చేస్తుండటంతో అక్కడి ప్రజలు భయం గుప్పిట్లో బతుకుతున్నారు.

రఫాపై ఇజ్రాయెల్ దాడులను పలు దేశాలు ఖండిస్తున్నాయి. పౌరుల విషయంలో ఒక నిర్ణయానికి రాకుండా రఫాను ఆక్రమించుకోవాలనుకోవడం సరికాదని అమెరికా వాదిస్తోంది. గాజా జనాభాలో సగం మంది అక్కడే తలదాచుకుంటున్నారని యూకే విదేశాంగ మంత్రి డేవిడ్ కామెరూన్ అన్నారు. వేలాది మంది సామాన్య పౌరులు మరణించే ప్రమాదం ఉందని నెదర్లాండ్స్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇజ్రాయెల్ ఈ విషయంలో వెనక్కి తగ్గకపోతే తీవ్ర పరిణామాలుంటాయని సౌదీ అరేబియా హెచ్చరించింది.

ఫారం నం.ఐఎన్‌సి-26

డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం



పిల్లలూ,

మీ తరగతి గదిలో కోతి నుంచి మనిషి ఎలా ఉద్భవించాడో తెలియజేసే జీవ పరిణామ క్రమ చిత్రపటం ఉంది కదా! సమస్త జీవరాశులను ఎవరో సృష్టించారన్న నమ్మకాలను ఆ సిద్ధాంతం పటాపంచలు చేసింది. ఈ రోజు జీవ పరిణామ క్రమాన్ని ప్రపంచానికి తెలియజేసిన చార్లెస్ డార్విన్ పుట్టిన రోజు.

ఫిబ్రవరి 12, 1809లో ఇంగ్లాండ్ ష్రూస్‌బరీలో చార్లెస్ డార్విన్ జన్మించాడు. ఆయన ప్రతిపాదించిన జీవ పరిణామ సిద్ధాంతం భూమి మీది జీవుల పరిణామ క్రమాన్ని తెలియజేస్తుంది. ఆధునిక జీవ శాస్త్రంలో ఈ సిద్ధాంతం (డార్వినిజం) చాలా మార్పు తెచ్చింది. మనిషి ఒక రకమైన కోతి జాతి నుంచి పరిణామం చెందుకుంటూ వచ్చాడని ఈ సిద్ధాంతం చెబుతుంది.

1844లోనే డార్విన్ జీవపరిణామ క్రమంపై ఒక స్పష్టతకు వచ్చాడు. ఇందుకోసం ఆయన ఎన్నో పరిశోధనలు చేశాడు. సముద్రయానం చేస్తున్న డార్విన్‌ని సముద్ర జీవులు, శిలాజాల అవశేషాలు విశేషంగా ఆకర్షించేవి. వాటన్నింటిపై అధ్యయనం చేశాక డార్విన్ 1838లో సహజ ఎంపిక సిద్ధాంతాన్ని రూపొందించాడు. ప్రస్తుతం ప్రపంచంలో కనబడుతున్న రకరకాల ప్రాణులు మొదటినుంచీ లేవని ఈ సిద్ధాంతం చెబుతోంది. కుక్కలూ, నక్కలూ, తోడేళ్ళూ ఒక జాతివనీ, పిల్లులూ, చిరుత పులులూ, పెద్ద పులులూ, సింహాలూ మరొక జాతికి చెందినవనీ, గుర్రాలూ, గాడిదలూ, జీబ్రాలూ ఒక ఇంకో జాతివని ఆయన వివరించారు. గతంలో వీటికి తలొక 'పూర్వీకుడూ' ఉండి ఉండాలి. ఇంకా వెనక్కెళితే ఈ 'ఆదిమ' శునకానికీ, మార్జాలానికీ, అశ్వానికీ జన్మనిచ్చిన మరేదో మృగం ఉండి ఉంటుంది. ఇంకా ప్రాచీన యుగంలో ఈ క్షీరదాలకీ, తక్కిన చేపలూ, తాబేళ్ళూ, జలచరాలూ, పక్షులూ అన్నిటి ఆవిర్భావానికీ దారితీసిన ప్రాణి ఉండి ఉంటుంది. వీటిలో కొన్ని శాకాహారులుగానూ, మరికొన్ని మాంసాహారులుగానూ రూపొందడానికి భౌతిక ప్రేరణలూ, పర్యావరణ పరిస్థితులే కారణాలు అయి ఉంటాయి. ఈ విషయాలన్నిటిపై డార్విన్ చాలా పరిశోధనలు చేశాడు. మనుషుల చర్మం రంగూ, ముఖకవళికలూ అన్నీ కాస్తకాస్తగా మారడానికి జీవ పరిణామ ప్రక్రియలే కారణమని అర్థం అవుతుంది.

నేను గీసిన బొమ్మ

ఆర్.ప్రవళిక,
9వ తరగతి,
జెడ్‌పిహెచ్ స్కూల్,

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఇంటర్ పరీక్షలకు ఇలా ప్రిపేరవ్వండి!

విద్యార్థులకు ఇది పరీక్షల కాలం. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ ఇలా అన్ని కోర్సుల పరీక్షలు వరుసగా వస్తుంటాయి. పరీక్షల తేదీ దగ్గర పడుతుండటంతో విద్యార్థులు ప్రిపరేషన్‌లో మునిగితేలుతున్నారు. మొదటిగా సిబిఎస్ఇ సిలబస్‌తో పది, ఇంటర్ పరీక్షలు ఈనెల 15 నుంచే ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే సిలబస్ రివిజన్లు కూడా అయిపోయాయి. చదివిన అంశాలను సరిగ్గా గుర్తుపెట్టుకోవాలి. సరైన పద్ధతిలో పరీక్షలకు సన్నద్ధమైతే మంచి స్కోర్ సాధించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పరీక్షల ప్రిపరేషన్ ఏ విధంగా ఉండాలో నిపుణుల సూచనల గురించి తెలుసుకుందాం.

పది తర్వాత ఇంటర్మీడియట్ విద్యార్థి జీవితంలో కీలకమైన మలుపు. ఏపీలో మార్చి 1 నుంచి, తెలంగాణాలో ఈనెల 28 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్‌లో సబ్జెక్టులు భవిష్యత్తులో ఉన్నత విద్య కోర్సుల్లో చేరడానికి, ఆయా కోర్సుల్లో రాణించటానికి కీలకంగా నిలుస్తాయి. అందువల్ల చదువుతున్న గ్రూప్ సబ్జెక్టులపై విద్యార్థులు పూర్తి పట్టు సాధిస్తే తద్వారా వార్షిక పరీక్షల్లో మంచి స్కోర్ సొంతం చేసుకోవచ్చు.

ఎంపిసి : మ్యాథమేటిక్స్ షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్‌పై బాగా దృష్టి పెట్టాలి. పూర్తిచేసిన సిలబస్‌ను క్రమపద్ధతిలో రివిజన్ చేసుకోవాలి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్ ప్రాక్టీస్ చేసేటప్పుడే జేఈఈ మెయిన్, ఎంసెట్ తదితర పోటీ పరీక్షలను దృష్టిలో పెట్టుకోవాలి. ఆయా సిలబస్ అంశాలకు అనుగుణంగా ఆబ్జెక్టివ్ ప్రశ్నలు- సమాధానాల రూపంలో ప్రిపేర్ కావాలి. వీక్లీ, మంత్లీ టెస్టులు రాయటం పరీక్షలకు బాగా దోహదపడతాయి.

మ్యాథమెటిక్స్ : ద్వితీయ సంవత్సరం మ్యాథమెటిక్స్‌కు సంబంధించి ద్విపద సిద్ధాంతాల ప్రసాదాలు-సంయోగాలు-సంభావ్యత-వృత్తాలు, సమాకలనులు- నిశ్చిత సమాకలనులు- అవకలన సమీకరణలు- డిమూవర్స్ సిద్ధాంతం, వర్గ సమీకరణలు, పరావలయం వంటి అంశాలను బాగా పునశ్చరణ చేయాలి. మొదటి సంవత్సరం విద్యార్థులు వెక్టార్ అల్జీబ్రాబీ మాత్రికలు, సరళ రేఖలు, సరళరేఖ యుగ్మాలు, అవకలనాలు, అప్లికేషన్ల్ అండ్ డెరివేషన్స్‌పై ఎక్కువ సమయం కేటాయించాలి.

ఫిజిక్స్ : ఈ సబ్జెక్టుకు సంబంధించి విద్యార్థులు స్వల్ప, అతి స్వల్ప సమాధాన ప్రశ్నల సాధనకు కృషి చేయాలి. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి మూవింగ్ ఛార్జెస్ అండ్ మ్యాగ్నటిజం, కరెంట్ ఎలక్ట్రిసిటీ ఆప్టికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ పరమాణువు, వేవ్స్ సెమీ కండక్టర్ ఎలిమెంట్స్ వంటి అంశాల్లో పట్టు సాధించే విధంగా రివిజన్‌కు సమయం కేటాయించాలి. మొదటి సంవత్సరం విద్యార్థులు రొటేటరీ మోషన్, యూనివర్సల్ గ్రావిటేషన్ లా, ఎస్కేప్ వెలాసిటీ, సింపుల్ హార్మోనిక్ మోషన్, సర్ఫేస్ టెన్షన్, థర్మో డైనమిక్స్ వంటి అంశాలకు ఎక్కువ సమయం కేటాయించాలి. ఫిజిక్స్‌లో లాంగ్ ఆన్సర్ కొశ్చన్స్‌ను సాధన చేసేటప్పుడు అంచెలవారీగా పరిష్కార విధానాన్ని అనుసరించాలి. ఫలితంగా సదరు సమస్యకు సంబంధించి ప్రాథమిక భావనల పైనా పట్టు సాధించేందుకు ఆస్కారం లభిస్తుంది.

సమయ పాలన : విద్యార్థులు పరీక్షల కోసం మొత్తం సిలబస్ రివిజన్ చేయాలి. రీ రివిజన్ ప్రిపరేషన్‌కు సరైన ప్రణాళికతో ముందుకు సాగాలి. పాఠ్యాంశాల్లో అధిక, తక్కువ ప్రాధాన్యత ఇచ్చే అంశాలను గుర్తించాలి.

విజువల్ లెర్నింగ్ : చదివే విషయాన్ని విలువలైజేషన్ చేసుకుంటే సులభంగా గుర్తుంటుంది. ఈ రూపంలో గుర్తుకు తెచ్చుకునే విధంగా మైండ్ మ్యాపింగ్ చేసుకోవచ్చు. సంక్లిష్ట పాఠాలను ఇలా సులభంగా గుర్తుపెట్టుకోవచ్చు.

క్లిష్ట భావలపై కేంద్రీకరణ : క్లిష్ట భావలను సులభంగా అర్థం చేసుకోవటానికి ఫ్లాష్‌కార్డ్ పద్ధతి ఉపయోగపడుతుంది. పేపర్‌పై అంశాలను రాయటం, తద్వారా టెస్ట్ చేసుకోవటం ఈ పద్ధతి. ఇలా చేయటం వల్ల సమాచారం రీ కలెక్ట్ అవుతుంది. తక్కువ సమయంలో ఎక్కువ కాన్సెప్ట్‌లు గుర్తించుకోవచ్చు.

పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పరీక్షలంటే ఆందోళన చెందకూడదు.
- ఆందోళన చెందితే జ్ఞాపకశక్తి తగ్గిపోయి చదువుకున్న పాఠాలను మరిచిపోయే ప్రమాదం ఉంది.
- మనసును ప్రశాంతంగా ఉంచుకోండి. వీలైతే తీరిక దొరికినప్పుడు కళ్ల మూసుకుని కాసేపు రిలాక్సు ఇవ్వాలి.
- కేవలం గైడ్స్ మీదనే ఆధారపడకండి. టెక్ట్‌బుక్స్‌ను కూడా రిఫర్ చేస్తూ చదవటం ఎంతో మేలు.
- అన్ని సబ్జెక్టుల ప్రశ్నలకు సమాధానాలను పాయింట్స్ వారీగా రాసుకోవాలి. అలా రాసుకోవటం వల్ల అవి బాగా గుర్తుంచాటాయి.
- ముఖ్యమైన పాయింట్లను విడిగా వేరే నోట్‌బుక్‌లో రాసుకోండి. బయటకు వెళ్లినప్పుడు దాన్ని మీ వెంటే ఉంచుకుంటే మననం చేసుకోవటానికి వీలవుతుంది
- సాధ్యమైనంతవరకూ మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలి.
- కడుపు ఉబ్బరం కలిగించే మసాలాలు, ఇతర చిరుతిళ్లను వదిలేయడం మంచిది.
- తాజా పండ్లు, పండ్ల రసాలు, పాలు ఎక్కువగా తీసుకోవాలి.
- వేకువ జామునే నిద్రలేచి చదువుకోవటం మంచిది
- ఆయా సబ్జెక్టుల నమూనా ప్రశ్నాపత్రాలను సాల్వ్‌చేయటం ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి
- పరీక్ష సమాయానికి అనుగుణంగా మోడల్ పేపర్లు పూర్తిచేయటానికి నిరంతరం ప్రయత్నించాలి
- రాత్రిళ్లు త్వరగా నిద్రపోవాలి. తెల్లవారుజామున లేవాలి
- ప్రతిరోజూ కాసేపు వ్యాయామం చేస్తే చురుగ్గా ఉంటారు. కాసేపు నడిచినా మెదడు చురుగ్గా పనిచేస్తుంది
- టైమ్‌టేబుల్‌కు అనుగుణంగా ప్రతిరోజూ దినచర్య ఉండేలా చూసుకోవాలి
- క్రమపద్ధతిలో పరీక్షలకు సన్నద్ధం కావాలి
- సందేహాల నివృత్తికి లెక్చరర్లతో మాట్లాడటం మేలు.

బి.సీతారామ్
ఫిజిక్స్ సీనియర్ లెక్చరర్, కేంద్రీయ విద్యాలయ-1, మధురానగర్, విజయవాడ.

'విరామం నుండి వచ్చేశా'

సమంత ప్రస్తుతం ఏ సినిమా షూటింగ్‌ల్లో పాల్గొనడం లేదు. మయాసైటిస్ వ్యాధితో బాధపడుతున్న ఆమె 'ఒక సంవత్సరం సినిమాలకు గ్యాప్ ఇచ్చి చికిత్స తీసుకుంటున్నా' అని గతంలో ప్రకటించారు. ఆ సమయం పూర్తి అయిన సందర్భంగా సమంత అభిమానులను ఖుషీ చేసే అప్డేట్ ఒకటి చెప్పారు. తాను తీసుకున్న ఏడాది టైం అయిపోయిందని, త్వరలోనే షూటింగ్స్ మొదలు పెట్టనున్నట్లు తెలిపారు. ఇన్స్టాగ్రామ్ స్టోరీలో ఈ విషయాన్ని వెల్లడించారు. 'కొన్ని రోజులుగా చాలామంది నన్ను ఎప్పుడు షూటింగ్‌ల్లో పాల్గొంటారు అని అడుగుతున్నారు. అయితే ఆ రోజులు దగ్గరలోనే ఉన్నాయి. త్వరలోనే నేను షూటింగ్‌లో పాల్గొన బోతున్నాను. ఇన్ని రోజులు జాబ్ లెస్‌గా ఉన్నా.. ఇక ఇప్పుడు పని చేయాల్సిన సమయం వచ్చేసింది. నా హెల్త్ గురించి నా ఫ్రెండ్స్‌తో కలిసి ఒక పాడ్ కాస్ట్ ప్రోగ్రాం చేసాం. అది త్వరలోనే రిలీజ్ కానుంది' అంటూ చెప్పారు. ఈ ప్రకటనతో సమంత ఫాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



50 ఏళ్ల ఇండస్ట్రీ

టాలీవుడ్ సీనియర్ నటుడు, నిర్మాత మురళీ మోహన్ నటుడిగా 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ జరిగాయి. డా. మురళీమోహన్ 50 ఇయర్స్ ఆఫ్ ఫిల్మ్ ఎక్సలెన్స్ కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ రాజకీయ నాయకులతో పాటు మురళీ మోహన్ అభిమానులు పెద్దయెత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సినీ ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్నారు.

తెలుగు సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడిగా వీరశంకర్

ఆదివారం ఉదయం తెలుగు సినీ దర్శకుల సంఘం ఎన్నికలు నిర్వహించారు. దర్శకులు వీర శంకర్, సముద్ర ప్యానెల్‌లు బరిలోకి దిగాయి. ఈ పోటీలో వీరశంకర్ ప్యానల్ ఘన విజయం సాధించింది. సంఘం అధ్యక్షుడిగా డైరెక్టర్ వీర శంకర్ ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్స్‌గా వశిష్ఠ, సాయి రాజేష్.. జనరల్ సెక్రటరీలుగా మద్దినేని రమేష్ , సుబ్బారెడ్డి.. ట్రెజరర్‌గా పి.వి. రమణరావు విజయం సాధించారు. దర్శకుల సంఘంలో 1500 మంది యాక్టివ్ మెంబర్స్ ఉన్నారు. ఇందులో మొత్తం 1113 ఓట్లు పోలవగా వీరశంకర్‌కు 536 రాగా సముద్రకు 304 వచ్చాయి.

'బచ్చన్' సెట్స్‌లో 'ఈగల్' సందడి

రవితేజ 'ఈగల్' సినిమా విడుదలై హిట్ టాక్ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రవితేజ పాల్గొంటున్న 'మిస్టర్ బచ్చన్' సెట్స్‌లో 'ఈగల్' సంబరాలు నిర్వహించారు. హరీష్ శంకర్ దర్శకత్వంలో రవితేజ నటిస్తున్న 'మిస్టర్ బచ్చన్' సినిమా హిందీ 'రైడ్' సినిమాకి రీమేక్‌గా తెరకెక్కుతోంది. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. భాగ్యశ్రీ హీరోయిన్‌గా పరిచయం అవుతున్న ఈ షూటింగ్ లొకేషన్‌లోనే 'ఈగల్' సినిమా సక్సెస్ సెలబ్రేషన్స్ జరిగాయి. హరీష్ శంకర్, రవితేజ, భాగ్యశ్రీ, ఇతర క్రూ ఈ సెలబ్రేషన్స్‌లో పాల్గొన్నారు.

'హరోం హర..' పాట విడుదల

సందీప్ కిషన్ నటిస్తోన్న 'ఊరు పేరు భైరవకోన' చిత్రం నుండి తాజాగా 'హరోం హర..' అంటూ సాగే పాట విడుదలైంది. ఈ పాటను చైతు సత్సంగి ఆలపించడంతో పాటు లిరిక్స్ అందించారు. శేఖర్ చంద్ర సంగీతం అందించారు. ఫాంటసీ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రానికి వీఐ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ ఫిబ్రవరి 16న థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా తెరకెక్కిస్తున్నారు.

'భామా కలాపం 2' ట్రైలర్

ప్రియమణి ప్రధాన పాత్రలో నటిస్తున్న 'భామా కలాపం 2' నుండి తాజాగా ట్రైలర్ విడుదలైంది. 2022లో ఓటీటీలో విడుదలైన 'భామా కలాపం' సినిమాకి ఇది సీక్వెల్‌గా వస్తోంది. అభిమన్యు దర్శకత్వం వహిస్తున్నారు. అనుపమ (ప్రియమణి) తన సొంత యూట్యూబ్ ఛానల్ ద్వారా వచ్చిన మనీతో హోటల్ పెట్టుకుందామనుకుంటుంది. ఈ క్రమంలోనే కుకింగ్ ఐడల్ 2023 సీజన్ స్టార్ అవుతుంది. అయితే కుకింగ్ ఐడల్ 2023లో పాల్గొనడానికి వెళ్లిన అనుపమ అక్కడ ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొంది. అసలు అనుపమకు డ్రగ్స్‌కు సంబంధం ఏంటి అనే విషయాలతో ఆసక్తికరంగా ట్రైలర్ కట్ చేశారు. ఈ సినిమా ఫిబ్రవరి 16 నుంచి ఆహాలో స్ట్రీమింగ్ కానుంది.

తరం మారింది. వేదిక మారింది. అయినా, ఫలితం మారలేదు. 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో టీమ్ ఇండియాకు ఆస్ట్రేలియా తీరన వేదన మిగల్చగా.. ఇప్పుడు 2024 ఐసీసీ అండర్-19 ప్రపంచకప్ టైటిల్ పోరులో యువ భారత్‌కు కుర్ర కంగారూల చేతిలో భంగపాటు తప్పలేదు. రికార్డు ఆరో టైటిల్ వేటలో ఫేవరేట్‌గా ఫైనల్లో బరిలో దిగిన భారత కుర్రాళ్లు.. ఛేదనలో చతికిల పడ్డారు. సెమీఫైనల్ వరకు ఎదురులేని ప్రదర్శన కనబరిచిన యువ భారత్.. ఆఖరు మెట్టుపై అంచనాలను అందుకోలేదు. యువ ఆస్ట్రేలియా నాల్గోసారి అండర్19 ప్రపంచకప్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. అండర్19 ప్రపంచకప్ ఫైనల్లో యువ భారత్‌కు ఇది నాల్గో ఓటమి.

కుర్రాళ్లదీ అదే వ్యథ

- టైటిల్ పోరులో ఆసీస్ చేతిలో ఓటమి
- 254 పరుగుల ఛేదనలో యువ భారత్ చతికిల
- నాల్గోసారి టైటిల్ దక్కించుకున్న ఆస్ట్రేలియా

ఐసిసి అండర్-19 ప్రపంచకప్ ఫైనల్

బెనోని (దక్షిణాఫ్రికా)

యువ భారత్ ఆశలు ఆవిరి. ఐసిసి అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో నిరాశే ఎదురైంది. 254 పరుగుల ఛేదనలో కుర్రాళ్లు చేతులెత్తేశారు. 43.5 ఓవర్లలో 174 పరుగులకే ఆలౌటయ్యారు. 79 పరుగుల తేడాతో యువ ఆస్ట్రేలియా విజయం సాధించింది. అండర్19 ప్రపంచకప్ చాంపియన్‌గా నిలిచింది. ఛేదనలో ఓపెనర్ ఆదర్శ్ సింగ్ (47, 77 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), హైదరాబాదీ ఆల్‌రౌండర్ మురుగన్ అభిషేక్ (42, 46 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) మినహా అందరూ విఫలమయ్యారు. ముషీర్ ఖాన్ (22, 33 బంతుల్లో 3 ఫోర్లు), కెప్టెన్ ఉదయ్ సహరన్ (8), సచిన్ దాస్ (9), ప్రియాన్షు మోలియ (9) నిరాశపరిచారు. తొలుత ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 7 వికెట్లకు 253 పరుగులు చేసింది. హర్జాస్ సింగ్ (55, 64 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), వీజెన్ (48, 66 బంతుల్లో 5 ఫోర్లు), ఒలీవర్ (46, 43 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), హ్యారీ డిక్సన్ (42, 56 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు.

ఛేదనలో చతికిల : యువ భారత్ లక్ష్యం 254 పరుగులు. బ్యాటింగ్ లైనప్‌లో అందరూ మంచి ఫామ్‌లో ఉండటంతో కుర్రాళ్లు అంచనాలను అందుకుంటారనే అనుకున్నారు. కానీ కుర్ర కంగారూలు ఖతర్నాక్ గేమ్‌తో పైచేయి సాధించారు. ఓపెనర్ ఆదర్శ్ సింగ్ (47) రాణించినా.. అర్శిన్ కులకర్ణి (3), ఉదయ్ సహరన్ (8), సచిన్ దాస్ (9), అరవెల్లి అవినాశ్ (0), రాజ్ లింబాని (0) తేలిపోయారు. ముషీర్ ఖాన్ (22), ఆదర్శ్ క్రీజులో ఉండగా ఛేదనపై ఆశలు సజీవంగా నిలిచాయి. కానీ ముషీర్ నిష్క్రమణతో బ్యాటింగ్ లైనప్ పేకమేడలా కుప్పకూలింది. 91 పరుగులకే ఆరు వికెట్లు చేజార్చుకుని ఓటమి కోరల్లోకి కూరుకుంది. హైదరాబాదీ ఆల్‌రౌండర్ మురుగన్ అభిషేక్ (42) ఆసీస్ వేగాన్ని అడ్డుకట్ట వేశాడు. ఐదు ఫోర్లు, ఓ సిక్సర్‌తో మెరిసిన అభిషేక్ ఒత్తిడిలో ఆకట్టుకునే ఇన్నింగ్స్ నమోదు చేశాడు. కానీ అతడికి సహచరుల నుంచి ఎటువంటి మద్దతు దక్కలేదు. మురుగన్ అభిషేక్ వికెట్‌తో ఆసీస్ కుర్రాళ్లు విజయాన్ని అందుకున్నారు. యువ ఆసీస్ బౌలర్లలో మహ్లి బీయర్డ్‌మ్యాన్, మెక్‌మిలాన్ మూడేసి వికెట్లు పడగొట్టారు. బియర్డ్‌మ్యాన్ భారత టాప్-3 వికెట్లతో ఆసీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

బౌలర్లు మెరిసినా..! : టైటిల్ పోరులో టాస్ నెగ్గిన ఆసీస్ కుర్రాళ్లు తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నారు. ఒత్తిడితో కూడిన ఫైనల్లో భారత బౌలర్లు రాణించారు. ఆస్ట్రేలియా బ్యాటర్లను కట్టడి చేశారు. ఆ జట్టులో ఏ బ్యాటర్ భారీ స్కోరు చేయకుండా నిలువరించారు. అయినా, సమిష్టి ప్రదర్శనతో ఆసీస్ మంచి స్కోరు నమోదు చేసింది. ఓపెనర్ శామ్ (0) నిరాశపరిచినా.. హ్యారీ డిక్సన్ (42), కెప్టెన్ హ్యు వీజెన్ (48) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. రెండో వికెట్‌కు ఈ జోడి 78 పరుగులు జోడించింది. హర్జాస్ సింగ్ (55) అర్ధ సెంచరీతో మెరిశాడు. రియాన్ హిక్స్ (20)తో కలిసి హర్జాస్ సైతం 66 పరుగులు జోడించాడు. దీంతో ఆసీస్ మంచి స్కోరు ఖాయం చేసుకుంది. లోయర్ ఆర్డర్‌లో ఒలీవర్ పీకె (46) రాణించటంతో విలువైన భాగస్వామ్యాలు సాధ్యమయ్యాయి. అండర్సన్ (13), టామ్ స్ట్రాకర్ (8) ఆకట్టుకున్నారు. దీంతో 50 ఓవర్లలో 7 వికెట్లకు ఆస్ట్రేలియా 253 పరుగులు చేసింది. భారత బౌలర్లలో రాజ్ లింబాని (3/38) మూడు వికెట్లు పడగొట్టగా.. నమన్ తివారీ (2/63) రెండు వికెట్లు తీసుకున్నాడు. హైదరాబాదీ స్పిన్నర్ మురుగన్ అభిషేక్ (0/37) పరుగుల పొదుపు పాటించినా వికెట్ తీయలేదు. సామీ పాండే, ముషీర్ ఖాన్‌లు తలా ఓ వికెట్ ఖాతాలో వేసుకున్నారు.

సంక్షిప్త స్కోరు వివరాలు :

ఆస్ట్రేలియా19 : 253/7 (హర్జాస్ 55, వీజెన్ 48, ఒలీవర్ 46, రాజ్ 3/38, నమన్ తివారీ 2/63)

భారత్ 19 : 174/10 (ఆదర్శ్ సింగ్ 47, మురుగన్ అభిషేక్ 42, బియర్డ్‌మ్యాన్ 3/15, మెక్‌మిలాన్ 3/43)

ఇంగ్లాండ్‌కు ఎదురుదెబ్బ!

రాజ్‌కోట్ : భారత్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లాండ్‌కు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. గాయాలతో టీమ్ ఇండియా ఇప్పటివరకు కీలక ఆటగాళ్ల సేవలను కోల్పోగా.. ఇప్పుడు ఇంగ్లాండ్ వంతు!. ఇంగ్లాండ్ సీనియర్ స్పిన్నర్ జాక్ లీచ్ మోకాలి గాయంతో భారత్‌తో చివరి మూడు టెస్టులకు దూరమయ్యాడు. ఈ మేరకు ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు ఆదివారం తెలిపింది. హైదరాబాద్ టెస్టులో ఫీల్డింగ్ చేస్తూ జాక్ లీచ్ మోకాలి గాయానికి గురయ్యాడు. జాక్ లీచ్ గాయంతోనే హైదరాబాద్ టెస్టులో బౌలింగ్ చేశాడు. కానీ విశాఖపట్నం టెస్టుకు దూరంగా ఉన్నాడు. సిరీస్‌లో విరామ సమయంలో జట్టుతో పాటు అబుదాబి (యుఎఈ) చేరుకున్న జాక్ లీచ్.. అక్కడ వైద్య పరీక్షల అనంతరం డాక్టర్ల సూచనల మేరకు స్వదేశానికి పయనం కానున్నాడు.

నిఖత్ జరీన్‌కు సిల్వర్

స్ట్రాంజా స్మారక బాక్సింగ్ టోర్నీ

సోఫియా (బల్గేరియా) : భారత స్టార్ బాక్సర్, రెండు సార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్ స్ట్రాం జా స్మారక బాక్సింగ్ టోర్నమెంట్‌లో రజత పతకం సాధించింది. పసిడి ఫేవరేట్‌గా సోఫియాలో అడుగుపెట్టిన నిఖత్ జరీన్ ఆదివారం జరిగిన మహిళల 50 కేజీల టైటిల్ పోరులో 2-3తో పరాజయం పాలైంది. ఫైనల్లో ఉజ్బెకిస్థాన్ బాక్సర్ బొబొకులోవ సబినాకు ముగ్గురు రిఫరీలు మొగ్గు చూపగా.. నిఖత్ జరీన్‌కు ఇద్దరు రిఫరీలే అధిక పాయింట్లు ఇచ్చారు. 28-29, 28-29, 28-29తో సబినాకు ముగ్గురు రిఫరీలు స్కోర్ ఇచ్చారు. 29-28, 30-27తో ఇద్దరు రిఫరీలు నిఖత్‌కు స్కోరు ఇచ్చారు. దీంతో భిన్నాభిప్రాయ నిర్ణయంతో నిఖత్ జరీన్ సిల్వర్‌తో సరిపెట్టుకుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68

सत्यमेव जयते
Goverment Of India

సాధికారత కలిగిన యువత 'వికసిత్' పరిష్కారాన్ని బలోపేతం చేస్తోంది

రోజ్‌గార్ మేళా ద్వారా ప్రభుత్వంలో యువత నియామకం కోసం

దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన 1 లక్ష మందికి పైగా అభ్యర్థులకు నియామక పత్రాల పంపిణీ

వీరి ద్వారా
ప్రధాన మంత్రి
నరేంద్ర మోడీ

12 ఫిబ్రవరి 2024, ఉ.10.30గం.లు

(వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా)

- భారత ప్రభుత్వం, భాగస్వామి రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో, కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తోంది
- మహిళలు, ప్రత్యేక వికలాంగులు మరియు ఆకాంక్షాత్మక జిల్లాల అభ్యర్థులకు ప్రత్యేక ప్రయోజనాలు
- సులభమైన, న్యాయమైన మరియు పారదర్శక ఎంపిక ప్రక్రియ
- UPSC, SSC రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ మరియు IBPS వంటి ఏజెన్సీల ద్వారా అన్ని నియామకాలు
- ప్రత్యేక ఆన్‌లైన్ సిస్టమ్ ద్వారా ఖాళీలు మరియు రిక్రూట్‌మెంట్ ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ
- "కర్మయోగి ప్రారంభం మాడ్యూల్ ద్వారా వివిధ ప్రభుత్వ శాఖలలో కొత్తగా నియమితులైన వారందరికీ ఆన్‌లైన్ శిక్షణా కోర్సులు

CBC19101/13/0020/2324

DD NEWS కార్యక్రమం యొక్క ప్రత్యక్ష ప్రసారాన్ని DD న్యూస్‌లో చూడండి

శిక్షణకు సంబంధించిన మరింత సమాచారం కోసం, కర్మయోగి మాడ్యూల్ వెబ్‌సైట్: https://igotkarmayogi.gov.in ని దర్శించండి లేదా QR కోడ్‌ని స్కాన్ చేయండి